




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 101 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 21 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 101 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 21 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన

# వార్ రూమ్ ఏర్పాటు చేయాలి



- 'ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం.. హైదరాబాద్ అనువైన ప్రదేశం: ఏఐ సదస్సులో రేవంత్ రెడ్డి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి
- ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్ష
- జీఎస్టీ కౌన్సిల్‌లా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**మన దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ పరిణామాలను పర్యవేక్షించడానికి, ఇతర అవసరాల కోసం వార్ రూమ్ అవసరమని, ఇలాంటి వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశమని ఆయన అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సు-2026 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి కంటే కృత్రిమ మేధ (ఏఐ) ఎక్కువ తెలివితేటలు కలిగి ఉందని అన్నారు. ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే అన్ని వసతులతో ఏర్పాటు చేశామని వెల్లడించారు. హైదరాబాద్ వంటి నగరంలో ప్రతి ఆరు నెలలకోసారి ఏఐకి సంబంధించిన సదస్సులు జరగాలని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ తరహా 'ఏఐ' కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఏఐ దుర్వినియోగం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్‌కు వచ్చి పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి టెక్ సంస్థలను కోరారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలని అన్నారు. కృత్రిమ మేధను ఉపయోగించుకుంటే వ్యవసాయం సహా అన్ని రంగాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఏఐ మానవ జీవితాల్లో పెను మార్పులు తీసుకువస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మనిషికి ఎన్నో పరిమితులు ఉండవచ్చని, అదే మనిషి సృష్టించిన ఏఐ ఫలితాలను మనం చూస్తూనే ఉన్నామని అన్నారు. గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చిందని, ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం, ఏఐ శకం వచ్చిందని పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలకు భారతీయులే సీఈవోలుగా ఉన్నారని గుర్తు చేశారు.



## భారత్ తో సంబంధాల్లో

# కొత్త మలుపు

**వీసా సేవలను పునఃప్రారంభించిన బంగ్లాదేశ్**

- ఢిల్లీలో వీసా సేవలను ప్రారంభించిన బంగ్లాదేశ్
- ప్రధానిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే కీలక నిర్ణయం
- త్వరలోనే బంగ్లాదేశ్ లో వీసా సేవలను ప్రారంభించనున్న భారత్

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం శుక్రవారం నుంచి భారతీయులకు అన్ని రకాల వీసాల మంజూరు సేవలను పునఃప్రారం భిం చింది. గత రెండు నెలలుగా పూర్తిగా నిలిచిపో యిన ఈ సేవలు

- మిగతా 2లో



# మేమే ప్రతిపక్షం

**అన్ని పార్టీలను జనం వ్యతిరేకిస్తున్నరు**

- బడ్జెట్ లో బీసీలకు 20 వేల కోట్లు ఇవ్వాలె
- ట్యాంక్ బండ్ పై జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలె
- పూలే విగ్రహం అసెంబ్లీలోనూ ఏర్పాటు చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను తామే పోషి స్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ట్యాంక్ బండ్ పై ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్ వ్యూపార్క్ మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిపక్షాలుగా బీజేపీ, బీఆర్ఎస్ విఫలమయ్యాయని, అందుకే ప్రజలకు ఇష్టం లేకున్నా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటేశారని అన్నారు.రా ష్ట్రంలో చాలా చోట్ల ప్రజలు ఏ పార్టీకి మెజార్టీ ఇవ్వలేదని చెప్పారు. అన్ని పార్టీలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. హంగ్ వచ్చిన చోట కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్ప డిందని ఆరోపించారు. ప్రభుత్వం బీసీ రిజ ర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లా లని డిమాండ్ చేశారు. బీసీ బిల్లుల ఆమోదం కోసం ప్రధాని మోడీపై సీఎం రేపంత్ రెడ్డి ఒత్తిడి పెంచాలన్నారు. బడ్జెట్ లో బీసీలకు 20 వేల కోట్లు పెట్టి

- మిగతా 2లో



## 15 ఏళ్ల సమయమిచ్చినా

## మీరేం చేయలేరు..

# నాకు 5 నిమిషాలు ఇచ్చే దమ్ముందా?

- మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారన్న రాజాసింగ్
- ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని సవాల్
- ఒవైసీ సోదరులపై రాజాసింగ్ ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు 15 నిమిషాలు అడిగారు, కానీ నాకు ఐదు నిమిషాల

- మిగతా 2లో

## నాంపల్లి కోర్టుకు మరోసారి

# బాంబు బెదిరింపులు



- ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు
- బాంబు పేలబోతోందని బెదిరించిన దుండగులు
- బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఈమెయిల్ ద్వారా కోర్టు సిబ్బందికి ఈరోజు బెదిరింపులు పంపారు. కోర్టు ప్రాంగణంలో బాంబు అమర్చామని, దానికి టైం కూడా సెట్ చేశామని, బాంబు పేలబోతోందని ఈమెయిల్ ద్వారా బెదిరించారు. వెంటనే కోర్టు సిబ్బంది పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్, ఫైర్ సిబ్బందికి

- మిగతా 2లో

## ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో

# ఉద్రిక్తత...

**చొక్కాలు విప్పి నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు**



- భారత్ మండపంలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళన
- చొక్కాలు విప్పి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు
- నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్యకర్తలు
- నిరసనకారులను అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది
- ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసుల వెల్లడి

ఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కలకలం సృష్టించారు. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' జరుగుతున్న సమయంలో, కొందరు కార్యకర్తలు హఠాత్తుగా చొక్కాలు విప్పి ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సదస్సులో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

- మిగతా 2లో



## హైదరాబాద్‌లోని చట్నీస్ హోటల్‌లో భారీ పేలుడు

- అధిక వేడి కారణంగా స్టీమర్ పేలినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు
- బయటకు పరుగుతీసిన సిబ్బంది, కస్టమర్లు
- ప్రమాదంలో ముగ్గురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలోని ఓ హోటల్లో భారీ పేలుడు సంభవించింది. అధిక వేడి కారణంగా ఇడ్లీ స్టీమర్ పేలిపోయినట్లు పోలీసు లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో మధ్యాహ్నం పేలుడు జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు చోటు చోసుకోవడంతో హోటల్ సిబ్బంది, కస్టమర్లు బయటకు పరుగు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని

- మిగతా 2లో

## దేవాదుల ప్రాజెక్టుపై

# అంత నిర్లక్ష్యం ఎందుకు?

**హైదరాబాద్ పెన్ పవర్:** దేవాదుల ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు నడవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌస్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. వరంగల్ జిల్లాలో దేవాదుల పరిధి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేవాదుల పనులు నత్తనడకన నడిచాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల నీటి కేటాయింపులను 60 టీఎంసీలకు పెంచినట్లు చెప్పారు." దేవాదుల ఆయకట్టును 47 వేల ఎకరాల నుంచి 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మోటార్లను ఈ ప్రభుత్వం నడపలేకపోతోంది. నిర్వహణ ఖర్చులు రూ.8 కోట్లు లేక మోటార్లు

- మిగతా 2లో



## యుద్ధానికి అంటూ వస్తే.. అమెరికాను వదిలేదే లేదు



# ఇరాన్ వార్నింగ్

పెన్ పవర్ డెస్క్:మేం ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోం.. యుద్ధాన్ని ఎప్పుడూ ప్రారంభిం చం.. అంతర్జాతీయ చట్టాలను అతిక్రమిస్తే ఊరుకోం..ఆత్మరక్షణ హక్కు మాకు ఉంది.. యుద్ధం అంటూ వస్తే మాత్రం వదిలిపెట్టమని ఇరాన్ మరోసారి అమెరికాకు వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ పై అమెరికా ప్రత్యక్ష సైనిక చర్య కు దిగుతుందని, ఏ క్షణాన్నైనా యుద్ధం వచ్చే అవకాశాలున్నాయని వస్తున్న వార్తల క్రమంలో ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### భారత పరిశోధనా పితామహుడు

శాంతి స్వరూప్ భట్నాగర్ (ఫిబ్రవరి 21, 1894 ? జనవరి 1, 1955) గురించి తెలియని వారుండరు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రజ్ఞుడు భట్నాగర్. భట్నాగర్ ను భారత పరిశోధన శాలల పితామహుడిగా అభివర్ణిస్తారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రథమ డైరెక్టర్. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (జఉఅ) తొలి మొదటి ఛైర్మన్. దేశంలో మొత్తం 12 పరిశోధన శాలలను ఆయన స్థాపించాడు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం స్థాపించింది. శాంతి స్వ రూప్ భట్నాగర్ బ్రిటిష్ ఇండియా లోని పంజాబ్ ప్రాంతంలోని, ఇప్పటి పాకిస్తాన్లో ఉన్న షాపూర్లో, హిందూ కాయస్థ కుటుంబంలో 1894 ఫిబ్రవ రి 21న భట్నాగర్ జన్మించాడు. చిన్ననాటి నుండి సాహిత్యమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా విపరీతమైన ఆసక్తిని పెంచు కున్నాడు. కవిత్వం లో మంచి ప్రవేశ ముండేది. బాల్యం నుండే బొమ్మలు, యంత్ర పరికరా లు చేయటంలో ఆసక్తి కనబరిచేవాడు. తన ప్రాథమిక విద్యను దయానంద్ ఆంగ్లో-వేద ఉన్నత పాఠశాల, సికింద్రా బాద్ (బులంద్ షహర్ ) నుండి పూర్తి చేశాడు. 1911లో లాహోర్ లోని కొత్తగా స్థాపించ బడిన దయాల్ సింగ్ కాలేజీలో చేరాడు. భట్నాగర్ 1913లో పంజాబ్ విశ్వ విద్యాలయం ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యాడు. ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. 1916లో భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. విదే శాల్లో చదువుకోవడానికి దయాళ్ సింగ్ కాలేజ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్ పొంది, యూనివర్సిటీ కాలేజ్ లండన్లో 1921 లో సైన్స్లో డాక్టరేట్ పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, కొత్తగా స్థాపించ బడిన బనా రస్ హిందూ విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్ర ప్రొఫెసర్గా చేరా డు. తర్వాత విశ్వ విద్యాలయం లోని ఫిజికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, యూనివర్సిటీ కెమికల్ లాబొరే టరీస్ డైరెక్టర్గా లాహోర్కు మారాడు. మాగ్నెటోకెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ ఆఫ్ ఎమల్షన్ రంగాలలో పరిశోధనతో పాటు, అప్లైడ్ కెమిస్ట్రీ లో కూడా గణనీయమైన కృషి చేసాడు. రావల్పిండి ప్రాంతంలో ఒక బ్రిటిష్ కంపెనీ చమురు అన్వేషణా కార్యక్రమం చేపట్టిన రోజుల్లో ఒక సమస్య ఎదురైంది. చమురు ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండేది. పైగా డ్రిల్ చేసిన బురద ఉప్పు నీటితో కలిసి గట్టిగా రాయిలాగా మారి, డ్రిల్లింగ్ కు అంతరాయం కలిగించేది. ఒక దశలో పనిపూర్తిగా ఆగిపోయేది. అపుడు కంపెనీవారు భట్నాగర్ ను సలహా కోరారు. భట్నాగర్ ఈ సమస్యను కూలం కషంగా పరిశీలించి అతిసులభ మైన, చవకైన పరిష్కారాన్ని సూచించాడు. డ్రిల్ చేసిన బురదకు జిగురు కలపమని సలహా ఇచ్చా డు. జిగురు కలిపిన బురదకు స్నిగ్ధత తక్కువై గట్టిపడకుండా ఉండటంతో బ్రిటీష్ కంపెనీ కొన్ని లక్షల రూపాయల నష్టం నుండి బయట పడింది. వెంటనే కంపెనీ వారు ఆయనకు లక్షాయాభై వేల రూపాయలు బహుకరించారు. ఆ సొమ్మును లాహ్పరు యూనివర్శిటీకి చమురు పరిశోధనల కోసం విరాళంగా ఇచ్చాడు. భట్నాగర్ చమురు పరిశోధనా భివృద్ధికి ఎంతో కృషి చేశాడు. మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో ఆయన తెలియ చేశాడు. కిరోసిన్ ను శుద్ధి చేయ డం, వెలుగును ఎక్కువ చేయటం, ఆదా చేయడం గురించి భట్నాగర్ విలువైన సమాచారాన్ని అందించా డు. పెట్రోలియం నుండి విడుదల య్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో పరిశోధించాడు. ఆయన ఊఎఖీ కు డైరెక్టరయ్యాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్స్ చేయడం, రబ్బరు వస్తువులను రూపొందించడం వంటి పరిశోధనలను ముమ్మరం చేశాడు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ స్వయం ప్రతిపత్తి సంస్థగా, 28 సెప్టెంబర్ 1942న అమలులోకి వచ్చింది. 1943లో ఆయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎన్ను కున్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్... హోమీ జహంగీర్ భాభా, ప్రశాంత చంద్ర మహలనోబిస్, విక్రమ్ సారాభాయ్ తదితరులతో పాటు భారతదేశ స్వాతంత్ర్యానంతర శాస్త్ర సాంకేతి క మౌలిక సదుపాయాలు, విధానా ల నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించాడు. విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా మరియు ప్రభుత్వ విద్యా సలహాదారుగా కూడా పని చేశాడు. నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్థాపనలో అతను కీలక పాత్ర పోషించి, దేశంలో ఇండస్ట్రి యల్ రీసెర్చ్ అసోసియేషన్ ఉద్యమానికి నాంది పలికాడు. భట్నాగర్ భారత దేశములో వివిధ ప్రాంతాలలో...సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నలాజికల్ ఇన్స్టిట్యూట్ మైసూర్ , నేషనల్ కెమికల్ లాబొరేటరీ పూణే , నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ న్యూఢిల్లీ , నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ జంషెడ్పూర్ , సెంట్రల్ ఫ్యూయల్ ఇన్స్టిట్యూట్ ధన్బాద్ వంటి మొత్తం 12 జాతీయ ప్రయోగ శాలలను స్థాపించాడు. నెహ్రూ హయాంలో ప్రభుత్వం నుండి నిధులను సమకూర్చి చమురు పరిశోధనా వనరులను అభివృద్ధి చేశాడు. దేశంలో చమురు వనరు లు, చమురు నిక్షేప స్థావరాలు, అణుఖనిజ పరిశ్రమలు అభివృద్ధి చెందాయంటే అది భట్నాగర్ కృషే ప్రధాన కారణం. భట్నాగర్ 1955 జనవరి 1వ తేదీన మరణించాడు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్ర వేత్తలు కనబరిచిన ప్రతిభకు నిదర్శనంగా, ఆయా రంగాలకు వారు అందించిన సేవలకు గుర్తింపు గా ప్రతి ఏటా ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు భారత శాస్త్ర రంగంలో అత్యున్నతమైనదిగా పరిగణిస్తారు. ఈ పురస్కారం మొదటి సారి 1958 లో యివ్వబడి నది. 45 సంవత్సరాల వయసు వరకు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాలలో పరిశోధన చేస్తూ ఉంటే ఈ పురస్కారానికి అర్హత పొందు తాడు. ఈ పురస్కారం ఒక పతకం, నగదు బహుమతి 5 లక్షలు అందజేయ బడుతుంది. అదనంగా ఆ పురస్కార గ్రహీత 65 వ సంవత్సరం వరకు ప్రతీ నెలా రూ. 15,000 అందజేయ బడుతుంది.

# దేవాదుల ప్రాజెక్టుపై అంత నిర్లక్ష్యం ఎందుకు?

- మొదటి పేజి తరువాయి
నడపట్లేదు. గండిరామారంతోపాటు ఇతర లిఫ్టులు బంద్ చేశారు. దేవన్నపేట పంప్హౌస్లో 3 మోటార్లు నడవట్లేదు. మరమ్మతులకు గుర్తైనట్లు అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.7,300 కోట్ల మేర దేవాదుల ప్రాజెక్టుపై ఖర్చు పెట్టాం. 80శాతానికిపైగా పనులు పూర్తి చేశాం. 47వేల ఎకరాల ఆయకట్టును.. 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. ఈ ప్రాజెక్టు కోసం 33 వేల ఎకరాలు అవసరం ఉంటే.. 30వేల ఎకరాల భూ సేకరణ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయింది. ఒకట్రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి..మిగతా 3 వేల ఎకరాల భూ సేకరణ చేస్తే.. అదనంగా 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు పెరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి
వచ్చిన రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం కనీసం రూ.200 కోట్లు అయినా ఖర్చు చేశారా? దేవాదుల ప్రాజెక్టుపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు?" అని హరీశ్రావు నిలదీశారు.

## ఢిల్లీ ఏఐ సమ్మిట్లో ఉద్రిక్తత...

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కార్యకర్తలు నిరసనకు దిగారు. 'పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్' అంటూ పెద్దగా నినాదాలు చేస్తూ, సమ్మిట్ బోర్డు ముందు నిలబడి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి, ఆందోళనకారులను బలవంతంగా బయటకు పంపించి, అదుపులోకి తీసుకున్నారు. వారిని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్కు తరలించారు.అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ ఉన్నతస్థాయి సదస్సులో భద్రతను దాటుకుని కార్యకర్తలు ఎలా లోపలికి వచ్చారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నిరసనకు సంబంధించిన వీడియోలను యూత్ కాంగ్రెస్ తమ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కంటే కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యత ఇస్తోందని యూత్ కాంగ్రెస్ ఒక ప్రకటనలో ఆరోపించింది.

ఈ ఘటన తర్వాత భారత్ మండపం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కాగా, ఈ సదస్సును రాహుల్ గాంధీ గతంలోనే ఒక 'ప్రచార కార్యక్రమం'గా విమర్శించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి నిరసనలు సరికాదని అధికార పార్టీ నేతలు విమర్శించగా, ఇది తమ నిరసన తెలిపే హక్కు అని విపక్ష నేతలు సమర్థించుకున్నారు.

## మేమే ప్రతిపక్షం

- మొదటి పేజి తరువాయి
ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పరీక్షలను కూడా పట్టించుకోకుండా వరుస ఎన్నికలు పెడుతున్నరని ఆరోపించారు. పూలే విగ్రహం ట్యాంక్ బండ్ పై మాత్రమే కాదు.. అసెంబ్లీలోనూ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వి గ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని ఆ ఖర్చు జాగృతి భరిస్తుందని చెప్పారు.

## హైదరాబాద్లోని చట్నీస్ హోటల్లో భారీ పేలుడు

- మొదటి పేజి తరువాయి
ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు కిచెన్ను పరిశీలించాయి.

## యుద్ధానికి అంటూ వస్తే.. అమెరికాను వదిలేదే లేదు

- మొదటి పేజి తరువాయి
ఎప్పుడూ యుద్ధం కోరుకోదు, యుద్ధాన్ని ఎప్పుడూ ప్రారంభించదు, అమెరికా సైనిక చర్యకు గనక దిగితే మాత్రం అమెరికాను ధీటుగా ఎదుర్కొంటామని ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ కు రాసిన లేఖలో తెలిపారు. ఇరాన్ పై దాడి చేస్తామని అమెరికా పదే పదే బెదిరిస్తోంది.. డియోగో గార్సియా సైనిక స్థావరం నుంచి దాడికి సిద్ధమవుతోంది. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే, ఈ చర్యలు ఆ ప్రాంతాన్ని సంక్షోభంలో పడేస్తాయని ఇరవానీ అన్నారు. ఇరాన్ పై అమెరికా పదే పదే బెదిరింపులకు పాల్పడుతోంది.. ఇటీవల అమెరికాతో ఒప్పందం చేసుకోకపోతే దాడి చేస్తామని ట్రంప్ బహిరంగంగానే బెదిరించారు. డియోగో గార్సియా, ఫెయిర్ పోర్టు ఎయిర్ ఫీల్డ్ ను ఉపయోగించే అవసరం వస్తుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఇరవానీ అన్నారు.

అమెరికా సైనిక దురాక్రమణకు దిగితే ఐక్యరాజ్య సమితి చార్టర్ లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణకు అమెరికాను ధీటుగా ఎదుర్కొంటాం.. మరీ విధ్వంసానికి దిగితే అమెరికాను వదిలిపెట్టమని ఇరవానీ హెచ్చరించారు. అటు అమెరికా, ఇటు ఇరాన్ వరుస బెదిరింపు స్టేట్ మెంట్లతో త్వరలో ఇరాన్ పై అమెరికా సైనిక చర్యకు దిగుతుందా? అన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

## నాంపల్లి కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

- మొదటి పేజి తరువాయి
సమాచారం అందించగా నిమిషాల వ్యవధిలోనే వారు కోర్టు వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపించారు. బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు.

ఈనెల 18వ తేదీ కూడా నాంపల్లి కోర్టుకు బంబు బెదిరింపులు వచ్చాయి. అదే రోజున కరీంనగర్, అనంతపురం, రాజమండ్రి కోర్టులకు కూడా బెదిరింపులు రావడం గమనార్హం. అయితే, ఆయా కోర్టుల్లో నిర్వహించిన తనిఖీల్లో బాంబుల ఆచూకీ లభించలేదు. ఇవన్నీ నకిలీ బెదిరింపులుగా పోలీసులు నిర్ధారించారు.

## పెమ్మసాని 18 రోజులు సినిమా చూపించాడు.. పారిపొమ్మని సీఐ చెప్పాడు: అంబటి రాంబాబు

మూడు కేసులకు సంబంధించి 18 రోజుల పాటు మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ మూడు కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై మండిపడ్డారు. "24 గంటల్లో సినిమా చూపిస్తానన్నావ్... 18 రోజులు సినిమా చూపించావు. ఇందులో ఎవరు హీరో? నేనే హీరో. మీరు విలన్లు అయ్యారు" అని అన్నారు.

**మీడియాతో మాట్లాడుతూ అంబటి చేసిన కీలక వ్యాఖ్యలు ఇవే:**

ఇరవై రోజులుగా ఎన్నో జరిగాయి. ఏం జరిగిందో ప్రజలు అర్థం చేసుకున్నారు.

జనవరి 31 అర్ధరాత్రి నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు బెయిల్ ఇవ్వడంతో మొన్న విడుదల అయ్యాను.

ఈ 18 రోజులు మాట్లాడే అవకాశమే రాలేదు. నా కూతురు అందరికీ అర్థమయ్యేలా అన్ని విషయాలు చెప్పింది.

టీడీపీ కట్టిన ఫ్లెక్సీ వద్దకు వెళ్లి మంచి పద్ధతి కాదని చెప్పే ప్రయత్నం చేశాను. ఫ్లెక్సీని నేను చించివేయలేదు.

మరుసటి రోజు గుళ్లలో పూజలు చెయ్యమని పార్టీ నుంచి సమాచారం వచ్చింది. పర్మిషన్ తీసుకుని అక్కడకు వెళ్లాను.

తిరిగి వస్తుంటే కారు అడ్డుకుని అమ్మ, అక్క అంటూ బూతులు తిట్టారు. ఆ తర్వాతే నేను కూడా తిట్టాను.

తర్వాత ఇంటికొచ్చి ఆలోచిస్తే నా అంతరాత్మ ఒప్పుకోలేదు. నేను అన్న మాటలు చంద్రబాబును ఉద్దేశించి కాదు. ఇంటికి వచ్చిన తర్వాత పశ్చాత్తాపానికి గురయ్యాను.

ఐదు గంటలకు ఇంటివద్దకు పలు నియోజకవర్గాల నుంచి భారీగా జనం వచ్చారు. నా కుటుంబ సభ్యులు, మనవళ్లు ఇంట్లో ఉన్నారు. ఏడు గంటలపాటు టీడీపీ గూండాలు రచ్చ చేశారు.

ఇంటిపై దాడి చేసిన వారంతా కమ్మవారే. పోలీసుల అండతో రెచ్చిపోయారు. ఎక్కడైనా పోలీసులు, గూండాలు ఒక్కటవుతారా?

వైసీపీ వారిని మా ఇంటి వద్దకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. పారిపోవాలని సీఐ గంగా వెంకటేశ్వర్లు నాతో చెప్పారు. పారిపోవడం కన్నా చచ్చిపోవడం మేలని నేను చెప్పాను.

పోలీసులు నన్ను తీసుకెళ్లి లాకప్ లో పెట్టారు. రాత్రి 2 గంటలకు స్టేషన్ పైకి తీసుకెళ్లి నన్ను కొట్టడానికి ప్రయత్నించారు. కానీ కొట్టలేదు. నన్ను కొట్టడానికి ప్రయత్నించడంపై న్యాయపోరాటం చేస్తా.

నల్లపాడు సీఐ వంశీ రిమాండ్ రిపోర్ట్ లో... "కమ్మ నా కొడకల్లారా" అని తిట్టానని రాశాడు. నా ఇద్దరు అల్లుళ్లు కమ్మవారే. కులాల పేరుతో రెచ్చగొడుతున్నది మీరే.

పెమ్మసాని చంద్రశేఖర్ మూల్యం చెల్లించే రోజు వస్తుంది. తప్పక మూల్యం చెల్లించాల్సిందే.

పోలీసులతో హత్యలు చేయించడం చంద్రబాబుకు అలవాటే. ఆ అలవాటు నారా లోకేశ్ కి వచ్చింది.

నేను కమ్మ వ్యతిరేకిని కాదు. నన్ను నిర్మూలించాలని రెడ్ బుక్ లో రాసుకున్నారట.

చంద్రబాబు కమ్మని ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ కాపుకాస్తున్నాడు.

## భారత్ తో సంబంధాల్లో కొత్త మలుపు

- మొదటి పేజి తరువాయి
ఇప్పుడు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి.

బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో వీసా సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలో ఢాకాలోని భారత రాయబార కార్యాలయంలో కూడా బంగ్లాదేశ్ నుంచి భారత్ కు వీసాలు జారీ చేసే సేవలు మళ్లీ మొదలవుతాయని బంగ్లాలోని భారత రాయబార కార్యాలయం అధికారి అనిరుద్ధ దాస్ తెలిపారు. మెడికల్, టూరిజం సహా అన్ని రకాల వీసాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిన పడే అవకాశం ఉంది.

## మైత్రివనం ఆదిత్య ఎన్క్లేవ్లో అగ్ని ప్రమాదం... తప్పిన ముప్పు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్లోని అమీర్పేట చౌరస్తా మైత్రివనం వద్ద ఉన్న ఆదిత్య ఎన్క్లేవ్ భవనం మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నీలగిరి బ్లాక్లోని రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాలలో మంటలు అలముకున్నాయి. ఈ భవనంలో కోచింగ్ సెంటర్లు ఉంటాయి. దీనితో ఆయా కోచింగ్ సెంటర్లలోని విద్యార్థులు కిందకు వచ్చేశారు. విద్యార్థులను పోలీసులు, హైడ్రా సిబ్బంది నిచ్చెనల ద్వారా కూడా సురక్షితంగా తీసుకువచ్చారు.ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం విషయం తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా సిబ్బంది హుటాహుటిన మైత్రివనంకు తరలి వచ్చారు.గ్రౌండ్ ఫ్లోర్లోని ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొదటి అంతస్తు వరకు మంటలు రావడం, పొగలు రెండో అంతస్తు వరకు వ్యాపించడంతో భవనాన్ని ఖాళీ చేయించారు.

## 15 ఏళ్ల సమయమిచ్చినా మీరేం చేయలేరు.. నాకు 5 నిమిషాలు ఇచ్చే దమ్ముందా?

- మొదటి పేజి తరువాయి
సమయం ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్ మాట్లాడుతూ, తమకు 15 నిమిషాల సమయం ఇస్తే హిందువులు లేకుండా చేస్తానని అన్నారని మండిపడ్డారు.

15 నిమిషాలు కాదు 15 గంటలు, 15 రోజులు, 15 నెలలు అవసరమైతే 15 సంవత్సరాలు ఇచ్చినా మీరేం చేయలేరని అన్నారు. మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారు మీరేం చేస్తారని మండిపడ్డారు. కానీ తమకు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని అన్నారు. తాను ఎక్కడకు రావాలో చెప్పాలని అన్నారు. నీ ప్రాంతానికి రావాలా, నీ ఇంటికి రావాలా, ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ ఏదీ వద్దని వ్యాఖ్యానించారు.

## వైఎస్ జగన్ను కలిసిన ప్రముఖ నటుడు బ్రహ్మానందం

- మొదటి పేజి తరువాయి

- **గన్నవరం విమానాశ్రయంలో జగన్ తో సినీ నటుడు బ్రహ్మానందం**
- **గన్నవరం విమానాశ్రయంలో ఒకరికొకరు తారసపడ్డ జగన్, బ్రహ్మానందం**
- **ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్న వైనం**
- **గన్నవరం నుంచి బెంగళూరుకు వెళ్లిపోయిన జగన్**

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం కలిశారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో ఈ అరుదైన కలయిక చోటు చేసుకుంది. బెంగళూరుకు వెళ్లేందుకు జగన్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఒక పని మీద గన్నవరం చేరుకున్న బ్రహ్మానందం ఎయిర్ పోర్టులోనే ఉన్నారు. ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బ్రహ్మానందం యోగక్షేమాలు, ఆరోగ్యం గురించి జగన్ అడిగి తెలుసుకున్నారు. వీరి కలయికకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# టమాటా రైతు గోస

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరుగాలం కష్టపడి పండించిన టమాటాకు ధర రాక వ్యాపారులెవరూ కొనుగోలు చేయక.. రైతులు ఉచితంగా పంపిణీ చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శుక్రవారం చోటుచేసుకుంది. గూడూరు మండలం భూపతిపేటకు చెందిన పోగుల కొండ సారయ్య, మోహన్, సురేందర్ ఒక్కో ఎకరంలో టమాటా సాగు చేశారు. శుక్రవారం కొత్తగూడ సంతలో విక్రయానికి తీసుకొచ్చారు. చిరువ్యాపారులకు ఇరవై కిలోల పెట్టెను రూ.100కు విక్రయించేందుకు ప్రయత్నించగా ఎవరూ కొనుగోలు చేయలేదు. కనీసం రూ.50కి కూడా కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో మహిళలందరికీ ఉచితంగా పంపిణీ చేశారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి

# స్వల్ప అస్వస్థత

- నిమ్స్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థత
- ఫుడ్ పాయిజన్ అయినట్లు చెబుతున్న కుటుంబ సభ్యులు



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఆయనకు ఫుడ్ పాయిజన్ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమ్స్ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు.కాగా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అంశంలో -4లో



## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం..

# ఛార్జ్‌షీట్ వెనక్కి పంపిన నాంపల్లి కోర్టు

- అల్లు అర్జున్ సహా 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు
- సాంకేతిక లోపాలను గుర్తించిన నాంపల్లి కోర్టు
- హార్డ్ డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లు, సీడీలను జత చేయకపోవడంతో వెనక్కి పంపిన కోర్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మరోసారి కీలక పరిణామం చోటు చేసుకుంది. చిక్కడపల్లి పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్‌షీట్‌ను నాంపల్లి కోర్టు వెనక్కి పంపించింది. దీనిని వెనక్కి పంపించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ కేసులో అల్లు అర్జున్ సహా 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే ఛార్జ్‌షీట్‌లో నాంపల్లి కోర్టు సాంకేతిక లోపాలను గుర్తించింది.ఎవిడెన్స్ మెటీరియల్ సమగ్రంగా లేదని, సాక్ష్యాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లు, సీడీలను జతచేయకపోవడంతో కోర్టు ఛార్జ్‌షీట్‌ను వెనక్కి పంపించింది. ఎలాంటి లోపాలు లేకుండా ఫార్మాట్ ప్రకారం, ఛార్జ్‌షీట్‌లో పొందుపరిచిన అన్నింటికి ఆధారాలతో మరోసారి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని చిక్కడపల్లి పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. గతంలో రెండుసార్లు కూడా ఛార్జ్‌షీట్‌లో సాంకేతిక కారణాలు చూపిస్తూ కోర్టు వెనక్కి పంపించింది.

# టన్ను పామాయిల్ రూ.25 వేలు చేస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** టన్ను పామాయిల్ ధరను మూడేళ్లలో రూ.25 వేలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. కామారెడ్డి జిల్లాలోని పాల్వంచలో శుక్రవారం నిర్వహించిన మెగా పామాయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... "ఇతర పంటలు వేస్తే వరదలు, వడగండ్లు, తెగుళ్లకు తట్టుకోలేవు. దిగుబడి వచ్చినా ధర ఉండదు. పామాయిల్‌కు ఆ సమస్య రాదు. అంతర పంటలుగా కోకో, వక్క, వరి, కూరగాయలనూ వేసుకోవచ్చు. వాటికీ రైతుభరోసా ఇస్తాం. రూ.300 కోట్లతో సిద్దిపేటలో ఆయిల్‌పాం సంబంధిత ఫ్యాక్టరీని నిర్మించాం" అని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానశాఖ సంచాలకురాలు యాస్మిన్ బాషా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, హెచ్‌యూఎల్ ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**వ్యవసాయంలో సాంకేతికతకు పెద్దపీట**

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగంలో అధునాతన సాంకేతికతకు పెద్దపీట వేస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'దిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ సమిట్‌లో తెలంగాణ వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులు ప్రస్తావనకు రావడం గర్వకారణం. దేశంలో తొలిసారిగా ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ, ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అగ్రిహబ్ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం కలిసి రైతు రిజిస్ట్రీలు, భూముల వివరాలు, పంటల సమాచారం, శాస్త్రీయ సలహాలను అందిస్తున్నాయి' అని వివరించారు.



## వ్యవసాయ రంగంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు

## మండలి చైర్మన్ గుత్తా

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో వ్యవసాయానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, యువత ఉద్యోగాల కోసం ఆరాటపడకుండా ఈ రంగంలోకి రావాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతుబడి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల వ్యవసాయ ప్రదర్శనను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. "వ్యవసాయం జాతి సంపద. దానికి పెరుగుదలే గాని తగ్గుదల ఉండదు. దీనిని బలోపేతం చేయడానికి యువత ముందుకురావాలి. సాంకేతికతతో వ్యవసాయం ఇప్పుడు యువతకు అత్యంత సులువుగా మారింది. సరైన పంథాలో సాగు చేస్తే నష్టాలు ఉండవు. తెలంగాణ ప్రభుత్వం అన్నదాతను ప్రోత్సహించేందుకు అన్ని రకాల సాయం అందిస్తోంది" అని గుత్తా తెలిపారు. తెలంగాణ విత్తనాభివృద్ధి, పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్యల ఛైర్మన్లు అన్వేష్‌రెడ్డి, అమిత్‌రెడ్డి, రైతుబడి నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే నర్సింహారెడ్డి, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## ఎన్ని ఆఫర్లు వచ్చినా జీవన్ రెడ్డి పార్టీలోనే ఉన్నారు..

# ఆయనకు అవమానం జరగకూడదు

- పరిస్థితులు అనుకూలించకపోవడంతో జీవన్ రెడ్డి ఓడిపోయారన్న జగ్గారెడ్డి
- కాంగ్రెస్ కష్టకాలంలో ఆయన పార్టీలోనే ఉంటూ పని చేశారన్న జగ్గారెడ్డి
- ఈ విషయంలో అధిష్ఠానం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాలలో సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డికి రాజకీయంగా ఎన్ని ఆఫర్లు వచ్చినా పార్టీలోనే కొనసాగారని, అలాంటి నాయకుడికి పార్టీలో అవమానం జరగకుండా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా టిక్కెట్లు ఇచ్చి పార్టీ ఆయనను ప్రోత్సహించిందని, కానీ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఆయన ఓడిపోయారని అన్నారు. కానీ ఆయన ఎప్పుడూ పార్టీ గీతను దాటలేదని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులకు తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెబుతానని అన్నారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి అన్యాయం జరగకూడదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అధిష్ఠానం చొరవ తీసుకోవాలని అన్నారు.కాగా, తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ పదవీకాలం వచ్చే ఏప్రిల్ నెలలో ముగియనుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 16న తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరేందుకు జగ్గారెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీకి చెందిన మరో సీనియర్ నేత వి.హనుమంతరావు కూడా తనకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే అధిష్ఠానానికి లేఖ రాశారు.



## తెలంగాణను అగ్రగామిగా

# నిలిపేందుకే క్రీడా పాలసీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడా పాలసీ తీసుకొచ్చారని క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడల్లో క్రమశిక్షణ ఉంటేనే విజయం సాధ్యమని.. బాల్యంలో లక్ష్యం నిర్దేశించుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలీ స్టేడియంలో సీఎం కప్-2025 రెండో సీజన్‌ను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు. 44 క్రీడాంశాల్లో 21,500 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ మెరుపు ధర్నా

- బీసీ సబ్ ప్లాన్ తక్షణ అమలు చేయాలని డిమాండ్
- బడ్జెట్లో బీసీలకు 55వేల కోట్లు కేటాయించాలి..
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి...
- బీసీలకు 42% శాతం విద్యా,ఉపాధి, ఉద్యోగ,కాంట్రాక్టుల్లో కల్పించాలి..
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్.




హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని Gun Park వద్ద మెరుపు ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేసి, బీసీలకు కేటాయించాల్సిన నిధులను పూర్తిగా విడుదల చేసి, ఆ నిధులను బీసీ వర్గాల అభివృద్ధికే ఖర్చు చేయాలని పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు.

ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వర్గాలు జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ, వారికి తగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సబ్ ప్లాన్ చట్టబద్ధంగా అమలు చేసి బీసీలకు రావాల్సిన 55వేల కోట్లు ఈ బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు... విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, గృహ నిర్మాణం, వృత్తి అభివృద్ధి వంటి రంగాల్లో బీసీలకు 42 శాతం అమలు చేయాలని అలా జరిగినప్పుడే బీసీలకు నిజమైన లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.

పార్టీ నాయకులు ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు గుప్పిస్తూ...ప్రతి ఏడాది బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ నిధులు పూర్తిగా ఖర్చు కావడం లేదని, ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇది బీసీ వర్గాల పట్ల అన్యాయం మాత్రమే కాకుండా, వారి హక్కుల ఉల్లంఘన అని అన్నారు.

ఈ మెరుపు ధర్నాలో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,విద్యార్థి సంఘం నాయకులు వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని తమ ఐక్యతను చాటారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు..ఈ కార్యక్రమానికి బీసీ సంఘాలు కూడా మద్దతునిస్తూ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు..

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్పష్టం**

బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలి...55 వేల కోట్లు బీసీలకు బడ్జెట్లో కేటాయించాలి

బీసీలకు కేటాయించిన నిధులను వేరే అవసరాలకు మళ్లించకుండా, వారి అభివృద్ధికే ఖర్చు చేయాలి...

బీసీలకు 42% శాతం విద్య,ఉద్యోగ,కాంట్రాక్టుల్లో కేటాయించాలి

బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి

ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని పార్టీ హెచ్చరించింది.

# మళ్లీ తెరపైకి సెంటిమెంట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాలు మరోసారి సెంటిమెంట్ చుట్టూ తిరుగుతున్నాయి. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని పాలించిన భారత్ రాష్ట్ర సమితి, ప్రస్తుతం అధికారాన్ని కోల్పోయిన తర్వాత మళ్ళీ పాత అస్త్రాన్నే నమ్ముకుందా?అంటే అవుననే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా మాజీ మంత్రి, ప్రస్తుత కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. కేసీఆర్ సెంటిమెంట్ రాజకీయాలపై ఆయన చేసినవిమర్శలు ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి.కడియం శ్రీహరి ప్రధానంగా కేసీఆర్ సెంటిమెంట్ వైఖరిని తప్పుపట్టారు. తెలంగాణ సెంటిమెంట్ అనేది కేసీఆర్ సొత్తు కాదని స్పష్టం చేశారు. ఉద్యమసమయంలో సెంటిమెంట్ ప్రజల ఆకాంక్ష అని, కానీ ఇప్పుడు అది కేవలం రాజకీయ మనుగడ కోసం వాడుకుంటున్న సాధనంగా మారిందని ఆయన ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు లేని సెంటిమెంట్,ఓడిపోయిన వెంటనే కేసీఆర్‌కు గుర్తుకు రావడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కంటే భావోద్వేగాల ద్వారానే పబ్బం గడుపుకోవాలని చూడటం సరికాదనేది శ్రీహరి వాదన. తెలంగాణప్రజలు చైతన్యవంతులని, ప్రతిసారీ సెంటిమెంట్ పేరుతో ఓట్లు అడగడం చెల్లదని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో 'తెలంగాణ ఆత్మగౌరవం' అనే అంశంబీఆర్ఎస్‌కు శ్రీరామరక్షగా నిలిచింది. అయితే, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 'మార్పు' నినాదంతో అధికారంలోకి రావడంతో, బీఆర్ఎస్ తన పట్టును కోల్పోయింది. అయితే అసెంబ్లీ ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా, చివరకు స్థానిక సంస్థల ఎన్నికలైనా కేసీఆర్ మళ్ళీ "తెలంగాణకు అన్యాయం జరుగుతోంది" లేదా "ఆంధ్ర పెత్తనం పెరుగుతోంది" అనే భావజాలాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని కడియం శ్రీహరితప్పుబడుతున్నారువరుస ఓటములతో నిరాశలో ఉన్న పార్టీ శ్రేణులను ఏకం చేయడానికి బీఆర్ఎస్ ఇలాంటి ఎత్తుగడలు వేస్తోంది. తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి పక్కదారి మళ్ళించే వ్యూహం కూడా ఇందులో దాగిఉంది. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపే క్రమంలో సెంటిమెంట్‌ను జోడించి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా లబ్ది పొందాలనేది వ్యూహంగా కనిపిస్తోంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా 'ప్రాంతీయపార్టీయే రక్షణ' అనే భావనను బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశం.కడియం శ్రీహరి ఒకప్పుడు బీఆర్ఎస్‌లో కీలక నేతగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ఆయుధంగా మారాయి. కడియం వంటి సీనియర్ దళిత నాయకుడు కేసీఆర్‌ను వ్యతిరేకించడం వల్ల, గతంలో బీఆర్ఎస్ వైపు ఉన్న సామాజిక వర్గాల్లో పునరాలోచన మొదలయ్యే అవకాశం ఉంది. కేసీఆర్‌మాటలకు మునుపటి పదును లేదని, ఆయన మాటల్లో నిజాయితీ లేదని ప్రజలకు వివరించడంలో కడియం సఫలమవుతున్నారు.తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్ అనేది ఎప్పుడూ ఒక పదునైన కత్తి లాంటిది.అయితే, అభివృద్ధి, నిరుద్యోగం, సంక్షేమం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తున్న ప్రస్తుత తరుణంలో, కేవలం సెంటిమెంట్‌తోనే గట్టెక్కడం బీఆర్ఎస్‌కు సవాలుతో కూడుకున్న పని. కడియం శ్రీహరి చేసిన ఘాటువిమర్శలు, కేసీఆర్ భవిష్యత్తు రాజకీయ వ్యూహాలను ఏ మేరకు ప్రభావితం చేస్తాయో చూడాలి. ప్రజలు ఇప్పుడు 'భావోద్వేగాల' కంటే 'ఫలితాల'కే ప్రాధాన్యత ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అజారుద్దీన్ కు పదవీ గండం



**హైదరాబాద్, ఫిబ్రవరి 20, పెన్ పవర్:**
అనూహ్యంగా మంత్రి అయిన అజారుద్దీన్‌ను పదవీ గండం వెంటాడుతోంది. గతేడాది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే మూడున్నర నెలలుగడిచిపోయింది. కానీ అజార్ ఇప్పటివరకు అటు అసెంబ్లీకి కానీ..ఇటు మండలికి కానీ ఎన్నిక కాలేదు. ఆరు నెలల్లోపు ఏదో సభకు ఎన్నిక కాకపోతే ఆయన పదవి ఊస్ట్ అవడం పక్కా.దీంతో అజారుద్దీన్ విషయంపైకాంగ్రెస్ పెద్దలు పెద్ద కసరత్తే చేస్తున్నారట. అజారుద్దీన్‌ను పదవీ గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ వేస్తున్నారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యూహాలకు పదును పెడుతున్నారట.ఈ దెబ్బతో ఇటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ, త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి మార్గం సుగమమం కానున్నట్లు తెలుస్తోంది.అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకితీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్‌చేసింది. వీరి నియామకాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గతఏడాది ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే

కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారంచేయలేదు. అయితే ఇంతలోపే అజారుద్దీన్ మంత్రిగా పదవి చేపట్టి ఆరు నెలుల పూర్తి అయ్యే పరిస్థితి వస్తుంది. దీంతో కొత్త ఫార్ములాకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్.వచ్చే ఏప్రిల్ 30 నాటికి అజారుద్దీన్ఎమ్మెల్సీగానో లేదా ఎమ్మెల్యేగానో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుంటే మంత్రి పదవికి గండం తప్పదు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా శాసనసభకు ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఇకఎమ్మెల్సీగానే ఎన్నిక కావాల్సి ఉంది. అయితే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉంది. ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా నియమించాలని క్యాబినెట్ నిర్ణయించినా సుప్రీంకోర్టులో కేసుపెండింగ్‌లో ఉండటంతో సస్పెన్స్ కొనసాగుతోంది. అజారుద్దీన్ను పదవీగండం నుంచి గట్టెక్కించేందుకు..రేవంత్ వ్యూహాన్ని రచిస్తున్నారట. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నవారిలో ఒకరి చేత రాజీనామా చేయించి వారిస్థానంలో అజారుద్దీన్కు మండలికి పంపించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీగా రాజీనామా చేయబోయే నేతకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసే అవకాశం ఉందట. అయితే అజారుద్దీన్ కోసం ఎమ్మెల్సీసీటుకు రాజీనామా చేసే నేత ఎవరో.? రాజ్యసభకు వెళ్లేదెవరో.? వేచి చూడాలి.

## బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి 14 సంఘాల అల్టిమేటం




**నల్లగొండ, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** నల్గొండ జిల్లా కలెక్టరేట్ వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎంపిటిసి – జడ్పిటిసి ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముట్టడి చేపట్టారు. రిజర్వేషన్లు పెంచకుండా పాత పద్ధతిలో ఎన్నికలకు వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, రాష్ట్రంలో యుద్ధం జరుగుతుందని 14 బీసీ సంఘాలు హెచ్చరించాయి. ప్రభుత్వం బలవంతంగా ఎన్నికల నోటిఫికేషన్ వేయడాన్ని అభ్యంతరిస్తూ, గత ఏడాది కాలంగా అనేక ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించకుండా బీసీలకు అన్యాయం చేస్తోందని ఆర్ కృష్ణయ్య ఆరోపించారు.

## మత్స్య రూపంలో నరసింహుడు

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీ స్వామి వారిని మత్స్య అలంకరణలో తీర్చిదిద్ది.. తిరువీధి సేవ నిర్వహించారు. నేటి నుంచి నుంచి అలంకార సంబరాలు ప్రారంభమయ్యాయి. తొలుత యాగశాలలో హవనం నిర్వహించారు. అలంకరించిన స్వామి అమ్మవార్లను వేదమంత్ర పఠనంతో మాడవీధుల్లో భక్తుల సందర్శనార్థమై ఊరేగించారు. అలంకార విశిష్టతను ప్రధాన పూజారులు భక్తులకు వివరించారు. ఆలయ ఈవో భావానీశంకర్, ధర్మకర్త నర్సింహమూర్తి ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

## చెట్టు ఒరుగుతోంది.. కలప తరలుతోంది

**నకిరేకల్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** జిల్లాలోని కొన్ని మండలాల పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా కలపను తరలించే చర్యలు జరుగుతున్నాయి. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నామమాత్రపు పర్యవేక్షణ కొనసాగిస్తుండటంతో కొందరు అక్రమార్కులు రాత్రివేళలో కలపను తరలిస్తున్నారు. ప్రతి నెలలో అడపదడపా అటవీ శాఖ అధికారులు పట్టుకుంటున్న కలప వాహనాలే దీనికి నిదర్శనం. అధికారులు జరిమానా విధిస్తున్నా ఏళ్ల వయసున్న చెట్లు నేలకొరుగుతూ వ్యాపారుల పరమవుతున్నాయి.

## స్వర్ణగిరీశుడిని తాకిన సూర్యకిరణాలు

**మునుగోడు, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** స్వర్ణగిరి క్షేత్రంలో ఉదయం అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. సూర్య కిరణాలు ఆలయ గర్భగుడిలోని శ్రీనివాసుడి పాదాలను తాకాయి. సూర్య కిరణాల వెలుగులో స్వామివారి దివ్య మంగళ స్వరూపం దేదీప్యమానంగా వెలిగిపోయింది. నిత్యారాధనల్లో భాగంగా సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పిన పూజారులు తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించిన అనంతరం శ్రీ సుదర్శన నారసింహ హవ నం జరిపారు. మధ్యాహ్నం శ్రీ స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణ పర్వాన్ని భక్తజనుల మధ్య కనులపండువగా నిర్వహించారు.

## ఎయిమ్స్‌లో స్థానికులకు ప్రత్యేక అవకాశాలు:

**దేవరకొండ, ఫిబ్రవరి 20పెన్ పవర్:** బీబీనగర్ ఎయిమ్స్‌లో స్థానికులకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తామని భువనగిరి ఎంపీ, ఎయిమ్స్ ఇనిస్టిట్యూట్ పాలకవర్గ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ 6వ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎయిమ్స్ డైరెక్టర్ అమితా అగర్వాల్ పాల్గొన్నారు. ఎయిమ్స్ ఏర్పాటులో భూములు కోల్పోయిన కుటుంబాలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని స్థానికుల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు సమావేశంలో చర్చించామన్నారు. 25శాతం కోటాను కచ్చితంగా స్థానికులకే కేటాయించాలన్నారు.

## బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఆర్య వైశ్య సంఘం శుభాకాంక్షలు



**నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20పెన్ పవర్:** బోధన్ పట్టణంలో నూతనంగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తూము పద్మావతి శరత్ రెడ్డి గారిని ఆర్య వైశ్య సంఘం (కొత్త బోధన్) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వాసర గంగాధర్, ప్రధాన కార్యదర్శి గందే శ్రీనివాస్, కోశాధికారి బంధం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొందుగుల నాగరాజు, ఎక్కెలి రామకృష్ణ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు. చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి గారు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, బోధన్ పురపాలక అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేద్దామని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి స్వల్ప అస్వస్థత

- 3 పేజి తరువాయి

జీవన్ రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సంజయ్ కుమార్ కాంగ్రెస్‌తో కలిసి ఉండటాన్ని జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి 20 టిక్కెట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి 30 టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఫలితాలు వెలువడిన తర్వాత సంజయ్ కుమార్ వర్గానికి ఛైర్మన్ పదవిని ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# హైదరాబాద్‌లో హాట్ కేకుల్లా ప్లాట్లు..

## 14 ప్లాట్ల వేలంతో రూ.14.75 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** హైదరాబాద్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లకు నిర్వహించిన వేలంలో భారీ ధర పలికాయి. 14 ప్లాట్లను వేలం వేయగా.. ఏకంగా రూ.14.75 కోట్ల ఆదాయం సమకూరింది. చదరపు గజానికి కనీస ధర రూ.32 వేలు నిర్వహించగా.. గరిష్ఠంగా రూ.51 వేలకు విక్రయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మరో విడత వేలం ఈనెల 23న నిర్వహించనున్నారు.శరవేగంగా డెవలప్ అవుతున్న హైదరాబాద్ మహా నగరంలో ఖాళీ ప్లాట్లు దొరకడమే గగనం అయిపోయింది. ప్లాట్లు కొనాలంటే నగర శివార్లకు వెళ్లాల్సిందే. అది కూడా భారీగా ధరలు పెట్టాల్సిందే. ఇక నగరం నడిబొడ్డున ప్లాట్లు కొనాలంటే కోట్ల రూపాయలు కుమ్మరించాల్సిందే. ఇక అప్పుడప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో స్థలాలు అత్యధిక పలికి రికార్డుల్లోకి ఎక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హౌసింగ్ బోర్డు పరిధిలోఉన్న ఖాళీ ప్లాట్లకు నోటిఫికేషన్ విడుదల చేసి.. తాజాగా వేలం నిర్వహించగా.. కళ్లు చెదిరే ఆదాయం వచ్చింది.హైదరాబాద్ నగర శివారు అయిన రాజేంద్ర నగర్ మండలంలో ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు.

లక్ష్మీగూడలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. భారీ ఎత్తున స్పందన వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడ ఉన్న 14 ప్లాట్లను తాజాగా బహిరంగ వేలం జరిపారు. ఈ ప్లాట్ల విక్రయించడానికి సంబంధించి ఈనెల 2వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.బహిరంగ వేలం పాట నిర్వహించగా.. అందులో 49 మంది కొనుగోలుదారులుహాజరయ్యారు. మొదట ఈ భూములకు చదరపు గజానికి రూ.32 వేలను కనీస ధరగా హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఇక వేలంలో అనూహ్యంగా చదరపు గజం ధర గరిష్టంగా రూ.51 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యానికిగురిచేసింది. ఈ క్రమంలోనే ఏకంగా 14 ప్లాట్ల హాట్ కేకుల్లా విక్రయం అయ్యాయి.ఈ ప్లాట్లను అమ్మడం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ వెల్లడించారు.హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక ఈ వేలంలో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికింది.దీంతో సగటున ఒక్కో చదరపు గజం రూ.44,285కు విక్రయం అయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.మరోవైపు.. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలం వేయడానికి హౌసింగ్ బోర్డు ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. గచ్చిబౌలి, లింగంపల్లి, కూకట్‌పల్లి, చింతల్, కుత్బుల్లాపూర్, నిజాంపేట ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడించింది. భరత్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద 1106గజాలు.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో 266 గజాలు.. బౌరంపేటలో 2,600 గజాలు, చింతల్ హౌసింగ్ బోర్డు కాలనీలో 6 ప్లాట్లు.. గచ్చిబౌలి హౌసింగ్ బోర్డు కాలనీలో 3 ప్లాట్లు, నిజాంపేటలో ఒక ప్లాటుఉందని తెలిపారు. ఈ స్థలాలకు ఈనెల 23వ తేదీన వేలం నిర్వహించనున్నట్టు వీపీ గౌతమ్ తెలిపారు. వేలం రోజు ఉదయం నాటికి డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నేతన్న దారానికి పొదుపు నిధుల చిక్కుముడి

**సిద్దిపేట, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** దారాలను మగ్గంతో జత కలుపుతూ అందమైన వస్త్రాన్ని తయారుచేస్తున్న నేతన్నకు పొదుపు నిధుల పథకం (త్రిఫ్ట్ ఫండ్) నుంచి డబ్బులు రావటం లేదు. చేనేత కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో పథకాన్ని ఏడాది క్రితం మార్చిలో ప్రవేశపెట్టారు. 9 నెలలుగా ప్రభుత్వ వాటా నిధులు జమ కాలేదు. తాము పొదుపు చేస్తున్నా సర్కారు నుంచి ప్రోత్సాహం అందకపోవడంతో డబ్బులు కట్టడం మానేశారు.

## వేగంగా వెళ్తున్నారా..ఇంటికే జరిమానా!

**గజ్వేల్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్నారా.. ఆ కళ్లు ఇట్టే పట్టేస్తాయి. ఏ మాత్రం నిబంధనలు పాటించకపోయినా వాహనం యజమాని ఇంటికి జరిమానా చెల్లించాలని నోటీసు రావడం ఖాయం. అదేంటో తెలుసుకుందామా.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న 44వ జాతీయ రహదారి దేశంలోనే అత్యంత పొడవైనది. ఈ మార్గంలో వాహన చోదకులు అతివేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అత్యాదునిక కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రతి 10 కి.మీ.కొకటి బిగిస్తున్నారు.

## 12 తులాల బంగారు నగల చోరీ

**దుబ్బాక, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా జోగిపేట బస్‌స్టాండ్‌లో బస్సెక్కుతున్న మహిళ సంచిలోని బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు, సీఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రానికి చెందిన చెగురి లక్ష్మీదేవి తన మేనకోడలు కొడుకు వివాహానికి హాజరయ్యేందుకు స్వగ్రామం నుంచి ఆర్టీసీ బస్సుల్లో బయల్దేరారు. మార్గమధ్యలో జోగిపేట బస్‌స్టాండ్‌లో దిగారు. అక్కడ బంధువులతో కలిసి పటాన్‌చెరుకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. ఈ క్రమంలో ఆమె చేతిలోని సంచిలో నుంచి బంగారు నగలు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బస్సు సీటులో కూర్చున్న అనంతరం బాధితురాలు సంచిని చూసుకోగా అందులో ఉన్న హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు.

## తీరని గురువుల కొరత

**గద్వాల, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. విద్యాశాఖ నిబంధనల మేరకు ఆయా పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులుండాలి. కానీ చాలా పాఠశాలల్లో ప్రధానమైన లెక్కలు, సామాన్య శాస్త్రాలకే గురువుల్లేని పరిస్థితి ఉంది. దీంతో ఉన్నత పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ధరూరు ఉన్నత పాఠశాలలో వచ్చే మార్చిలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తుండగా, వారి స్థానంలో ఒకరిని డిప్యుటేషన్‌పై ఇచ్చారు. ఇలా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విరమణ అవుతూనే ఉన్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించకుండా డిప్యుటేషన్లతో సరిపెడుతున్నారు.

## బోల్తాపడిన బస్సు.. 20 మందికి గాయాలు

**వనపర్తి, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధి ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటనలో 19 మంది ప్రయాణికులు, బస్సు డ్రైవర్ గాయపడ్డారు. సంఘటన తెల్లవారుజామున చోటు చేసుకుంది. 108 సిబ్బంది, ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బుధవారం రాత్రి 10 గంటలకు హైదరాబాదు నుంచి బయలుదేరింది. తెల్లవారుజామున 4 గంటలకు ఉండవల్లి మండలంలోని ఇటిక్యాలపాడు స్టేజి దాటింది. డ్రైవర్ జయరాముడు బస్సును అతివేగంగా అజాగ్రత్తగా నిద్రమత్తులో నడపటంతో జాతీయ రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో అనంతపురానికి చెందిన స్నేహలత చేయి అరచేతి వరకు తెగి పడిపోయింది.

## చరవాణి పోయిందా..

## ఖాతాలో డబ్బులు కాపాడుకోండి

**జడ్చర్ల, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** ఆన్‌లైన్‌లో చెల్లింపుల కోసం ప్రతి ఒక్కరూ చరవాణిలో యూపీఐ యాప్‌ను వినియోగిస్తుంటారు. అయితే చరవాణి పోయినప్పుడు దాన్ని కొట్టేసిన వారు బ్యాంకు ఖాతాలతో అనుసంధానం ఉన్న యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బులను ఇతర ఖాతాల్లోకి మళ్లించేస్తున్నారు. దీంతో బాధితులు చరవాణితో పాటు ఖాతాల్లో నుంచి డబ్బులు పోగొట్టుకొని ఆందోళనకు గురవుతుంటారు. చరవాణి పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా సిమ్‌తో అనుసంధానం ఉన్న బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. తర్వాతే చరవాణి చోరీకి గురైందని ఫిర్యాదు చేయాలి. దీనివల్ల సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుక్కోవచ్చు.

## అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం రూ.18,000 కోట్ల వ్యయంతో దేశంలో తొలి అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్‌ను నిర్మించనుంది. అస్సాం రాష్ట్రంలో గోహ్పూర్ నుంచి నుమాలిగఢ్ వరకు దీన్ని నిర్మిస్తారు. ఈ 4 లేన్ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ ప్రాజెక్ట్‌కు రూ.18,662 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బ్రహ్మపుత్ర నది కింద రోడ్-రైల్ టన్నెల్ నిర్మిస్తారు.ప్రస్తుతం నుమాలిగఢ్ వద్ద నేషనల్ హైవే-715 నుంచి గోహ్పూర్ వద్ద నేషనల్ హైవే-15 వరకు దూరం 240 కిలోమీటర్లుగా ఉంది. ఈ మార్గం నేషనల్ హైవే-52పై సిల్ఘాట్ సమీపంలోని కాలియాభోంబోరా మీదుగా సాగుతుంది. ప్రయాణానికి 6 గంటలు పడుతుంది. ఈ మార్గం నుమాలిగఢ్, కాజిరంగా నేషనల్ పార్క్, బిస్వనాథ్ పట్టణం మీదుగా వెళ్తుంది.ప్రస్తుతం నుమాలిగఢ్ నుంచి గోహ్పూర్ వరకు దూరం 240 కిలోమీటర్లు. అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్ ప్రాజెక్ట్ పూర్తైతే దూరం 34 కిలోమీటర్లకు తగ్గుతుంది. అంటే మొత్తం తగ్గింపు సుమారు 206 కిలోమీటర్లు ఉంటుంది. ప్రయాణ సమయం కూడా సుమారు 6 గంటల నుంచి 20 నిమిషాలకు తగ్గుతుంది.క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ శనివారం 4 లేన్ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీన్ని ఇంజినీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్ ద్వారా అభివృద్ధి చేస్తారు.ఇది భారతదేశంలో తొలి అండర్‌వాటర్ రోడ్-రైల్ టన్నెల్. ప్రపంచంలో రెండోది. ఈ ప్రాజెక్ట్ అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ సహా ఈశాన్య రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనాన్ని అందిస్తుంది. సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుంది. లాజిస్టిక్స్ వ్యయం తగ్గుతుంది. సామాజిక-ఆర్థిక అభివృద్ధి వేగవంతం అవుతుంది.

# కవిత పార్టీ టీపీజేపీ ?



**హైదరాబాద్, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్దిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును టీపీజేపీ గా నిర్ణయించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ.ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది.ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు.నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు.ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు

# కార్పోరేషన్ విభజనపై నోటీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని పేర్కొంటూ ఓ వ్యక్తి.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేశారు. జనగణన ముగిసేవరకు జీహెచ్ఎంసీ విభజనపై స్టే ఇవ్వాలని పిటిషనర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇస్తూ విచారణను వాయిదా వేసింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జీహెచ్ఎంసీ )ని విభజించి 3 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ.. ఇటీవలె రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీతోపాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లను కొత్తగా ఏర్పాటు చేసింది. అయితే ఈ విభజనకు వ్యతిరేకంగా హైదరాబాద్‌కు చెందిన గురువారెడ్డి అనే బిజినెస్‌మెన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని.. దీనిపై స్టే విధించాలని కోరారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవలె జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ జీవో నంబర్ 55 జారీ చేసింది. ఈ జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ గురువారెడ్డి హైకోర్టుకెక్కారు. కేంద్ర ప్రభుత్వం 2027లో జనాభా లెక్కలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే ఈ జనాభా లెక్కలకు సంబంధించి కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు ఈ జీహెచ్ఎంసీ విభజన విరుద్ధమని పిటిషనర్ వాదించారు. అదే సమయంలో దేశంలో జనగణన పూర్తి అయ్యే వరకు ఈ జీవో నంబర్ 55పై స్టే విధించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.జనగణన పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీని విభజించకుండా ఇంతకుముందు ఎలా ఉందో అలాగే యథావిధిగా ఉంచాలని హైకోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. అటు కేంద్ర ప్రభుత్వంతోపాటు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ చేసింది. ఈ జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై తర్వాతి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం వెల్లడించింది

# అదిలాబాద్ కు కొత్త ఎయిర్ పోర్టు



**అదిలాబాద్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుంది. జిల్లాలో కొత్తగా ఎయిర్‌పోర్టు కానుంది. ఈ మేరకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌ను ఎంపీ గోడం నగేష్ విడుదల చేశారు. త్వరలోనే భూసేకరణ పనులుప్రారంభం అవుతాయని ఎంపీ వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుమాత్రమే అందుబాటులో ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మరికొన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు, కొత్తగూడెం, రామగుండం,ఆదిలాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ పనులు మట్నదలయ్యాయి. తాజాగా.. ఆదిలాబాద్ విమానాశ్రయంపై కూడా కీలకఅప్డేట్ వచ్చింది.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌కు అనుమతి వచ్చిందని ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్ ప్రతిని మీడియా ముందు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మరో 10 వేల ఎకరాల గుర్తింపునకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు రంగంలోకి దిగాక.. మాస్టర్ ప్లాన్‌లో కొంత మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయాలను వెల్లడించారు.'ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందింది. జిల్లా ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. దశాబ్దాలుగా ఈ ప్రాంతం ప్రజలు ఎయిర్ కనెక్టివిటీ కోసంఎదురు చూస్తున్నారు. నేడు ఆ కల సాకారం కాబోతుంది. ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చుతోంది. అధికారికంగా మాస్టర్ ప్లాన్ ఆమోదించారు.త్వరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో ముందడుగు వేస్తోంది. మౌళిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వాటి ఫలితమే ఈ ముందడుగు.స్థానిక ప్రజల దీర్ఘకాల డిమాండ్‌ను నిజం చేయటం కోసం నిరంతర కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ విమానాశ్రయం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే ఎక్కువ. ఇది ఆదిలాబాద్ జిల్లాకు ఒక మలుపు. మా జిల్లాను ప్రధాన నగరాలకుఅనుసంధానిస్తుంది, స్థానిక వ్యాపారాలు, రైతులకు మద్దతు ఇస్తుంది, మా గిరిజన, అటవీ ప్రాంతాలకు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఆదిలాబాద్ యువతకు ఉపాధి అవకాశాలనుసృష్టిస్తుంది.' అని గోడం నగేష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రముఖుల బాగోతాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కొంతకాలంగా ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ నేడు వార్తలలోని వ్యక్తి. అమెరికాలో ఒక నేరసామ్రాజ్య అధినేత. ఏకంగా 33 వేల చదరపు అడుగుల దీవి ఆయన సొంతం. న్యూయార్క్ నగరంలో అత్యంత ఖరీదైన విలాసవంతమైన భవనం నిర్మించుకున్నాడు. ఆ దేశంలో పేరున్న ఆర్థిక వ్యాపారవేత్త. ఎంతోమంది దేశాధ్యక్షులతో, ప్రధానమంత్రులతో ఎంతో సాన్నిహిత్యం, సత్సంబంధాలు నెరపిన చరిత్ర ఆయనకే సొంతం. ఒక ఆర్థిక వ్యాపారస్థుడికి ఆ స్థాయి అంతర్జాతీయ సంబంధాలు నెలకొల్పుకోవడం, నిలబెట్టుకోవడం ఆశ్చర్యమే. కానీ అది ఎప్‌స్టీన్‌కే సాధ్యం. ఆయన కార్యకలాపాలు ఆ విధంగా ఉండేవి. అతడి జీవితం మొత్తం అధికారం, సెక్స్, నేరం, రాజకీయాల చుట్టే తిరిగేది. అందుకే ఆయన మరణించి ఏడేళ్లు అవుతున్నా ఇంకా వార్తల్లో నిలిచి ఉన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైనాడు. దేశాధినేతల వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేశాడు. వారు విమర్శలపాలై, వారి పదవికి ఎసరుపెట్టే విధంగా ఉన్న చరిత్ర ఆయనది. చివరికి ఆయనతో సంబంధాలు ఉన్నవారు, వారి కుటుంబ సభ్యుల చేతనే విమర్శలకు గురవుతున్న పరిస్థితి. ఇంతగా ప్రపంచం మొత్తాన్ని కదిలించి వేస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్ నిజంగా తెలుసుకోదగినవే.

జెఫ్రీ ఎప్‌స్టీన్ మీద మొదట 1996లో మరియ ఫార్మర్ అనే మహిళ తన అక్కాచెల్లెళ్ల నగ్న ఫోటోలను దొంగిలించాడని కేసు నమోదైనా విచారణ జరగలేదు. కానీ 2005లో మరొక మహిళ తన 14 ఏళ్ల సవతి కూతురిని ఎప్‌స్టీన్ ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో రేప్ చేసినట్లు ఆరోపించింది. అమెరికన్ విచారణ సంస్థ ఎఫ్‌బిఐ మరో 35 మంది ఆడపిల్లల కథలు కూడా గుర్తించి 2008లో ఎప్‌స్టీన్‌ను శిక్షార్హుడిగా గుర్తించింది. కానీ విచిత్రంగా ఎక్కడా జరగని నాన్ ప్రాసిక్యూషన్ అగ్రిమెంట్ జరిగింది. కేవలం 18నెలలు మాత్రమే ఆయన జైలులో ఉన్నాడు. అంతేకాదు ఆ రకమైన శిక్ష తగ్గించబడింది. ఆ అగ్రిమెంట్ ప్రకారం పగటిపూట అతడు బయట తిరగవచ్చు. రాత్రిపూట మాత్రమే జైలు శిక్ష అనుభవిస్తాడు. మళ్లీ తన వ్యాపారాన్ని నేర సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు. అనేక దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, శాస్త్రజ్ఞులు, హాలీవుడ్ నటులు ఆయన ఆహ్వానం మేరకు కలవగా వారికి అమ్మాయిలను ఎర చూపి వారితో సంబంధాలు నెలకొల్పుకున్నాడు. ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు అందులో భాగమయ్యారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, లండన్ యువరాజు వంటి ప్రముఖులు సైతం ఆయనచే ప్రభావితం అయ్యారు. భారతదేశం నుండి ప్రధాని నరేంద్ర మోడీ, మంత్రి హరీదీప్ సింగ్ పూరి, ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేర్లు కూడా ఈ ఫైల్స్‌లో ఉండడం గమనార్హం. 2014లో భారతీయ జనతా పార్టీలో చేరిన హరిదీప్ సింగ్ 2017లో నరేంద్ర మోడీ మంత్రివర్గంలో చేరాడు. అంతకు ముందు ఒక ఐఎఫ్ఎస్ అధికారి అయిన పూరి రాయబారిగా పనిచేశాడు. కానీ పెట్రోలు సహజవాయువుల శాఖ మంత్రి అయిన తర్వాత అనేక మెయిల్స్, చాట్ చేసినట్లుగా ఈ ఫైల్స్‌లో బయటపడినాయి. తాను కేవలం సాంకేతిక విషయాలపైనే ఈ విధంగా ఆయనతో మెయిల్స్, చాట్ చేసినట్లు పూరి బుకాయిస్తున్నాడు. అంతకుముందు 2013 వరకు పూరి భద్రతామండలి సభ్యుడు కూడా. ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కూడా మార్చి 2017లో ఎప్‌స్టీన్‌తో లావాదేవీలు జరిపినట్లు ఫైల్స్ పేర్కొంటున్నాయి. అందుకు ప్రతిగా భారతీయ మార్కెట్‌కు కట్టబెట్టడానికే ప్రయత్నాలు జరిగాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ విధానంలో మార్పు కూడా కేవలం అతడి వల్లనే కలిగినట్లు విమర్శలు ఉన్నాయి. ఆ ఫైల్స్‌లో ఆ రకమైన ఆధారాలు ఉన్నాయి. అప్పటివరకు పాలస్తీనా, ఇజ్రాయెల్ విషయంలో పాలస్తీనాను సమర్థిస్తూ వచ్చిన మోడీ అమెరికా అధ్యక్షుడితో చర్చల అనంతరం తన విధానాన్ని మార్చుకొనడం జరిగింది. ఇజ్రాయెల్‌ను సమర్థించడంలో ఎప్‌స్టీన్, డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి మేరకే ఆ విధంగా జరిగినట్లు ఈ ఫైల్స్ ద్వారా తెలుస్తున్నది. ఈ విధంగా ఎప్‌స్టీన్ అనేక విధాలుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తారంగా వాడుకుంటూ అనేక దేశాలను ప్రభావితం చేశాడు. ఇంతటి మహా సామ్రాజ్య నిర్మాత ఎప్‌స్టీన్ 2019లో మాన్‌హట్టన్ జైలులో మరణించాడు.

ప్రపంచంలోని పెద్దల బండారం బయటపడకుండా ఉండటానికి అతడిని చంపారని కూడా ఒక విమర్శ లేకపోలేదు. అతడి సహచరి, నిందితురాలు మాక్స్వెల్ కూడా 2021లో జైలు శిక్షకు గురైంది. జనవరి 30, 2026 నాడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ అమెరికా విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్ మూడు లక్షల పేజీల డాక్యుమెంట్. 1,80,000 ఫోటోలు 2000 వీడియోలతో కూడినది. 300 గిగా బైట్ల సమాచారం ఈ ఫైల్స్‌లో నిక్షిప్తమై ఉంది. నవంబర్ 18, 2025లో ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌ఫరెన్సీ చట్టాన్ని ఆమోదించి దశలవారీగా ఈ ఫైల్స్ ను విడుదల చేయడంతో అనేక వాస్తవాలు వెలుగులోకి రావడంతో ప్రపంచం నివ్వెరపోయింది.

డొనాల్డ్ ట్రంప్, ఎప్‌స్టీన్‌ల మధ్య సంబంధం 1980 చివర నుండి నడుస్తూ వస్తున్నది. ఎప్పుడు కూడా మంచి అందమైన అమ్మాయిలను తనలాగే ఎప్‌స్టీన్ ఇష్టపడేవాడని ట్రంప్ అభివర్ణించాడు. ఈ ఫైల్స్‌లో ఎవరి పేరు ఉటంకించబడిన వారికి అది అవమానమే. ట్రంప్ నుండి ప్రయోజనాల కోసం మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును కలిసినట్లు అర్థమవుతున్నది. కానీ జాతీయ స్థాయి ప్రధానస్రవంతి మీడియా మాత్రం నోరు మెదపడం లేదు. ఈ ఫైల్స్‌లో మోడీ పేరు అనేక సార్లు చెప్పబడింది. ఇజ్రాయెల్‌ను మొట్టమొదటగా సందర్శించిన భారత ప్రధానిగా మోడీ చరిత్రలోకి ఎక్కారు. అమెరికా మెడలు వంచాం అని బయటకు బీరాలు పలికే మన ప్రధాని ఈ విధంగా ట్రంప్ నుండి ఏవో ప్రయోజనాలు ఆశించి ఈ విధంగా ఈ ఫైల్స్‌లో దొరికిపోవడం జరిగింది. 2016లో రాఫెల్ డీల్ జరిగింది. అప్పటివరకు యుద్ధ విమానాల తయారీలో ఏమాత్రం అనుభవం లేని కొత్తగా పుట్టుకొచ్చిన రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్‌కు ఇజ్రాయెల్‌కు 51:49 నిష్పత్తిలో ఈ డీల్ కుదిరింది, టెండర్ దక్కింది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు కూడా ధ్రువీకరించడం జరిగింది. ఫిబ్రవరి 2017 నుండి ఎప్‌స్టీన్, అనిల్ అంబానీ మధ్య సత్సంబంధాలు పెరిగాయి. ఈ విధంగా ఎప్‌స్టీన్ ఫైల్స్ దేశవిదేశాల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది.

ఒక నేరచరిత్ర కలిగిన వ్యక్తి అందమైన టీనేజ్ అమ్మాయిలను ప్రముఖులకు చేరవేస్తూ అట్టి వ్యక్తులతో సంబంధాలు నెలకొల్పుకొని రాజకీయంగాను, ఆర్థికంగానూ బలపడ్డాడు. దురదృష్టవశాత్తు మన దేశ ప్రధాని, ఒక మంత్రి, ఒక బడా పారిశ్రామికవేత్త ఈ ఫైల్స్‌లో అనేక మార్లు పేర్కొనబడటం మనకు కూడా తలవంపులు కలిగించే విషయం. దేశ రక్షణ కొనుగోళ్లకు సంబంధించిన రాఫెల్ డీల్‌లో కూడా ఎప్‌స్టీన్ పాత్ర చాలా గణనీయమని ఈ డాక్యుమెంట్స్ ద్వారా తెలుస్తున్నది. ఇంతకాలంగా అణచివేతకు గురవుతున్న పాలస్తీనాకు నైతిక మద్దతునిచ్చిన మన దేశం అకస్మాత్తుగా తన విధానాన్ని మార్చుకొని ఇజ్రాయెల్‌కు మద్దతు పలకడం కేవలం అమెరికాతో సత్సంబంధాలు కొనసాగించడానికి అనేది సుస్పష్టం. ప్రముఖులకు, దేశాధినేతలకు అమ్మాయిలను ఎరవేసి తన వ్యాపార విస్తరణ చేసుకుంటూ దేశాధినేతలతో ఇతడు పరిచయాలు పెంచుకున్న విధానం కచ్చితంగా అనుమానించదగినదే. ఒక మామూలు టీచర్‌గా తన జీవితాన్ని ప్రారంభించి ప్రపంచ నేతలకు యువతులను ఉపయోగించి లోబరుచుకున్న నీచ వ్యక్తి నేడు భౌతికంగా లేకపోయినా అతని ఫైల్స్ దేశదేశాల్లో భూకంపం పుట్టిస్తున్నాయి.

తన దీవికి ఆహ్వానించి విందులు ఏర్పాటు చేసి దేశాధినేతల మధ్య పరిచయం కలిగించిన ఒక బ్రోకర్ గా మనం ఎప్‌స్టీన్‌ను వర్ణించవచ్చు. రాజకీయ నాయకులు స్వచ్ఛందంగా తమ పదవుల నుండి వైదొలగుతున్న పరిస్థితి నేడు ప్రపంచంలో కనబడుతున్నది కేవలం ఈ ఫైల్స్ లో వారి పేర్లు బయటపడిన కారణంగా మాత్రమే. ఈ ఫైల్స్‌లో 300 మంది ప్రముఖుల పేర్లు ఉన్నాయి. 1200 నుండి 1500 పేర్లు ఏదో ఒక నేరంతో ముడిపడి ఉన్న పరిస్థితి. మొత్తంగా 23,000 మంది పేర్లు ఈ ఫైల్స్ నిండా ఉటకించబడి ఉన్నట్లుగా చెబుతున్నారు. పేర్లు ఉన్న వారందరూ నేరస్థులుగా మనం పరిగణించలేం.

కానీ ఫైల్స్‌లో వారి ప్రస్తావన ఉండడం అనుమానాస్పదం, అవమానకరం. బ్రిటన్‌లో ఇద్దరుముగ్గురు రాజీనామా చేశారు. లేబర్ పార్టీ నాయకుడు, ఇంకా ప్రిన్స్ ఆంద్రు తమ పదవుల నుండి తప్పుకున్నారు. కొందరు బహిరంగంగా క్షమాపణ చెప్పారు. విచారణలు మొదలైనాయి. దర్యాప్తులు కూడా ప్రారంభమైనాయి. అనేక దేశాలలో దేశాధినేతల పీఠాలు కదులుతున్నాయి. అమెరికా, భారత దేశాధినేతలలో మాత్రం చలనం లేదు. సమయం, తేదీలతో సహా ఈ ఫైల్స్‌లో ఆధారాలు ఉండగా, వాటిని మన నేతలు కొట్టి పారవేస్తున్నారు. పవర్ బ్రోకర్ల ద్వారా దళారీల ద్వారా మధ్యవర్తిత్వం నెరపడం దేశానికి సిగ్గుచేటు. అది ముఖ్యంగా దేశ రక్షణ వ్యవహారాలలో కావడం మరింత అనుమానాస్పదం. ఎందుకింత రాజీతత్వం, రాజీ ధోరణి? నేర సంబంధాలు దేశానికి, దేశ రక్షణకు చేటు కలిగించబోతున్నాయి. ఈ దేశంలో ప్రభుత్వాలకు, రాజకీయ నేతలకు ఇంకా విలువలు ఉన్నాయని నిరూపించుకోవలసిన బాధ్యత నేటి పాలకులపై ఎంతైనా ఉంది.

# మేడ్ ఇన్ ఇండియా గ్లాసెస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పెన్ పవర్:** భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగవంతమైన పురోగతి మధ్య, ఒక కొత్త, ఆసక్తికరమైన ఆవిష్కరణ ఉద్భవించింది. ఇటీవల, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగవంతమైన పురోగతి మధ్య, ఒక కొత్త, ఆసక్తికరమైన ఆవిష్కరణ ఉద్భవించింది. ఇటీవల, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ఒక ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాసెస్ ధరించి కనిపించారు. సర్వమ్ కేజ్ అని పిలిచే ఈ గ్లాసెస్‌ను భారతీయ స్టార్టప్ సర్వమ్ ఏఐ అభివృద్ధి చేసింది. ఇవి సాధారణ గ్లాసెస్ కాదు, కానీ మానవుడిలా తక్షణమే వినగల, అర్థం చేసుకుని స్పందించగల స్మార్ట్ పరికరం. ఈ సాంకేతికత భవిష్యత్తులో మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారబోతోందని సూచిస్తుంది.

సర్వం కేజ్ లాంటి స్మార్ట్ గ్లాసెస్ భవిష్యత్తులో మన జీవితాలను గణనీయంగా మార్చగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రజల పనిని సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. విద్యలో, విద్యార్థులు దీనిని నేర్చుకోవడానికి ఉపయోగించవచ్చు. ఆరోగ్య సంరక్షణలో, వైద్యులు రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయగలరు. వ్యాపారంలో, ఇది ప్రజలు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, ఈ సాంకేతికత డిజిటల్, వాస్తవ ప్రపంచానికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మనకు ఇకపై ప్రత్యేక పరికరం అవసరం లేదు, బదులుగా, అదే పరికరం అన్ని సమయాల్లో మనతో ఉంటుంది. ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ఒక ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాసెస్ ధరించి కనిపించారు. సర్వమ్ కేజ్ అని పిలిచే ఈ గ్లాసెస్‌ను భారతీయ స్టార్టప్ సర్వమ్ ఏఐ అభివృద్ధి చేసింది. ఇవి సాధారణ గ్లాసెస్ కాదు, కానీ మానవుడిలా తక్షణమే వినగల, అర్థం చేసుకుని స్పందించగల స్మార్ట్ పరికరం. ఈ సాంకేతికత భవిష్యత్తులో ఏఐ మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారబోతోందని సూచిస్తుంది. సర్వమ్ కేజ్ అనేది ఏఐ-ఆధారిత స్మార్ట్‌గ్లాస్, దీనిని ధరించినప్పుడు, వినియోగదారునికి వ్యక్తిగత డిజిటల్ అసిస్టెంట్ ఉన్న అనుభవాన్ని అందిస్తుంది. ఈ పరికరం నిజ సమయంలో పనిచేస్తుంది. అంటే మీరు ఏమి చూస్తున్నారో లేదా చెబుతున్నారో అది తక్షణమే అర్థం చేసుకుంటుంది, ప్రతిస్పందిస్తుంది. ఇప్పటివరకు మం మొబైల్ ఫోన్లు లేదా కంప్యూటర్ల ద్వారా ఏఐని ఉపయోగించాము. కానీ ఈ గ్లాసెస్ ఏఐని నేరుగా మన కళ్ళకు తీసుకువస్తున్నాయి. ఇది నిరంతరం స్క్రీన్‌ను చూడవలసిన అవసరాన్ని తొలగిస్తుంది, ఇది మన పనిని చాలా సులభతరం చేస్తుందంటున్నారు నిపుణులు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ఇండియన్ ఏఐ స్టార్టప్ సర్వమ్ ఏఐ తన రాబోయే స్మార్ట్‌గ్లాసెస్ సర్వమ్ కేజ్ గురించి వివరించారు. కంపెనీ సహ వ్యవస్థాపకుడు ప్రత్యూష్ కుమార్ ఈ పరికరం ఏఐని నేరుగా రోజువారీ జీవితంలోకి తీసుకురావడానికి రూపొందించినట్లు ఒక టీజర్ వీడియోను విడుదల చేశారు. ఈ స్మార్ట్‌గ్లాసెస్ ధరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోను కూడా వేదికపై షేర్ చేశారు. కంపెనీ ప్రకారం, ప్రధానమంత్రి మొదట వాటిని ప్రయత్నించారు. సర్వమ్ కేజ్‌అతిపెద్ద బలం దాని స్మార్ట్ ఫీచర్లలో ఉంది. ఇవి సాధారణ గాడ్జెట్‌ల నుండి వేరు చేస్తాయి. ఇది మీ ముందు ఉన్న దాన్ని చూడగల చిన్న కెమెరాను కలిగి ఉంటుంది. ఇది రికార్డ్ చేయడమే కాకుండా, ఏఐతో అర్థం చేసుకుని ప్రతిస్పందిస్తుంది. మీరు ఏదైనా అడిగితే, ఈ గ్లాసెస్ తక్షణమే సమాచారాన్ని అందించగలవు. మరో ప్రత్యేకత ఏమిటంటే ఇది పూర్తిగా వాయిస్ ద్వారా పని చేస్తుంది. మీరు ఏ బటన్లను నొక్కాల్సిన అవసరం లేదు. ఇది మీరు చెప్పేది అర్థం చేసుకుంటుంది. దానికి అనుగుణంగా స్పందిస్తుంది. ఇది ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం అంతగా తెలియని వారికి ఉపయోగించడం చాలా సులభం చేస్తుంది. మరో ముఖ్యమైన లక్షణం రియల్-టైమ్ ప్రతిస్పందన. దీని అర్థం మీరు ఏ ప్రశ్నకైనా తక్షణ ప్రతిస్పందనను పొందుతారు. మీరు దిశలను అడిగినా లేదా సమాచారం అవసరమైనా, ప్రతిదీ ఆలస్యం లేకుండా సహాయపడుతుంది. అదనంగా, ఈ గ్లాసెస్ ఫోటోలు, వీడియోలను కూడా రికార్డ్ చేయగలవు. మీరు మీ ఫోన్‌ను బయటకు తీయవలసిన అవసరం లేదు. మీరు చూస్తున్న వాటిని నేరుగా రికార్డ్ చేయవచ్చు. ఈ ఫీచర్ ముఖ్యంగా ప్రయాణించే లేదా కంటెంట్‌ను సృష్టించే వారికి ఉపయోగపడుతుంది. మరో ప్రత్యేక లక్షణం ఏమిటంటే దీనికి స్క్రీన్ అవసరం లేదు. ఇది ఆడియో ద్వారా సమాచారాన్ని అందిస్తుంది, మీ దృష్టిని, మీ పరిసరాలను కేంద్రీకరించి ఉంచుతుంది. ముఖ్యంగా, ఈ పరికరం భారతీయ భాషల కోసం కూడా అభివృద్ధి చేయడం జరుగుతోంది. దీని అర్థం ఇది హిందీ సహా ఇతర భాషలలో పనిచేయగలదు. ఇది భారత్ వంటి దేశానికి చాలా ముఖ్యమైనది. భారత్ మండపంలో జరిగిన ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ స్మార్ట్ గ్లాసెస్ ధరించి వాటి గురించి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మోదీ కొత్త టెక్నాలజీని ఉపయోగించినప్పుడు, అది దాని ప్రాముఖ్యతను ప్రదర్శించింది. భారతదేశంలో అభివృద్ధి చేసిన టెక్నాలజీలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, స్వావలంబన కోసం కృషి చేస్తోందని ఇది సూచిస్తుంది. సర్వం ఏఐ వ్యవస్థాపకుడు దీనిని ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు. సర్వమ్ ఈ స్మార్ట్ గ్లాసెస్‌ను అభివృద్ధి చేయడమే కాకుండా, అనేక రంగాలలో కూడా పనిచేస్తోంది. ఈ కంపెనీ భారతీయ భాషల కోసం స్పీచ్ మోడల్‌లను అభివృద్ధి చేస్తోంది. అదనంగా, ఇది డాక్యుమెంట్లను డిజిటలైజ్ చేయడంలో సహాయపడే సర్వమ్ అక్షర్, వివిధ భాషలలో కంటెంట్‌ను సృష్టించడంలో సహాయపడే సర్వమ్ స్టూడియో వంటి ఇతర ఉత్పత్తులను అభివృద్ధి చేసింది. సారస్ అనే స్పీచ్ మోడల్ కూడా అభివృద్ధి చేయడం జరిగింది. ఇది స్వరాలను బాగా గుర్తించగలదు. ఇవన్నీ భారతదేశం కోసం ప్రత్యేకంగా దాని ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. భారత ప్రభుత్వం ఏఐని ప్రోత్సహించడానికి మిషన్‌ను ప్రారంభించింది. ఈ మిషన్ కింద వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్నారు.

దేశంలో ఏఐ పరిశోధనను బలోపేతం చేయడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఈ మిషన్ కింద, భారతీయ భాషా ఆధారిత ఏఐ నమూనాలను అభివృద్ధి చేయడానికి అనేక బృందాలను ఎంపిక చేశారు. పరిశోధన, అభివృద్ధిని వేగవంతం చేయడానికి వేలాది GPU లు కూడా అందుబాటులో ఉంచారు. సర్వం కేజ్ వంటి ఉత్పత్తులను ఈ మిషన్‌లో భాగంగా పరిగణించవచ్చు, భారతదేశం ఇప్పుడు ఏఐ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఇది నిరూపిస్తుంది. సర్వం కేజ్ లాంటి స్మార్ట్ గ్లాసెస్ భవిష్యత్తులో మన జీవితాలను గణనీయంగా మార్చగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రజల పనిని సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. విద్యలో, విద్యార్థులు దీనిని నేర్చుకోవడానికి ఉపయోగించవచ్చు. ఆరోగ్య సంరక్షణలో, వైద్యులు రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయగలరు. వ్యాపారంలో, ఇది ప్రజలు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, ఈ సాంకేతికత డిజిటల్, వాస్తవ ప్రపంచానికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మనకు ఇకపై ప్రత్యేక పరికరం అవసరం లేదు, బదులుగా, అదే పరికరం అన్ని సమయాల్లో మనతో ఉంటుంది.

## ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశం

**మెదక్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** జిల్లాలో మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్లతో నిర్వహించిన సమావేశంలో, పరీక్ష కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన సూచించారు.

## చిరుతిళ్లు నిల్వ చేసే గోదాంలో అగ్నిప్రమాదం

**నర్సాపూర్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో చిరుతిళ్లు నిల్వ చేసే ఓ గోదాంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పట్టణంలోని సుభాష్ గంజ్‌లో దుకాణంలో అర్ధరాత్రి ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. ఈ మంటల ధాటికి దుకాణంలో చిరుతిండ్లు కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 10 లక్షల విలువైన చిరుతిళ్ల కాటన్‌లు కాలిపోయినట్లు యజమానులు తెలిపారు. ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలు అదుపు చేయడంతో పక్కనున్న దుకాణాలకు అగ్ని ప్రమాదం తప్పింది.

## జానకిపురంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**మధిర, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** బోనకల్ మండలం జానకిపురం ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి.

## ఘోరంగా కొట్టుకున్న విద్యార్థులు!

**ఖమ్మం, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** ఖమ్మం అర్బన్ ఖానాపురం పీఎస్ పరిధిలోని వెలుగుమట్లలో ఉన్న నారాయణ జూనియర్ కాలేజీలో విద్యార్థులు ఘోరంగా కొట్టుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గాయపడిన ఓ విద్యార్థికి చికిత్స చేయించిన యాజమాన్యం విషయాన్ని గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## దిగ్విజయ్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ సీఎం



**కొత్తగూడెం, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** ఢిల్లీలో శుక్రవారం, మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్‌ను డిప్యూటీ సీఎం మల్లు బిబట్టి విక్రమార్క తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మార్చి 5న జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరుకావాలని దిగ్విజయ్ సింగ్‌ను ఆయన ఆహ్వానించారు. ఈ సమావేశం మాజీ సీఎంను డిప్యూటీ సీఎం కలవడం గురించి తెలియజేస్తుంది.

## పాల్వంచ కాంగ్రెస్ కార్పొరేటర్ భాస్కర్ రావుకు ఘన సన్మానం

**పాలేరు, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** పాల్వంచ నెహ్రూనగర్ 43వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్గా గెలిచిన కాల్వ భాస్కర్ రావుకు కొత్తపల్లి సోమయ్య ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సోమయ్య, నందిగామ జయరాజు, కటుకూరి శేఖర్ బాబు, కొత్తపల్లి రవికుమార్, నారపోగు నాగరాజు, కటుకూరి కోటేశ్వరరావు, పల్లపు రాములు, జిల్లెపల్లి చిరంజీవి, మేషపోగు జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాల్వ భాస్కర్ రావుకు పూల దండ వేసి ఘనంగా సన్మానించారు.

## కొత్తగూడెం కార్పొరేటర్ ధనలక్ష్మి పనుల పరిశీలన

**సత్తుపల్లి, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం 24వ డివిజన్ బర్మ్ క్యాంపులో నూతన మున్సిపల్ కార్పొరేటర్ ధనలక్ష్మి గారు శుక్రవారం స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. మెసీన్ భగీరథ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఏఐటీయూసీ నాయకులు కిష్టఫర్, రమణమూర్తి, సీపీఐ నాయకులు సొల్లు రవికిరణ్, రామయ్య, లక్ష్మీపతి, రాంబాబు, సిరాజ్, నయీమ, శేషు, యాకూబ్, ఉదయ్, బట్టి శీను, బాల, భాను, వరుణ్, ఏఐవైఎఫ్ యూత్ ప్రెసిడెంట్ నితిన్ కుమార్ పాల్గొన్నారు.

## ఆటో బైక్ ఢీకొని ఇద్దరికీ గాయాలు

**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గోవిందపురం గ్రామ శివారు కంకర రోడ్డుపై శుక్రవారం ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

## పట్టు రైతులకు అవగాహన సదస్సు: అధిక లాభాలకై ప్రోత్సాహం

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం దశ్రు తండాలో పట్టు పురుగుల షెడ్‌లో పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ రాఘవేందర్ రావు, డాక్టర్ భూమన, యూా నర్సంపేట షాబఖాన్, రాజయ్య, ఉద్యానవన అధికారులు, సెరికల్చర్ అధికారి అరవింద్ మాట్లాడుతూ, పట్టు సాగులో పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ వాడాలని సూచించారు. గిరిజన రైతులు ఉత్సాహంతో ముందుకు వచ్చి అధిక లాభాలు పొందాలని కోరారు. స్థానిక సర్పంచ్ కేలోత్ అమృత, బిక్షపతి, పట్టు సాగు చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

## పేదలకు కరెంట్, నీటిసరఫరా నిలిపివేయడం దుర్మార్గం:




**వరంగల్ వెస్ట్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** కార్మికులకు, పేదలకు కరెంట్, నీటిసరఫరా నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం భద్రకాళి ఆలయ సమీపంలోని చేరబండ రాజు కాలనీలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బండలు కొట్టుకుని జీవనం సాగించే పేదలు గత 50 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నారన్నారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్లలో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పేదలను ధనికులను చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి




**ఆదిలాబాద్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాజు ఆదిలాబాద్ లోని సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో పనిచేసే లేబర్ వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**బోథ్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** మహబూబ్‌నగర్ జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని, బాధితులకు నష్టపరిహారం అందించాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ స్రవంతి, డీఎస్పీ జీవన్ రెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మురుగు కాలువ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**నిర్మల్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 13వ వార్డ్ కాల్ టెక్స్ ఏరియాలో జరుగుతున్న మురుగు కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి పరిశీలించారు. వార్డులోని అన్ని వీధుల్లో కల్వర్టులను కూడా త్వరగా నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్ను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వర్గంలో కౌన్సిలర్ రాజ్ కుమార్, బస్తివాసులు పాల్గొన్నారు.

## స్తంభం విరిగి మహిళలకు తీవ్ర గాయాలు

**ముథోల్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** మండలంలోని చించాల గ్రామంలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడటంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బైంసా మండలంలోని మాగం గ్రామానికి చెందిన లక్ష్మి రెండు రోజుల క్రితం వేరే గ్రామానికి శుభకార్యానికి వచ్చింది. శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరుబయటకు వెళ్లింది. అదేసమయంలో విద్యుత్ స్తంభం పైకి కొండముచ్చు దూకడంతో ఒక్కసారిగా స్తంభం విరిగి లక్ష్మిపై పడటంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ముథోల్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

## అరెస్టులపై ఆందోళనకు భారాస యోచన..

**ఖానాపూర్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** క్యాతనపల్లిలో భారాస నేతలపై నమోదైన కేసులు, అరెస్టులపై ఆందోళనలు చేయాలని భారాస భావిస్తోంది. మంచిర్యాలలో కోర్టు విధించిన 14 రోజుల రిమాండ్‌లో భాగంగా బాల్క సుమన్, మూల రాజిరెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్‌ను బుధవారం అర్ధరాత్రి దాటాక ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించిన పోలీసులు మిగిలిన గుడిసెల రాజు రమేష్, గాజుల చంద్రకిరణ్, మేడిపల్లి సంపత్, రవీందర్‌రెడ్డి, బండారి సూరిబాబును అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనక మంత్రి వివేక్ పాత్ర ఉందని విమర్శిస్తున్న భారాస ఈ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది.

## ఆర్నకొండలో చత్రపతి శివాజీ జయంతి:

## చావ సినిమా ప్రదర్శన



**చొప్పదండి, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, చొప్పదండి మండలం ఆర్నకొండలో చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా రాత్రి బజరంగ్దళ్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 'చావ' సినిమా ప్రదర్శించారు. హిందూ సమాజం కోసం శివాజీ మహారాజ్, శంభాజీ మహారాజ్ చేసిన పోరాటాలు, ఐక్యత గురించి యువతకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ కార్యకర్తలు గుంటరాజు, మహేష్ తో పాటు యువత, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సినిమా ప్రదర్శన చొప్పదండిలో జరిగింది.

## వంటడుపుల గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ సదస్సు

**మానకొండూరు, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం వంటడుపుల గ్రామపంచాయతీలో శుక్రవారం, గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణపై సదస్సు జరిగింది. జగిత్యాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు, టీ.ఆర్.వి.కె. ఆధ్వర్యంలో శిక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సమస్యలను గుర్తించి, పరిష్కారాలపై చర్చించారు. వ్యవసాయానికి సంబంధించిన సామాజిక, వనరుల పటం, పైచార్ట్, కదలిక పటం, జనాభా పైచార్ట్, కాలక్రమరేఖ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గంగాభవాని, సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ గంగాచారి, సెక్రెటరీ మహమ్మద్ అలీ, పలువురు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేది కుటుంబ వివాహానికి బెండ్రం ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**కరీంనగర్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో పేద కుటుంబానికి చెందిన దాక్షాయణి-సాయి తేజ గౌడ్ ల వివాహానికి బెండ్రం తిరుపతిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.10,000 విలువైన టేక్ మంచాలు, వస్తువులు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ, మండలంలోని పేద కుటుంబాల కుమార్తెల వివాహాలకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దపులి కలకలం

**హుజూరాబాద్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** సిరిసిల్ల జిల్లాలో పెద్దపులి సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లోని శివారు గ్రామాల్లో తిరుగుతూ, మూడు రోజుల క్రితం పెద్దలింగాపూర్, తిప్పాపూర్ గ్రామాల్లో మూగజీవాలపై దాడి చేసింది. దీంతో రైతులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. బుధవారం తంగళ్లపల్లి శివారులో రైల్వే కూలీలకు పులి కనిపించగా, అటవీ అధికారులు పంట పొలాల్లో పులి పాదముద్రలను ధ్రువీకరించారు. గోపాల్‌రావుపల్లె మానేరు నది తీరం వెంట గుట్టలలో పులి కనిపించిందని మత్స్యకారులు తెలపడంతో అధికారులు పరిశీలించి, అవి పెద్ద పులివేనని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్వో కల్పనాదేవి ప్రజలను అప్రమత్తం చేస్తూ, రెండు రోజుల వరకు పొలాల వద్దకు వెళ్లవద్దని రైతులకు సూచించారు. పులిని పట్టుకోవడానికి అధికారులు కెమెరాలు, రెస్క్యూ టీంలతో నిఘా ఉంచారు.

## మంత్రి కలిసిన అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్, సభ్యులు



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 పెన్ పవర్:** మక్తల్ నియోజకవర్గం అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి, వైస్ చైర్ పర్సన్ రాధా అరుణ్, కౌన్సిలర్లు శుక్రవారం మక్తల్ లో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర క్రీడా పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంతరం మంత్రి వారిని అభినందించారు. మంత్రి మాట్లాడుతూ, మున్సిపాలిటీని కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కల్లు గీత సెల్ చైర్మన్ నాగరాజు గౌడ్, అమరచింత కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మారిషస్‌లో తెలుగు వెలుగు

ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీరప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. 2040 చ.కి.మీల వైశాల్యం కలిగి, పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12 లక్షల పైచిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియన్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతో పాటు, భోజ్ పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు గా కలిగి ఉంది. 1630 – 1710 డచ్ కాలనీగా 1715 – 1810 మధ్య ఫ్రెంచ్ కాలనీగా తర్వాత 1968 వరకు బ్రిటిష్ కాలనీల నుండి తర్వాత స్వాతంత్రం పొందింది. 1903లో పైచెల్లిసును ప్రత్యేక కాలనీ గా రూపొందించిన తర్వాత మారిషస్ క్రమానుగత అభివృద్ధి జరుగు తున్నది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూ యిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది. రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్దసంఖ్యలో భారత దేశం నుండి కార్మికులను తీసుకు వచ్చారు. 1834 – 1921 మధ్యలో ద్వీపంలో సుమారు 5 లక్షల మంది కార్మికులు పనిచేసారు. నేడు మారిషస్ జనాభాలో 68% కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో – మారిషియన్లు అని పిలుస్తారు. ప్రైవేటు వ్యవసాయ దారుల క్రింద కూలీలుగా పనిచేయటానికి 1835 లో కిష్టమ్, వెంకటపతి, అప్పయ్య అనే ముగ్గురు తెలుగు వారు కాంది శీకులుగా తొలిసారిగా మారిషస్‌లో అడుగు పెట్టారు. ఆ మరుసటి సంవత్సరం గౌంజన్ అనే ఓడలో దాదాపు 30 మంది తెలుగు వారు ఆ ద్వీపంలో కాలు పెట్టారు. కాకినాడ సమీపాన వున్న 'కోరంగి' రేవు నుండి బయలు దేరి వచ్చినందుకు వాళ్లని "కోరంగి వాళ్ళు" అని, వారు మాట్లాడే తెలుగు భాషకు 'కోరంగి భాష' అని పిలిచేవారు. 1843 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసు వలస వచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికెట్ మొదలైనవి. 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పని చేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగు వారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృ భాషకు బ్రహ్మో త్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లిన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు "పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం" వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహద పడుతు న్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి.

మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపు కోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహా సభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ "తెలుగు మహా సభ"గా ఆవిర్భవించింది. దాన్ని వారు తెలుగు భాషామ తల్లి ఆలయంగా భావిస్తున్నారు.. ప్రస్తుతం మారిషస్ దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరం వారు సైతం, తమ పెద్దలు వేసిన బాటలో నడుస్తుం డటం ఇక్కడి తెలుగు వారికి స్ఫూర్తిదాయక అంశం. మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు 1లక్షమందికి పైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా, 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతులలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసి స్తున్నారు. మాధ్యమిక, ఉన్నత విద్య లో తెలుగు ద్వితీయ భాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం పని చేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉప సంఘాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గరగా ఉండే "క్రియోల్" వారి మాతృభాష అయినా, స్వ భాషాభిమానంతో, తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగును బతికిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి నరసింహ శతకం, వేమన శతక పద్యాలకు వారు పెద్దపీట వేయడం, క్షేత్రయ్య అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు, నరసింహ శతకం, నేర్చు కోవడంతో పాటు తెలుగు సంప్రదాయాలనూ పూర్తిస్థాయిలో పాటించడం విశేషం. ఇటీవల అక్కడి విద్యార్థులే ఓ కథా సంకలనం వెలువరించడం వారికి తెలుగు గల అభిమానానికి, ప్రేమకు తార్కాణం. మారిషస్‌లో ఓ ఆరాధ్య భావంతో తెలుగుకు బ్రహ్మోత్సవాలు 2018లో ఆగస్టు 20నుండి నిర్వహించి, అందులో భాగంగా, పద్య పఠన పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు ఒక్కోరోజు ఒక్కో తెలుగు సాంప్రదాయంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సదస్సులను నిర్వహించారు. మారిషస్ దీవిలో తెలుగు భాషోన్న తికి సర్వస్వాన్ని ఫణంగా పెట్టి "సంజీవ నరసింహ అప్పడు" పని చేస్తున్నారు. ఆయన ఆ దేశ తెలుగు పరీక్షల విద్యాధికారి, రేడియో వ్యాఖ్యాత, జర్నలిస్ట్. మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ తెలుగు విభాగ అధికారి. తెలుగు ప్రాంతాలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ అక్కడి తెలుగు వికాసానికి కృషి చేస్తున్నారు. తెలుగు తనాన్ని నిలుపు కొనేందుకు మారిషస్ తెలుగు మహాసభ, అక్కడి ప్రభుత్వం గట్టి సంకల్పంతో పని చేస్తున్నాయి. తెలుగు మహాసభ దేశ రాజధాని పోర్టు లూయిస్ లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడు ప్రాంతీయ కమిటీలు, 90 శాఖలు క్రియా శీలకంగా పని చేస్తున్నాయి అంటే, ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితో పాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం. తెలుగు వారి సంస్కృతి ప్రతీకలైన పండగలు, పబ్బాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం తెలుగువారిచే నిర్మితాలైన 350 దేవాలయాలూ తెలుగు భాషా వికాసానికి కేంద్రాలుగా ఉన్నాయి.

# భాషా సంస్కృతులను రక్షించుకుందాం

ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయరానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగుతుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమాదంలోపడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్ కు వెళ్ళిన వ్యవ సాయ కూలీలు 185 సంవత్స రాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగు వాళ్లు ఉండగా... తమ వారసులకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారిక కతను సాధించి పెట్టేందుకు కృత నిశ్చయంతో, తెలుగు భాషా మాధ్య మంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలు ఉన్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ చానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి చానెల్ మారిషస్‌లో వస్తుంది.ప్రాథమిక స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్శిటీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులు ఉన్నాయి. అంతే కాకుండా, మారిషస్ తెలుగు మహా సభ, తెలుగు సాంస్కృతిక కళా నిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావి తరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈ క్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్‌వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. ఆస్ట్రేలియా "తెలుగు సమాఖ్య, తెలుగుమల్లి, భువనవిజయం" వంటి సాంస్కృతిక సంస్థలు,16 ఏళ్లు కృషి చేసి విజయం సాధించాయి.అమెరికాలో మన తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూ ఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది, ఇది గత ఏడు సంవత్సరాలలో 86% పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3 న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా 'మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 2020 నవంబర్ 1 ఆదివారం రోజున 12 గంటలపాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించ బడింది. అంతేకాదు...మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' కార్యక్రమానికి.. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగి పోని సంఘటన. ఇదివరలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరితో కలిసి ఒక ఫెస్టివల్ జరపాలనే ఆలోచనతో సౌందర్య లహరి పేరిట అమెరికా జయహో భారతీయం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి నిశ్చయించి, తానా సంస్థ మహిళా కోఆర్డినేటర్ తూనుగుంట్ల శిరీష, జిజ్ఞాస అధినేత భార్గవ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు డాక్టర్ డి విజయభాస్కర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు లతో సంప్రదించి సౌందర్యలహరి కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంగా మార్చి ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాల నుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటి పైకి వచ్చాయి. తెలుగు చరిత్ర లో కనీవినీ ఎరుగని రికార్డ్ అది. జయహో భారతీయం– భారతదేశం, జిజ్ఞాస ? భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగుఅసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్ ? కువైట్, తెలుగు కళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగు సమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగు కల్చరల్ సొసైటీ నార్త్రెన్-ఐర్లాండ్, తెలుగు కళా సమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ ? న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాడ్మింటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి ? న్యూజి ల్యాండ్, తెలుగు కళా సమితి ? ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖతర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతో పాటు ఆయా ఆయా దేశాలలో వివిధ రాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు

లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9 కోట్ల మంది (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఎక్కువగా) తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించా ల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# గూగుల్.. అడ్డంకులు ల్లేవ్

**విజయవాడ ఫిబ్రవరి 20 పెన్ పవర్:**
విశాఖపట్నంలో గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఒప్పందం చేసుకున్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించిన భూసేకరణ సమస్యలు ఎదురయ్యాయి.. కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో ఇబ్బందులు వచ్చాయి. అయితే ప్రభుత్వం రైతులకు పరిహారం పెంచడంతో భూసేకరణ వేగవంతం అయ్యింది. తాజాగా మిగిలిన ఒక్క రైతు కూడా భూసేకరణకు అంగీకారపత్రం ఇచ్చారు.విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయ్యింది. భూసేకరణ సమస్యలన్ని కొలిక్కి వచ్చాయి.. అవాంతరాలన్నీ దాటుకుని శంకుస్థాపనకు సిద్ధమవుతున్నారు. భూసేకరణకు ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు రైతుల్ని ఒప్పించి పరిహారం కూడా జమ చేశారు. ఈ భూసేకరణ ప్రక్రియలో మిగిలిన ఒక్క రైతు కూడా భూమిని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో గూగుల్ డేటా సెంటర్‌కు అడ్డంకులు తొలగిపోయాయి.. అన్నీ కుదిరితే వచ్చే నెలలోనే శంకుస్థాపన చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించి భూసేకరణకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తర్లువాడ రైతుల పేరుతో భూసేకరణపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత ఊహించని విధంగా కొందరు రైతులు తమ సంతకాలను ఫోర్జరీ చేసి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై ఆర్డీవో విచారణ కూడా జరిపారు. కొంతమంది రైతుల్ని ప్రలోభాలకు గురిచేసినట్లు తేలిందని వార్తలొచ్చాయి. తమకు భూములు ఇస్తే లక్షల్లో ఇస్తామని.. ప్లాట్ డెవలప్‌చేసి ఇస్తామని నమ్మించినట్లు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు ఓకే చెబితే చాలు.. చెప్పిన దాంట్లో 50శాతం బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు.ఆ వెంటనే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. రైతుల సమస్యలు, భూసేకరణ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పరిహారాన్ని




పెంచారు.. గతంలో రూ.17 లక్షలుగా ఉన్న పరిహారాన్ని.. రూ.40 లక్షలకు పెంచారు. అంతేకాదు 20 సెంట్ల భూమిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాదు రికార్డుల్లో లేని శివాయ్ జమేదార్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ రైతులకు పరిహారాన్ని ఎకరాకు రూ.10 లక్షలకు పెంచారు. ఇటు ఇంటికో ఉద్యోగం, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు ఇలా హామీలు ఇచ్చారు. 520 మంది రైతులకు బంజరు భూముల అభివృద్ధి పథకం కింద 3సెంట్ల నివాస స్థలాలు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం పరిహారం పెంచడంతో పాటుగా మరికొన్ని వరాలు ప్రకటించడంతో రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు.ఈ భూసేకరణ ప్రక్రియలో ఒకే ఒక్క రైతు మిగిలారు. గణేష్ అనే రైతు మొన్నటి వరకు భూమిని ఇచ్చేందుకు నిరాకరించారు. ఆయన కూడా చివరికి భూమిని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రెండు రోజుల క్రితం కలిసి తన అసైన్డ్ భూమి రూ.1.94 ఎకరాలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ అధికారుల్ని కలిసి భూమిని ఇచ్చేందుకు అంగీకార పత్రాలను సమర్పించారు. దీంతో భూసేకరణకు లైన్ క్లియర్ అయ్యింది. మరోవైపు విశాఖపట్నంలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌కు అదనపు భూముల్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అదనపు భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రైడెన్‌కు 480 ఎకరాలు కేటాయించేందుకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు దానిని 601.40 ఎకరాలకు పెంచారు. రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెయ్యి మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే.

# వేకెంట్ ల్యాండ్ పన్నులో 50 శాతం తగ్గింపు

**విజయవాడ ఫిబ్రవరి 20, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం ప్రజలకు, రియల్ ఎస్టేట్ రంగానికి ప్రోత్సహం ఇచ్చేలా వీఎల్‌టీపై ప్రభుత్వం తీపికబురు చెప్పింది. అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం తెలిపారు. నిర్మాణలకు సంబంధించి ఖాళీ స్థలాలపై విధించే పన్నులో 50శాతం రాయితీ ఇస్తారు. గతంలో నిర్మాణాలకు సంబంధించి ఖాళీ స్థలాలపై వంద శాతం పన్ను విధించేవారు. ఇకపై అనుమతులు పొందిన నాటి నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకూ 50శాతం పన్ను చెల్లిస్తే చాలు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలు, బిల్డర్లకు తీపికబురు చెప్పింది. భవన నిర్మాణ సమయంలో వీఎల్‌టీ (భవన నిర్మాణ సమయంలో వసూలు చేస్తున్న ఖాళీ స్థలం పన్ను 50%కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రవేశ పెట్టిన సవరణ బిల్లును ఆమోదించారు. ఈ నిర్ణయంతో ప్రజలు, బిల్డర్లకు ఏటా రూ.30 కోట్ల వరకు లబ్ధి చేకూరుతుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజలకు భారం కాకూడదని.. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నష్టమైనా.. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ వీఎల్‌టీని 50శాతానికి తగ్గింపు అనుమతులు తీసుకున్న తేదీ నుంచి వర్తిస్తుంది. వీఎల్‌టీని 50శాతానికి తగ్గించాలని ప్రజలు, బిల్డర్ల నుంచి రిక్వెస్ట్‌లు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వీఎల్‌టీని 50శాతం తగ్గించాలని 2014-2019 టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది.. 2019 ఫిబ్రవరి 24న 50శాతం పన్నును జీవోను కూడా విడుదల చేసింది. కానీ జీవో అమలుకు ఇబ్బందులు రావడంతో గత ప్రభుత్వం పక్కన పెట్టేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు చట్ట సవరణ చేసింది.. త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేయనున్నారు.ఏపీ ప్రభుత్వం వీఎల్‌టీని 50శాతానికి తగ్గించడంతో ప్రజలు, బిల్డర్లకు ప్రతి ఏటా రూ.30కోట్లు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే మున్సిపల్‌శాఖకు ప్రతి ఏటా రూ.60 కోట్లు ఆదాయం వస్తుంది అంటున్నారు. భవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్న రోజు నుంచి నిర్మాణం పూర్తి చేసేలోపు వీఎల్‌టీ వసూళ్లు ఇలా ఉన్నాయి. స్థలం విలువపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విలువ ఆధారంగా కార్పొరేషన్లలో 0.5శాతం, మున్సిపాలిటీల్లో 0.2శాతం చొప్పున వీఎల్‌టీ వసూలు చేస్తున్నారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని 50శాతానికి తగ్గించారు. అలాగే భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్న తర్వాత నిర్ణీత గడువులోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు అంతస్తులైతే మూడేళ్లలో, ఐదు కంటే ఎక్కువ అంతస్తులైతే ఆరేళ్లలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ భవనాలకు మాత్రమే వీఎల్‌టీ తగ్గింపు వర్తిస్తుంది. వీఎల్‌టీ తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎమ్మెల్యేలు
స్వాగతించారు. ప్రజలకు, బిల్డర్లకు ఎంతో లబ్ధి జరుగుతుందంటున్నారు.ప్రస్తుతం వీఎల్‌టీ (భవన నిర్మాణ సమయంలో వసూలు చేస్తున్న ఖాళీ స్థలం పన్ను) 100శాతం వసూలు చేస్తున్నారు.. ఇకపై 50శాతం మాత్రమే వసూలు చేస్తారు. ఈ నిర్ణయంతో ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మేలు జరుగుతుంది. అయితే నిర్మాణం పేరు చెప్పి కొందరు సుదీర్ఘకాలం రాయితీ పొందాలనుకునే ప్రమాద ఉంటుంది.. అలాంటి వారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందంటున్నారు. నిర్మాణాలకు కాలపరిమితి ఉండాలంటున్నారు. ఒకవేళ ఎవరైనా నిర్మాణం మధ్యలో నిలిపివేస్తే రాయితీ రికవరీ చేయాల్సిన అవసరం ఉందుంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలు అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు చేపట్టాలి అన్నారు.

# ఏపీలో మరో కొత్త రైల్వే స్టేషన్ రెడీ



**ఒంగోలు, ఫిబ్రవరి 20, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో భాగంగా కనిగిరి కొత్త రైల్వే స్టేషన్ సిద్ధమైంది. పదేళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు కూటమి ప్రభుత్వ చొరవతో ఊపందుకుంది. అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధమైన ఈ స్టేషన్‌కు ట్రయల్ రన్ జరగనుంది. ఈ నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్ పూర్తయితే ప్రయాణ సౌకర్యం మెరుగుపడి, హైదరాబాద్-తిరుపతి మధ్య ప్రయాణ సమయం తగ్గుతుంది. పదేళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం చొరవతో ఊపందుకున్నాయి. ప్రకాశం జిల్లాలో పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఆ సమస్యలను పరిష్కరించారు. కొత్తూరు దగ్గర రైల్వే స్టేషన్ నిర్మాణం కూడా పూర్తయింది. దీంతో కనిగిరి ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. ఈ రైల్వే లైన్ పూర్తయితే ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుంది. ఈ రైల్వే లైన్ నిర్మాణం చాలా వేగంగా ముందుకు సాగుతోంది. అత్యాధునిక సౌకర్యాలతో కనిగిరి వరకు పనులు దాదాపుగా సిద్ధమయ్యాయి. గత పదేళ్లుగా ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనికి ప్రాధాన్యత ఇచ్చి పనులు వేగవంతం చేసింది.కనిగిరి రైల్వే స్టేషన్ ఆధునిక సౌకర్యాలతో సిద్ధమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణికులు సులభంగా స్టేషన్‌కు చేరుకునేలా ప్రత్యేకంగా సీసీ రోడ్డును నిర్మించారు. స్టేషన్ చుట్టూ విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియాను అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల ప్రయాణికులు ఎంతో సౌకర్యవంతంగా రాకపోకలు సాగించవచ్చు. కనిగిరి, పామూరు మండలాల మధ్య 50 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు చాలా వేగంగా పూర్తి చేశారు రైల్వే అధికారులు. దీంతో నడికుడి నుంచి కనిగిరి ప్రాంతం వరకు రైలు ఇంజిన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో మూడు దశాబ్దాలుగా కనిగిరి ప్రజలు ఎదురు చూస్తున్న కల త్వరలో నెరవేరనుంది. కనిగిరి మండలంలోని యడవల్లి, పోలవరం, కలగట్ల దగ్గర రైల్వే స్టేషన్లు, సిబ్బంది క్వార్టర్ల పనులు కూడా పూర్తయ్యాయి. వాస్తవానికి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఐదేళ్ల క్రితమే రైలు కూత వినిపించాల్సి ఉన్నా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వలేదు.. ఇతర సమస్యలను పరిష్కరించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి.స్టేషన్‌లో హైలెవల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. ప్రయాణికుల భద్రత కోసం కాప్ సబ్‌టైప్ షెల్టర్లు నిర్మించారు. అవసరమైన చోట్ల నీటి కుళాయిలను కూడా ఏర్పాటు చేశారు. ప్రయాణికులు సేదతీరేందుకు విశ్రాంతి గది, టికెట్లు బుక్ చేసుకోవడానికి బుకింగ్ కౌంటర్ సిద్ధంగా ఉన్నాయి. స్టేషన్ ముందు భాగంలో పోర్టికో, అందమైన ల్యాండ్‌స్కేపింగ్ కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కనిగిరి రైల్వే స్టేషన్‌కు ట్రయల్ రన్‌గా రైలు రానుందని రైల్వే శాఖ డిప్యూటీ సీఈ తెలిపారు.గత నెలలో కూడా గూడ్స్ రైలు కనిగిరి ప్రాంతానికి వచ్చింది. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన సామాగ్రిని తీసుకొని వచ్చింది. ఈ రైలు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ నుంచి బయలుదేరింది. ఇందులో రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ఉంది. ఈ సామాగ్రిని కనిగిరి స్టేషన్‌లో దించారు. అక్కడి నుంచి నిర్మాణ స్థలాలకు తరలించారు. ఈ రైలు రాకతో స్థానికుల్లో ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైలును చూసి వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రైల్వే లైన్ నిర్మాణంఈ ప్రాంత అభివృద్ధికి కీలక ముందడుగు. ఈ లైన్ పూర్తయితే, ప్రయాణికులకు, సరుకు రవాణాకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కనిగిరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ఇది ఎంతో ప్రయోజనకరంగా మారుతుంది.నడికుడి - శ్రీకాళహస్తి మధ్య కొత్త రైల్వే లైన్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే దర్శి, పొదిలి రైల్వే స్టేషన్‌లు సిద్ధం అయ్యాయి.. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు కూడా పూర్తి చేసి ట్రయల్ రన్‌కు సిద్ధమయ్యారు. నడికుడి నుంచి ప్రకాశం జిల్లా వరకు దాదాపు 80 నుంచి 90శాతం వరకు పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత నెల్లూరు జిల్లాలో పనులు చేపట్టనున్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లేవారికి సౌకర్యంగా ఉంటుంది. అంతేకాదు ప్రయాణ సమయం, దూరం కూడా తగ్గుతుంది అంటున్నారు

# తమ్ముళ్ల ధిక్కార స్వరం

**ఏలూరు, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** ఏపీలో టీడీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి. గతంలో కాంగ్రెస్, వైసీపీ గాలిలోనూ గెలిచిన సీట్లు ఉన్నాయి. అలాంటి నియోజకవర్గాల్లో ఉండి కూడా ఒకటి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి నియోకవర్గంలో టీడీపీ వరుస విజయాలు దక్కించుకోవడమే కాదు. 2004లో తప్ప..ఎప్పుడూ అక్కడ పార్టీ ఓడింది లేదు. క్షత్రియులకు బలమైన సెగ్మెంట్‌గా ఉన్న ఈ నియోజకవర్గంలో ఎప్పుడూ సైకిల్‌దే హవా. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ పాగా వేసేందుకు వైసీపీ చేయని ప్రయత్నాలు లేవు. గత ఎన్నికల్లో అభ్యర్థిని మార్చి లాస్ట్ మూమెంట్‌లో వైసీపీ నుంచి వచ్చిన రఘురామ కృష్ణరాజుకు టీడీపీ సీటు ఇచ్చినా..ప్రజలు సైకిల్ పార్టీకే పట్టం కట్టారు.నియోజకవర్గంలో టీడీపీ నేతల ధిక్కార స్వరం చర్చనీయాంశంగా మారింది. ఏకంగా రఘురామ కృష్ణరాజు తీరుపై విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. ఎమ్మెల్యే కమ్..ఉప సభాపతిగా ఉన్న రఘురామ కృష్ణరాజు వైఖరిని తప్పుబడుతూ..ఒకరిద్దరు టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఆయన ఒంటెత్తు పోకడలకు పోతున్నారని..రఘురామ తీరుతో పార్టీలో ఐక్యత దెబ్బతింటోందని కొందరు లీడర్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తూ చర్చకు దారితీశారు. రఘురామ ముందు నుంచి టీడీపీలో పనిచేసిన నేత కాకపోవడంతో ఇక్కడ తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి రాగం ఎత్తుకున్నట్లు చర్చ జరుగుతోంది. వాస్తవానికి గతంలో ఎప్పుడూ టీడీపీలో పని చేయలేదు రఘురామ కృష్ణరాజు. బిజినెస్‌మెన్‌గా వెరీ పాపులర్. ఆ తర్వాత వైసీపీలో, బీజేపీలో తిరిగి వైసీపీలో పనిచేసి 2019లో ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత కొన్నాళ్లకే వైసీపీ అధిష్టానంతో గిట్టక అసంతృప్తి రాగం వినిపిస్తూ వచ్చారు. జగన్ సర్కార్ హయాంలో ఆయన కేసులు కూడా ఫేస్ చేశారు. ఆ తర్వాత టీడీపీకి దగ్గరవుతూ వచ్చారు. ఫైనల్‌గా 2024కు ముందు రఘురామ కృష్ణరాజు టీడీపీలో చేరారు. నరసాపురం ఎంపీ టిక్కెట్ ఆశించినా కూటమి పొత్తులో అది బీజేపీకి ఇచ్చారు. దీంతో ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని..టీడీపీ రఘురామ కృష్ణరాజుకు టికెట్ ఇచ్చింది.అయితే వైసీపీ నుంచి వచ్చిన రఘురామ కృష్ణ తన అనుచరులను..గతంలో వైసీపీలో పనిచేసిన నేతలను ప్రోత్సహిస్తూ వారికే పదవులు కట్టబెడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెడుతూ, పార్టీ కమిటీల్లోనూ ఇతర పార్టీల నేతలకు అవకాశాలు ఇస్తున్నారని..సీనియర్ నేతలను పట్టించుకోవడం లేదని..టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు అలిగేషన్స్ చేస్తున్నారు. రఘురామను వ్యతిరేకిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తన కొడుకు రాజకీయ అరంగేట్రం కోసం రఘురామ కృష్ణరాజు ఇప్పటినుంచే తన వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని కూడా చెప్తున్నారు. దీంతో ఉండి టీడీపీలో పరిణామాలపై అధిష్టానం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.అయితే ఏ పార్టీలో అయినా ఏ నియోజకవర్గంలో అయినా కొత్త, పాత లొల్లి కామన్. పార్టీ అన్నాక సమస్యలు..పదవుల దగ్గర పేచీ కూడా ఉండనే ఉంటుంది. సీనియర్ లీడర్ల అసంతృప్తి కూడా ఉండనే ఉంటుంది. వాటిన్నింటిని సామరస్యంగా పరిష్కరించుకుంటే నో ప్రాబ్లమ్. పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను సాల్వ్ చేసుకోవచ్చు. కానీ కొందరు నేతలు..బహిరంగ విమర్శలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇలా తెలుగు తమ్ముళ్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తే ప్రత్యర్థులకు అస్త్రాలు అందించినట్లు అవుతుందని అంటున్నారు. అటు ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామ కృష్ణరాజుకు సొంత నియోజకవర్గంలో లీడర్ల నుంచి అసంతృప్తి సెగ తగలడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో ప్రముఖ నేతగా ఉన్న ఆయనపై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగరవేయడం కలకలం రేపుతోంది. రఘురామ తీరుతో టీడీపీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నాయకులు ఆగమైపోతున్నారని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కలగజేసుకోవాలని కోరుతున్నారు స్థానిక నేతలు.అయితే ఉండి నియోజకవర్గంలో ఎప్పుడూ లేనట్లుగా విభేదాలు రచ్చకెక్కడం..తొలిసారి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామపై ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. అసలు ఈ పరిస్థితికి కారణమేంటి? రఘురామ ఒంటెద్దు పోకడలకు పోతున్నారా? లేక ఎన్నికలకు ముందు టీడీపీలోకి వచ్చిన రఘురామకు టీడీపీ క్యాడర్, లీడర్లతో సరైన సంబంధాలు లేవా? లేక టీడీపీ నేతలకే రఘురామ అంటే గిట్టట్లేదా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఉండి నియోజకవర్గంలో పరిస్థితులపై పార్టీ హైకమాండ్ కూడా ఆరా తీసిందన్న వార్తలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో ఎంపీగా ఉంటూ నిత్యం అసమ్మతి రాగం వినిపించిన రఘురామ ఇప్పుడు అదే పరిస్థితిని ఫేస్ చేస్తుండటం ఇంకా ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# ఉగాది నాటికి డీఎస్సీ

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 20, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే క్షేత్ర స్థాయి నుంచి ఖాళీల వివరాలను సేకరించింది. మొత్తం 3,600 వరకు పోస్టులు ఉండొచ్చని తెలుస్తోంది. దీంతో ఈ పోస్టులకు మార్చిలో అంటే ఉగాది పండుగ సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుందని ప్రభుత్వ వర్గాల సమాచారం.ప్రతీయేటా డీఎస్సీ నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు ఈ ఏడాది కూడా డీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. గతేడాది ఏప్రిల్ నెలలో మొత్తం 16,347 పోస్టులకు డీఎస్సీ ప్రకటించగా.. వీటిలో 15,941 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. కొన్ని పోస్టులకు రిజర్వేషన్ల అభ్యర్థులు లేకపోవడంతో నిలిచిపోయాయి.అయితే, ఈ ఏడాదికి సంబంధించిన డీఎస్సీని వచ్చే నెలలోనే ఉగాది పండుగ సందర్భంగా ప్రకటించాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంది. ఈ ఏడాది డీఎస్సీకి కూడా గత ఏడాది డీఎస్సీ మాదిరిగానే సిలబస్, మార్గదర్శకాలనే అమలు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే వెబ్‌సైట్‌లో ప్రత్యేక డీఎస్సీ సిలబస్‌ను అధికారులు అందుబాటులో ఉంచారు.ఈ ఏడాది నిర్వహించే డీఎస్సీలో భాగంగా పోస్టుల భర్తీ నిమిత్తం.. రాష్ట్ర సంక్షేమ శాఖలకు సంబంధించిన స్కూల్స్, ఆదర్శ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ల నుంచి అధికారులు సమాచారం తీసుకున్నారు. వీటిల్లో 1200 ఖాళీలు ఉంటాయని, వీటితోపాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాలల్లో 1,700 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 700 వరకు ఉంటాయని చెబుతున్నారు. ఇవన్నీ కలిపి మొత్తం 3,600 వరకు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న టీచర్లకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వీరికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని నిర్ణయించింది.

## మారేది లేదంటున్న కొలికపూడి

**విజయవాడ, ఫిబ్రవరి 20, పెన్ పవర్:**
కొలికపూడి తరచూ కాంట్రవర్సీకి కేరాఫ్ అవుతూ..పార్టీకి, క్యాడర్‌కు తలనొప్పిగా మారారన్న చర్చ జరుగుతోంది. వివాదాలే ఆయనను వెతుక్కుంటూ వస్తున్నాయో లేక ఆయనే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో తెలియదు కానీ..ఎమ్మెల్యే కొలికపూడి తీరు ఎప్పుడూ హాట్ టాపిక్ ఉంటోంది. పార్టీ తరఫున బలమైన వాయిస్ వినిపించి..అధికారంలోకి వచ్చాక ఆయనే సమస్యగా మారారన్న టాక్ వినిపిస్తోంది. అధికార పార్టీలో ఉండి..స్వపక్షంలో విపక్షంలా సొంత ఎజెండాతో, తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఎప్పుడూ ఏదో ఒక వివాదానికి తెరలేపుతూ తాను చిక్కుల్లో పడటమే కాదు..పార్టీని కూడా ఇరకాటంలో పడేస్తున్నారు.ఎంపీ కేశినేని చిన్నితో వివాదం..వాట్సప్ స్టేటస్‌లతో రచ్చరచ్చ చేశారు. టీడీపీ పెద్దలు పలుసార్లు ఆయనను పిలిచి మాట్లాడారు. అధిష్టానం సీరియస్ కావడంతో అప్పుడప్పుడు సైలెంట్ అవుతున్నారు. తనకేం తెలియదు..ఏ కాంట్రవర్సీతో ఏ సంబంధం లేదన్నట్లుగా బిహేవ్ చేస్తున్నారు. సడెన్‌గా మళ్లీ ఏదో ఒక వాట్సప్ పోస్ట్, స్టేటస్‌తో వార్తల్లో నిలుస్తున్నారు కొలికపూడి.పరోక్షంగా ప్రభుత్వ పనితీరును విమర్శిస్తున్నట్లు వాట్సప్ స్టేటస్ పెట్టిన ఎమ్మెల్యే కొలికపూడి అధిష్టానం నుంచి చీవాట్లు తిన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు పల్లె కన్నీరు పెడుతోంది అంటూ కొలికపూడి పెట్టిన పోస్టు కలకలం రేపింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి ప్రభుత్వ పాలనను విమర్శించేలా పోస్టులు పెట్టి అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు ఎమ్మెల్యే.అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజు కొలికపూడిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో మందలించినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయమై సీఎం సీరియస్‌గా ఉన్నారని, ఇకపైనా ఇలాగే వ్యవహరిస్తే ఎమ్మెల్యేగా గుర్తించడం కూడా మానేస్తామంటూ తేల్చి చెప్పారంటూ ప్రచారం జరిగింది. ఇది జరిగిన రెండు రోజులుకు మంత్రి నారా లోకేశ్ శాసనసభ్యులకు ఇచ్చిన విందులో కొలికపూడి కనిపించారు. దీంతో అధిష్టానంతో ఆయనకు సఖ్యత కుదిరిందనే అభిప్రాయం వ్యక్తమైంది.లేటెస్ట్‌గా కొలికపూడి పెట్టిన పోస్టు మరోసారి చర్చకు దారితీసింది. ఎప్పుడూ విలక్షణంగా పనిచేసే క్రమంలో వివాదాల్లో చిక్కుకుంటున్న ఎమ్మెల్యే కొలికపూడి ఈ సారి అత్యంత జాగ్రత్తగా వాట్సప్ పోస్టు రాశారు. అయితే ఆయన తన వాట్సప్ పోస్టులో వైసీపీ పార్టీ పేరు ప్రస్తావించడం తీవ్ర చర్చకు దారితీసింది.సీఎం చంద్రబాబు డైరెక్షన్స్ ప్రకారం బడ్జెట్‌పై సలహాలు సూచనల కోసం నియోజకవర్గంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పెట్టాలని భావించిన ఎమ్మెల్యే..ఆ సమావేశానికి వైసీపీతో పాటు ఇతర పార్టీలను ఆహ్వానించారు. మిగతా కూటమి ఎమ్మెల్యేలకు భిన్నంగా కొలికపూడి వ్యవహరించడం చర్చనీయాంశం అయింది. ఈ విషయంపై పార్టీ అధిష్టానం నిలదీస్తే, తనకు రాజకీయంగా అనుభవం లేదని, ఎలా నడుచుకోవాలో మార్గనిర్దేశం చేయాలని సీనియర్లు తనకు సహకరించాలని కొలికపూడి కోరినట్లు వార్తలు వచ్చాయి.అయితే కొలికపూడి సహజ శైలినే ఆయనను కాంట్రవర్సీల్లోకి లాగుతుందన్న చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ దక్కదేమోనన్న అసంతృప్తి ఒకటి అయితే..తన ఎజెండా ప్రకారం పనిచేసుకుంటూ పోవడమే కొలికపూడిని కాంట్రవర్సీల్లో పడేస్తుందని అంటున్నారు. గతంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం శిక్షణ, మార్గ దర్శకత్వం అందించిన ఆయన..ఆ తర్వాత ప్రజా ఉద్యమాల్లో పనిచేశారు. అమరావతి రైతుల పక్షాన గళమెత్తి నిత్యం టీవీ డిబేట్లలో కూర్చొని పాపులర్ అయిపోయారు.కానీ ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఉన్న పాపులారిటీ పోయేలా బిహేవ్ చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..పైగా ప్రజా ఉద్యమాల్లో ఉన్నప్పుడు సమస్యలపై ఎలా గళమెత్తినా నడుస్తుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## అమెరికా ఎన్నికల్లో కొత్త రూల్స్..!

అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల నిబంధనలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఓటు వేయాలంటే ఓటర్ ఐడీ కార్డుతో పాటు పౌరసత్వ రుజువును తప్పనిసరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కఠినమైన నిబంధనలు అవసరమని స్పష్టం చేశారు. జార్జియాలోని రోమ్ నగరంలో జరిగిన ఒక సభలో ట్రంప్ ప్రసంగించారు. డెమోక్రాట్లు కేవలం ఎన్నికల్లో మోసం చేసేందుకే ఓటర్ ఐడీని వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఓటర్ ఐడీని జాత్యహంకారంతో ముడిపెట్టడం సరికాదని, 95 శాతం మంది ప్రజలు ఈ నిబంధనను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, పోస్టల్ బ్యాలెట్ (మెయిల్-ఇన్ బ్యాలెట్) విధానంపైనా ట్రంప్ విమర్శలు గుప్పించారు. కేవలం సైనికులు, అనారోగ్యంతో ఉన్నవారు, విహారయాత్రలకు వెళ్లిన వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని, మిగిలిన వారంతా నేరుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని సూచించారు. అయితే, ఓటర్ ఐడీ నిబంధనపై అమెరికాలో భిన్న వాదనలు ఉన్నాయి. ప్యూ రీసెర్చ్ సెంటర్ ప్రకారం దాదాపు 80-85 శాతం మంది ఈ నిబంధనను సమర్థిస్తున్నారు. మరోవైపు, దేశంలోని సుమారు 11 శాతం మంది అర్హులైన పౌరుల వద్ద (సుమారు 2.1 కోట్లు) ప్రభుత్వ ఫోటో ఐడీలు లేవని పౌర హక్కుల సంఘాలు చెబుతున్నాయి. వీరిలో ఆఫ్రికన్ అమెరికన్లు, లాటిన్ అమెరికన్లు అధికంగా ఉండటంతో, ఈ నిబంధన వివక్షకు దారితీస్తుందని డెమోక్రాట్లు, పౌర హక్కుల సంఘాలు వాదిస్తున్నాయి. గత ఎన్నికల ఫలితాల వివాదంతో జార్జియా రాజకీయ కేంద్రంగా మారిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కరాచీలో గ్యాస్ లీకేజీతో పేలుడు



పాకిస్తాన్ కరాచిలో ఓ నివాస భవనంలో గురువారం ఉదయం గ్యాస్ లేకేజి కారణంగా పేలుడు సంభవించింది. ఈ పేలుడు వల్ల 16 మంది మృతి చెందారు. మృతుల్లో చాలామంది చిన్నారులున్నారు. 14 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారి జామ్‌షెడ్ అషెర్ మాట్లాడుతూ.. 'ఓల్డ్ సోల్జర్ బజార్ ప్రాంతంలో ఉన్న భవనంలోని మొదటి అంతస్తులో గురువారం ఉదయం 4.30 గంటల సమయంలో పేలుడు సంభవించింది. రంజాన్ మాసం కావటంతో.. తెల్లవారుజామున ముస్లింలు సహ్రీ (ఉపసవాసం సందర్భంగా తెల్లవారుజామున తీసుకునే ఆహారం) సందర్భంగా అందరూ మేల్కొని ఉన్నారు. ఈ సమయంలోనే ఈ పేలుడు సంభవించింది' అని ఆయన అన్నారు. కాగా, ఈ ఘటన గ్యాస్ లీకేజీ వల్లనే జరిగిందని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. కరాచీలో గ్యాస్ కొరత తీవ్రస్థాయిలో ఉంది. చాలామంది తక్కువ ఆదాయం వస్తున్న వారు. తమ ఇళ్లల్లో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ సిలిండర్‌లను ఉపయోగిస్తున్నారు. సంఘటనా స్థలం నుంచి 14 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని పోలీస్ సర్జన్ డాక్టర్ సమయా సయ్యద్ ధ్రువీకరించారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ పేలుడు కారణంగా భవన నిర్మాణంలో ఒక భాగం కూలిపోయింది. రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టి.. ఘటనలో స్థలంలో ఇంకెవరి మృతదేహాలున్నాయేమోనని వెతుకుతున్నట్లు చీఫ్ ఫైర్ ఆఫీసర్ హుమాయున్ ఖాన్ అన్నారు. మృతుల్లో రెండేండ్ల నుంచి 17 ఏండ్ల మధ్య వయసు గల తొమ్మిది మంది పిల్లలున్నారు. గాయపడిన వారిలో కూడా ఏడుగురు పిల్లలున్నారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కరాచిలో జరిగిన రెండవ అతిపెద్ద విషాదం ఇది. గత నెలలో సద్దార్ ప్రాంతంలోని హోల్‌సేల్ రిటైల్ మార్కెట్ అయిన గుల్ షాపింగ్ ప్లాజా బేస్‌మెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 79 మంది మృతి చెందారు. అనేక మంది గాయాలపాలయ్యారు.

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి జీవిత ఖైదు



దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు పడింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దేశంలో మార్షల్ లా విధించిన కేసులో తీర్పు వెలువడింది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పెట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు సైన్యం, పోలీసు బలగాలను సమీకరించినం దుకుగానూ తిరుగుబాటు కింద ఆయన్ను దోషిగా నిర్ధారించినట్టు న్యాయమూర్తి జీ కుయ్-యోన్ తెలిపారు. ప్రతిపక్షాలు దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు.'మార్షల్ లా' విషయంలో ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించాయని ఆరోపిస్తూ.. ఆయనకు మరణశిక్ష విధించాలని ప్రత్యేక ప్రాసిక్యూటర్ వాదించారు. చివరకు కోర్టు జీవిత ఖైదు విధించింది. 'మార్షల్ లా' అమలులో భాగమైన అనేక మంది మాజీ సైనిక, పోలీసు అధికారులకూ కోర్టు శిక్ష విధించింది. రక్షణశాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌కు 30 ఏండ్ల జైలు శిక్ష పడింది.అనేక కేసులు ఎదుర్కొంటున్న యూన్ సుక్ యోల్ గతేడాది జులై నుంచి జైల్లో ఉన్నారు. ఓ కేసులో గత నెలలో ఆయనకు ఐదేండ్ల శిక్ష పడింది. మరోవైపు.. జీవిత ఖైదు పడిన మొదటి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు ఆయనే కావడం గమనార్హం. ఈ తీర్పుపై ఆయన అప్పీల్ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## ఎంత కొట్టినా గృహహింస కాదు:
## తాలిబన్ సర్కారు నిర్ణయం

అఫ్ఘానిస్థాన్‌లో మహిళల పరిస్థితి మరీ దారుణంగా తయారు అవుతోంది. ముఖ్యంగా అక్కడి ప్రభుత్వమే వారిని తీవ్రంగా అణిచివేసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే విద్య, ఉపాధి వంటి ప్రాథమిక హక్కులను కోల్పోయిన అఫ్ఘాన్ మహిళలపై తాలిబన్లు మరో అమానవీయ చట్టాన్ని ప్రయోగించారు. ఇంట్లో మగవారు మహిళలను, పిల్లలను శారీరకంగా హింసించినా అది నేరం కాదంటూ కొత్త శిక్షాస్మృతిని తీసుకువచ్చారు. తాలిబన్ల సుప్రీం లీడర్ హిబుతుల్లా అఖుంద్జాదా ఈ కిరాతక నిబంధనలపై సంతకం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం.. ఇంట్లో పురుషులు మహిళలను లేదా పిల్లలను కొట్టినప్పుడు రక్తస్రావం కానంత వరకు లేదా ఎముకలు విరగనంత వరకు దానిని నేరంగా పరిగణించరు. అంటే భార్యను భర్త శారీరకంగా హింసించే హక్కును ఈ చట్టం కల్పిస్తోంది. ఒకవేళ భర్త క్రూరత్వానికి పాల్పడి ఎముకలు విరిగితే.. బాధితురాలు ఆ విషయాన్ని కోర్టులో నిరూపించగలిగితేనే సదరు పురుషుడికి జైలు శిక్ష విధిస్తారు. అది కూడా కేవలం 15 రోజులే కావడం గమనార్హం. అయితే న్యాయం కోసం కోర్టుకు వెళ్లడం కూడా బాధితురాలికి అగ్నిపరీక్షే. మహిళ కోర్టుకు వెళ్లాలంటే ఆమె వెంట తప్పనిసరిగా సంరక్షుడైన పురుషుడు ఉండాలి. పైగా న్యాయమూర్తికి గాయాలను చూపించేటప్పుడు కూడా ఆమె శరీరం పూర్తిగా కప్పి ఉంచాలనే వింత నిబంధనను విధించారు. మహిళల స్వేచ్ఛను పూర్తిగా హరించేలా మరికొన్ని నిబంధనలను ఈ కోడ్‌లో చేర్చారు. వివాహిత తన భర్త అనుమతి లేకుండా బంధువుల ఇంటికి వెళ్తే ఆమెకు మూడు నెలల జైలు శిక్ష విధిస్తారు. గతంలో అంటే 2009లో ఉన్న ప్రజాస్వామ్య ప్రభుత్వం మహిళలపై హింసను నిరోధించేందుకు తెచ్చిన చట్టాలను ఈ కొత్త పీనల్ కోడ్ పూర్తిగా రద్దు చేసింది. కొత్త శిక్షాస్మృతిలోని ఆర్టికల్ 9 ప్రకారం.. అఫ్గాన్ సమాజాన్ని తాలిబన్లు నాలుగు విభాగాలుగా వర్గీకరించారు. అందులో మొదటిది మత పెద్దలు (ఉల్మా), రెండోది ఉన్నత వర్గం (అష్రాఫ్), మూడోది మధ్య తరగతి, నాలుగోది దిగువ తరగతి.

# ఈ వారాంతమే ముహూర్తం
# ఇరాన్‌పై దాడులకు అమెరికా సైన్యం సిద్ధం



ప్రపంచం మరో భారీ యుద్ధానికి సాక్ష్యం కాబోతోందా? అనే ప్రశ్నకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్‌ల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యకు దాదాపు సిద్ధమయ్యారని.. ఈ వారాంతంలోనే దాడులు జరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా సంస్థలు సీఎన్ఎన్, సీబీఎస్ సంచలన కథనాలను వెలువరించాయి. ఇరాన్‌తో అణు ఒప్పందం కుదరని పక్షంలో యుద్ధమే మార్గమని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా తన సైనిక శక్తిని మధ్యప్రాచ్యంలో మునుపెన్నడూ లేనంతగా మోహరించింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన 13 యుద్ధనౌకలు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్' తో పాటు 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్' కూడా ఉన్నాయి. సాధారణంగా ఒకే ప్రాంతంలో రెండు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లను ఉంచడం చాలా అరుదు. కానీ ఇప్పుడవి రెండూ అక్కడ ఉండడంతో.. ఇది ఇరాన్‌పై భారీ స్థాయి దాడులకు అమెరికా సిద్ధమవుతోందనడానికి సంకేతంగా నిలుస్తోందని అంతా భావిస్తున్నారు. వీటికి తోడు ఎఫ్-22 రాప్టర్ స్టెల్త్ ఫైటర్ జెట్లు, ఎఫ్-15, ఎఫ్-16 యుద్ధ విమానాలు గగనతలంలో నిఘాను ముమ్మరం చేశాయి. అమెరికా ఇరాన్‌పై దాడులు చేయడానికి ఆరు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2018లో అణు ఒప్పందం నుంచి అమెరికా తప్పుకున్న తర్వాత కొత్త ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నా ఫలితం లభించడం లేదు. ఇరాన్ ప్రభుత్వం నిరసనకారులను పొట్టన బెట్టుకోవడాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈక్రమంలోనే అక్కడి ప్రజలకు "సహాయం అందుతుంది" అంటూ హామీ కూడా ఇచ్చారు. మరోవైపు ఇరాన్ అణు స్థావరాలపై దాడులు చేయాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కూడా అమెరికాపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం చమురు ధరలు తక్కువగా ఉండటం వల్ల యుద్ధం జరిగినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తక్కువగా ఉంటుందని అమెరికా అంచనా వేస్తోంది.

## డీఎంకేతో విజయ్‌కాంత్ పార్టీ పొత్తు
## సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై కమిటీ ఏర్పాటు



చెన్నై: మరి కొద్ది వారాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో రాజకీయాలు సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. తాజాగా, అధికార డీఎంకే కూటమిలోకి కొత్త పార్టీ వచ్చి చేరింది. కెప్టెన్ విజయ్‌కాంత్ పార్టీ దేశీయ ముర్పోక్కు ద్రావిడ కజగం (డీఎండీకే)... డీఎంకేతో జతకట్టింది. ఆ పార్టీ అధ్యక్షురాలు, దివంగత విజయ్ కాంత్ భార్య ప్రేమలత.. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను గురువారం కలుసుకున్నారు. చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాల్యమ్'కి తన సోదరుడు ఎల్కే సుధీష్‌తో కలిసి ప్రేమలత విజయ్‌కాంత్ వచ్చారు. సీఎం ఎంకే స్టాలిన్, ఉప-ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, సీనియర్ మంత్రి కేఎన్ నెహ్రూలు.. ప్రేమలతను సాదరంగా ఆహ్వానించారు. ఇన్నాళ్లు పొత్తులపై అడుగుతున్న ప్రశ్నలకు ఇదే తన సమాధానమని, తమ కూటమి ఖరారైందని మీడియాకు ప్రేమలత వెల్లడించారు. జిల్లా కార్యదర్శులు, క్యేడర్ అభిప్రాయాలకు అనుగుణంగానే డీఎంకే కూటమిలో చేరినట్టు ఆమె తెలిపారు. 'మా నాయకుడు కెప్టెన్ (విజయ్‌కాంత్) 2016లోనే డీఎంకేతో పొత్తుకు ప్రయత్నించారు.. కరుణానిధి సైతం ఇదే కోరుకున్నారు. కెప్టెన్ ఇప్పుడు మన మధ్య లేకపోయినా.. పదేళ్ల తర్వాత ఆయన కోరిక నెరవేరింది' అని డీఎండీకే జనరల్ సెక్రెటరీ అన్నారు. తొలిసారి డీఎండీకే, డీఎంకే పొత్తు పెట్టుకున్నాయని, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు దీనిని స్వాగతిస్తున్నారని ఆమె చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ కూటమి 200కిపైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. అయితే, తమ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీచేస్తుందనే ప్రశ్నకు మాత్రం ఆమె సమాధానం ఇవ్వలేదు. అలాగే, ఆమె రాజ్యసభకు వెళ్తారా? ఎన్నికల్లో పోటీచేస్తారా? అనేదానికి సమాధానం దాటవేశారు. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక కోసం కమిటీ వేసి చర్చిస్తామని, తుది నిర్ణయం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటిస్తారని ప్రేమలత చెప్పారు.

## మహిళ ఛాతిని తాకడం,
## దుస్తులను లాగడమూ అత్యాచార యత్నమే



న్యూఢిల్లీ: మహిళల దుస్తులను లాగడం, వక్షోజాలను తాకడం అత్యాచార యత్నమేనని సర్వోన్నతన న్యాయస్థానం తేల్చిచెప్పింది. గతంలో బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారయత్నం కేసులోఅలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన వివాదాస్పద తీర్పుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.బట్టలు లాగడం, వక్షోజాలను తాకడం అత్యాచారం కిందకు రాదంటూ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిని సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి విచారణ జరిపి.. నిందితులకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. నవంబరు 2021లో యూపీలోని కస్‌గంజ్‌కు చెందిన ఓ మహిళ, ఆమె 11 ఏళ్ల కుమార్తెతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి తల్లీకూతుళ్లు తిరిగొస్తుండగా మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తారసపడ్డారు. బైక్‌పై ఆ బాలికను ఇంటి దగ్గర దింపుతామని చెప్పడంతో ఆమె వారి వెంట పంపింది. కానీ, తోవలో ఆ చిన్నారిని అసభ్యంగా తాకుతూ ఓ కల్వర్టు కిందకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. ఆ బాలిక కేకలు వేసింది. ఆమె అరుపులు విని అటుగా వెళ్తున్నవారు అక్కడకు రావడంతో నిందితులు పరారయ్యారు. తర్వాత ఈ విషయమై బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదయ్యింది. అయితే, ఈ కేసులో మార్చి 17 2025 అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద తీర్పు ఇచ్చారు. మహిళ వక్షోజాలను తాకడం, వారి దుస్తులు లాగినంత మాత్రాన అత్యాచారంగా పరిగణించలేమంటూ నిందితులపై ఉన్న కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. దీనిపై దేశవ్యాప్తంగా దుమారం రేగడంతో సుప్రీంకోర్టు ఈ అంశంపై తీవ్రంగా స్పందించి, సుమోటాగా విచారణ చేపట్టింది. బుధవారం నాటి విచారణలోసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడి త్రిసభ్య ధర్మాసనం.. అలహాబాద్ హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది. ఇటువంటి తీర్పులతో సమాజానికి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయని గత విచారణలో విచారం వ్యక్తంచేసింది. ఆ తీర్పుపై స్టే విధించిన సుప్రీంకోర్టు.. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీచేసింది. ఈ క్రమంలోనే బుధవారం తీర్పు వెలువడింది. ఇటువంటి చర్యలు అత్యాచారం కిందకే వస్తాయని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై ఆరోపణ..
## బ్రిటన్ మాజీ ప్రిన్స్ ఆండ్రూ అరెస్ట్

జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూను యూకే పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో దుష్ప్రవర్తనకు పాల్పడ్డారనే అనుమానంతో ఆయన తాత్కాలిక నివాసమైన సాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లో అరెస్టు చేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. యూకే చట్టం ప్రకారం అరవైల్లో ఉన్న ఓ వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసిన ప్రకటన విడుదల చేసిన థేమ్స్ వ్యాలీ పోలీసులు.. మాజీ యువరాజు పేరును వెల్లడించలేదు. జాతీయ మార్గదర్శకాల ప్రకారం అరెస్ట్ చేసిన వ్యక్తి పేరు వెల్లడించడం లేదని స్పష్టం చేశారు. పలు పరిశీలన అనంతరం అదుపులోకి తీసుకుని, దర్యాప్తు ప్రారంభించామని పేర్కొనారు. లైంగిక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు 2010లో ఆండ్రూ వాణిజ్య సమాచారాన్ని పంపాడనే నివేదికలను అంచనా వేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. "సమగ్ర అంచనా తర్వాత ప్రభుత్వ కార్యాలయంలో దుష్ప్రవర్తన ఆరోపణలపై మేము ఇప్పుడు దర్యాప్తు ప్రారంభించాం' అని ఆ ప్రకటన పేర్కొంది. మా భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నప్పుడు దర్యాప్తు సమగ్రత, నిష్పాక్షికతను కాపాడుకోవడం చాలా ముఖ్యమని వివరించారు. ఆండ్రూ ఉండే సాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లోని వుడ్ ఫామ్‌కి గురువారం తెల్లవారుజామున ఆరు పోలీసు వాహనాలు, సాధారణ దుస్తులు ధరించిన ఎనిమిది మంది అధికారులు వెళ్లినట్టు రాయిటర్స్ నివేదించింది. ఆయన 66వ పుట్టిన రోజునే ఈ అరెస్ట్ జరగడం గమనార్హం. స్థానిక పోలీస్ అధికారి డాల్ బాబు మీడియాతో మాట్లాడుతూ... ఆండ్రూను అరెస్ట్ చేశామని, ఆయన డిజిటల్ పరికరాలను, ఫైల్స్‌ను, ఇతర ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారని చెప్పారు. ఆయనకు సంబంధించిన అన్ని చోట్లా సోదాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.


## గర్భిణీ స్త్రీ పై గొడ్డలితో దాడి ..

బెంగళూరు: కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలో జరిగిన వివాహ వేడుకలో గర్భిణీ స్త్రీపై ఆమె సోదరుడు గొడ్డలితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు గురువారం తెలిపారు. హంద్రాల గ్రామంలో బుధవారం జరిగిన సామూహిక వివాహ కార్యక్రమంలో మీనాక్షి అనే మహిళ తన భర్త ఉదయ్ కుమార్‌తో కలిసి తన సోదరుడి వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లిందని పోలీసులను ఉటంకిస్తూ మీడియా సంస్థ నివేదించింది. కులాంతర సంఘాన్ని వ్యతిరేకిస్తున్న ఆమె కుటుంబం నుండి వ్యతిరేకత ఉన్నప్పటికీ మీనాక్షి ఏడాది క్రితం కుమార్‌ను వివాహం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివాహం తర్వాత, ఆ జంట బెంగళూరుకు వెళ్లారు, ఆ తర్వాత ఆమె కుటుంబం ఆమెతో అన్ని సంబంధాలను తెంచుకున్నట్లు సమాచారం.మీనాక్షి సోదరుడు మంజునాథ్ (35) వివాహ వేదిక వద్ద ఉన్నారని తెలుసుకున్నప్పుడు గొడవ చెలరేగిందని పోలీసులు తెలిపారు. అతను గొడ్డలితో అక్కడికి చేరుకుని ఇతర అతిథుల సమక్షంలో ఆమెపై దాడి చేశాడని ఆరోపించారు. నాలుగు నెలల గర్భవతి అయిన మీనాక్షికి గాయాలయ్యాయి, ఆ తర్వాత వేదిక వద్ద ఉన్న వ్యక్తులు జోక్యం చేసుకుని దాడిని ఆపగలిగారు. ఈ సంఘటనను ధృవీకరిస్తూ, కొప్పల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రామ్ ఎల్ అరసిద్ధి పిటిఐకి మాట్లాడుతూ గాయపడిన మహిళను జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారని, ఆమె పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారని అధికారులు తెలిపారు.

## అజిత్ పవార్ విమాన ప్రమాదం..
## కేంద్ర మంత్రి రాజీనామాకు రోహిత్ పవార్ డిమాండ్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనపై ఆయన మేనల్లుడు, ఔఅఖ(రాఖ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదానికి సంబంధించి రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తుండటంతో రాజకీయ వర్గాల్లో వేడి రాజుకుంది. తాజాగా రోహిత్ పవార్ ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రి పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తూ చేసిన విమర్శలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కూలిపోయిన ఎయిర్‌క్రాఫ్ట్ యాజమాన్యానికి, రాజకీయ నాయకులకు మధ్య ఉన్న సంబంధాలను రోహిత్ పవార్ ఎత్తిచూపారు. ఆ విమానం ఖాఖీ వెంచర్స్‌కు చెందినదని, దాని యజమాని రోహిత్ సింగ్‌కు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు.

# ఆ ఉద్యోగులకు నోటీసులు పంపుతోన్న ఐటీ శాఖ




ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు బిగ్ అలర్ట్. హై-శాలరీ ఉన్న కొంత మంది ఉద్యోగులకు ఐటీ శాఖ నుంచి నడ్జ్ నోటీసులు అందుతున్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేసే సమయంలో వెల్లడించని ఆదాయాలు, క్రిప్టో లాభాలు, ఈఎస్ఓపీ లాభాలు, విదేశీ ఆస్తులు, ఆదాయాల వంటి అంశాల్లో లోపాలను సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఈ నోటీసులను ఐటీ శాఖ జారీ చేస్తోంది. ఇది ఒక మంచి అవకాశంగా చూడాలని, ఏవైనా ఆస్తుల వివరాలు మర్చిపోయి ఉంటే సరిచేసుకుని స్వచ్ఛందంగా ట్యాక్సులు చెల్లించాలని సూచిస్తోంది. కఠిన చర్యలకు ఎదుర్కోక ముందే స్వచ్ఛందంగా తమ పొరపాట్లు, తప్పులను సరిచేసుకునేందుకు ఇది చివరి అవకాశమని అధికారులు హెచ్చరించారు.ఒకే రాజకీయ పార్టీకి లేదా వివిధ స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు ఇచ్చేందుకు కొందరు ట్యాక్స్ పేయర్లు ఒకే చార్టర్డ్ అకౌంటెంట్ సేవలు ఉపయోగిస్తున్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో సంబంధిత సీఏలపై సైతం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతానికి మల్టీనేషనల్ కంపెనీల సీఈఓలు, మేనేజింగ్ డైరెక్టర్లు సహా ఉన్నతాధికారులకు ఈ నోటీసులు పంపించినట్లు తెలిపింది. భారీ పెనాల్టీలు విధించే ముందు తమ ఐటీఆర్‌లోని లోపాలను సరిచేసుకోవాలని కోరింది. అధిక ఆదాయ వర్గాల ఐటీ రిటర్న్లను సమీక్షించగా ఈ ఆదాయాల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు ఐటీ శాఖ తెలిపింది. గైడ్ అండ్ ఎనేబుల్ (నడ్జ్) కార్యక్రమంలో భాగంగా సవరించిన ఐటీఆర్ ఫైల్ చేయాలని సూచిస్తోంది. నడ్జ్ నోటీసు అంటే డీఐఎన్ నంబర్‌తో వచ్చే అధికారిక పన్ను నోటీసు కాదని ట్యాక్స్ పేయర్లు గుర్తించాలి. కేవలం తమ పొరపాట్లను సరిచేసుకునేందుకు ఇచ్చే ముందస్తు హెచ్చరిక. ఐటీఆర్‌లో ప్రకటించిన ఆదాయం, ఆస్తులు సరైనవేనవే అయితే డీఐఎన్ నంబర్‌తో అధికారిక ఐటీ నోటీసు వచ్చే వరకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని పన్ను నిపుణులు చెబుతున్నారు. నడ్జ్ నోటీసులు అందిన ట్యాక్స్ పేయర్లు తమ ఐటీ రిటర్న్లను మరోసారి సమక్షించుకోవాలి. పూర్తి లావాదేవీల వివరాలు సేకరించాలి. అవసరమైతే సెక్షన్ 139 (8ఏ) కింద అప్డేటెట్ రిటర్న్ ఫైల్ చేయాలి. వడ్డీతో పాటు అదనపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

# అనిల్ అంబానీకి ఈడీ తాజా సమన్లు




ఈ నెల 26న విచారణకు హాజరుకావాల్సిందిగా రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా సమన్లు జారీ చేసింది. ఈ వారంలో ఆయన విచారణకు గైర్హాజరు కావడంతో, ఈడీ తాజా సమన్లు ఇచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 10, 17 తేదీల్లో రెండు సార్లు విచారణకు అనిల్ అంబానీ భార్య టీనా అంబానీ కూడా గైర్హాజరు అయ్యారు. ఆమెకు ఈడీ తాజా సమన్లు ఇచ్చిందా, లేదా అనేది స్పష్టత లేదు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద వేర్వేరుగా వాంగ్మూలాన్ని నమోదుచేయడానికి అనిల్, టీనాలను పిలిచినట్లు ఈడీ అధికారులు తెలిపారు. 2025 ఆగస్టులో అనిల్ అంబానీ ఒకసారి ఈడీ విచారణకు హాజరయ్యారు. అనుమతి లేకుండా భారత్ విడిచివెళ్లను: ముందస్తు అనుమతి లేకుండా తాను దేశం విడిచి వెళ్లనని సుప్రీంకోర్టులో హామీ పత్రాన్ని అనిల్ అంబానీ దాఖలు చేశారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్‌నకు సంబంధించి రూ. 40,000 కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై ప్రభుత్వ ఏజెన్సీలు జరుపుతున్న విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన తెలిపారు. తాను దేశం విడిచి పారిపోయే వ్యక్తిని కాదని, చట్టపరమైన ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో అనిల్ అంబానీ పేర్కొన్నారు.

# సీ-390 మిలీనియం విమానాల కోసం ఎంఆర్ఓ కేంద్రం




మహీంద్రా గ్రూప్‌తో కలిసి భారత్‌లో విమానాల నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయెర్ గురువారం ప్రకటించింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) ప్రోగ్రామ్ కోసం ఎంబ్రాయెర్ సీ-390 మిలీనియం విమానాలు ఎంపికైన నేపథ్యంలో, ఈ ప్రకటన వెలువడింది. స్థానికీకరణ వ్యూహంలో భాగంగా ఎంఆర్ఓ కేంద్రాన్ని ఎంబ్రాయెర్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిపాదిత కేంద్రం సీ-390 విమానాలకు పూర్తి తోడ్పాటు అందిస్తుందని, తద్వారా విమానాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని ఎంబ్రాయెర్ తెలిపింది. బేస్, హెవీ మెయింటెనెన్స్, నిర్మాణాత్మక తనిఖీలు, పరీక్షలు, విడిభాగాల మరమ్మతు, ఓవర్‌హాల్, ఏవియానిక్స్ సపోర్ట్, శిక్షణ వంటి పూర్తి స్థాయి సేవలను ఈ కేంద్రం అందిస్తుందని పేర్కొంది. భారత భవిష్యత్ రవాణా విమాన అవసరాలకు సీ-390 మిలీనియంను అద్భుత పరిష్కారంగా మలచడానికి రెండు సంస్థలు కట్టుబడి ఉన్నాయని వివరించింది. భారత్‌లో సీ-390 మిలీనియం మల్టీ-మిషన్ మిలిటరీ రవాణా విమానాలను ఉత్పత్తి చేయడానికి గత ఏడాది అక్టోబరులో ఎంబ్రాయెర్, మహీంద్రా గ్రూప్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి.

# ఏఐ రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.10 లక్షల కోట్లు పెట్టుబడి




దేశీయ అతిపెద్ద ప్రైవేట్ రంగ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీ పెట్టుబడుల ప్రకటన చేసింది. అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రంగంలో ఏకంగా రూ.10 లక్షల కోట్లు పెట్టుబడిగా పెడతామని సంస్థ అధినేత ముఖేశ్ అంబానీ వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఆయన ఈ ప్రకటన చేశారు. రిలయన్స్, జియో కలిసి వచ్చే ఏడేళ్ల కాలంలో ఈ పెట్టుబడులు పెట్టనున్నాయని అంబానీ తెలిపారు. ఏఐలో తాము కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నాం. దేశవ్యాప్తంగా ప్రజలకు ఏఐని తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్టు ముఖేశ్ అంబానీ చెప్పారు. మనదేశం కొత్త ఏఐ యుగంలోకి ప్రవేశించడానికి అవసరమైన సహాయం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. జియో మొబైల్ డేటా, ఇంటర్నెట్‌ను చాలా చౌకగా ఇచ్చినట్లుగానే, ఇప్పుడు ఏఐ టెక్నాలజీని చాలా తక్కువ ఖర్చులో అందుబాటులో ఉంచాలని ఆశిస్తోంది. జియో ఇంటెలిజెన్స్ దేశీయ స్వంత శక్తివంతమైన కంప్యూటర్ వ్యవస్థలను నిర్మిస్తుందని ముఖేష్ అంబానీ స్పష్టం చేశారు. దీనిద్వారా భారత్ ఏఐ టెక్నాలజీ కోసం ఇతర దేశాలపై పూర్తిగా ఆధారపడవలసిన అవసరం ఉండదన్నారు. జియో అత్యుత్తమ ప్రపంచ టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తుంది. కానీ వారి నుంచి ఏఐ టెక్నాలజీని కొనుగోలు చేయడానికి బదులుగా, జియో వారితో కలిసి ఏఐ భవిష్యత్తును నిర్మించి, రూపొందించాలనుకుంటోందని ముఖేశ్ అంబానీ పేర్కొన్నారు.

# వీకెండ్ వేళ మార్కెట్లకు లాభాల కళ.. 82,800 దాటిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో సూచీలు రాణించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 316 పాయింట్లు లాభపడి 82,814 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 25,571 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, ఐటీ, మీడియా మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.98 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 1.68 శాతం, మెటల్ సూచీ 1.25 శాతం చొప్పున లాభపడ్డాయి. పవర్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్‌ఎంసీజీ స్టాక్స్‌లో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, మార్కెట్ బ్రెడ్త్ మాత్రం ప్రతికూలంగా ఉంది. 2,043 షేర్లు లాభపడగా, 2,511 షేర్లు నష్టాల్లో ముగిశాయి.
రోజు ప్రారంభంలో ఒడుదొడుకులకు లోనైనప్పటికీ, తక్కువ స్థాయిల వద్ద నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లు పుంజుకున్నాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ కొంత రేంజ్-బౌండ్‌లోనే ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.02 శాతం బలపడి 90.99 వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ కీలకమైన 61,200 స్థాయి పైన ముగియడం సానుకూల సంకేతమని, 61,000 స్థాయి కీలక మద్దతుగా, 61,350-61,400 స్థాయి తక్షణ నిరోధకంగా పనిచేయవచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

# ఫోన్‌పేలో రూ. 5 వేల వరకు పిన్ నంబర్ అక్కర్లేదు




యూపీఐ చెల్లింపుల కోసం ఫోన్‌పే వాడుతున్న కస్టమర్లకు భారీ గుడ్‌న్యూస్. తక్కువ మొత్తంతో లావాదేవీలు చేసేవారు ఇకపై ప్రతి ట్రాన్సాక్షన్‌కు పిన్ నంబర్‌ను ఎంటర్ చేయాల్సిన అవసరంలేదు. దేశీయ దిగ్గజ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ గురువారం యూపీఐ చెల్లింపుల కోసం సరికొత్తగా బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను ప్రారంభిస్తున్నట్టు వెల్లడించింది. కస్టమర్లు తమ స్మార్ట్‌ఫోన్ నుంచి ఫింగర్‌ప్రింట్, ఫేస్ ఐడీ ద్వారా లావాదేవీలను పూర్తి చేసేందుకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఫీచర్ రూ. 5,000 వరకు లావాదేవీలకు వేగవంతమైన 'వన్-టచ్ ' పేమెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ప్రస్తుతం రూ. 5,000 వరకు యూపీఐ చెల్లింపులకు బయోమెట్రిక్‌ను ఉపయోగించవచ్చు. ఈ పరిమితి దాటిన మొత్తం లావాదేవీలకు కస్టమర్లు పిన్ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ పరిమితి ముఖ్యంగా స్నేహితులు, కుటుంబసభ్యులు, దుకాణాల్లో ఎక్కువగా ఉపయోగపడుతుంది. రద్దీ ఉన్న ప్రదేశాల్లో, తక్కువ సమయంలో లావాదేవీలను పూర్తి చేయాల్సి వచ్చినప్పుడు ఈ ఫీచర్ ఎంతో ఉపయోగప్డుతుందని, ఎవరైనా మన పిన్ నంబర్‌ను చూస్తారనే ఆందోళన ఉండదని ఫోన్‌పే అభిప్రాయపడింది. ఈ ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి ఫోన్‌పే యాప్‌లోని ప్రొఫైల్‌లో మేనేజ్ పేమెంట్స్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. బయోమెట్రిక్ పేను ఎంచుకుని, బ్యాంకు అకౌంట్‌ను ఎనేబుల్ చేయాలి. ఆ తర్వాత యూపీఐ పిన్, బయోమెట్రిక్ ద్వారా వన్-టైమ్ సెటప్‌ను పూర్తి చేయడమే. అయితే, ప్రస్తుతానికి ఈ ఫీచర్ ఆండ్రాయి యూజర్లకు మాత్రమే అందుబాటులోకి తెచ్చామని, త్వరలో ఐఓఎస్ యూజర్లకు కూడా అందించనున్నట్టు కంపెనీ పేర్కొంది.

# దేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీ తీసుకురానున్న ఈప్లేన్ కంపెనీ



ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (ఈవీటోల్) విమానాలను దేశీయంగా అభివృద్ధి చేసిన ఈప్లేన్ కంపెనీ గ్లోబల్ టెక్ దిగ్గజం ఎన్విడియాతో కీలక భాగస్వామ్యం కుదుర్చుకుంది. కంపెనీల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా దేశీయ మొట్టమొదటి ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీ ఈ200ఎక్స్‌ను నిర్మించడానికి ఎన్విడియాతో కలిసి పనిచేసినట్లు గురువారం ప్రకటనలో తెలిపింది. ఈ భాగస్వామ్యంలో ఆర్థిక పరమైన అంశాలు ఉండవని, పూర్తిగా మేధో సహకారంపై మాత్రమే ఆధారపడి ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఈప్లేన్ ఈ200ఎక్స్ విమానాల తయారీలో డిజిటల్ ట్విన్ అంటే ఈ విభాగం డిజిటల్ కాపీని సృష్టించడానికి ఎన్విడియా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. ఈ వర్చువల్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను కంప్యూటర్‌లో పరీక్షిస్తారు.ఇది సెన్సార్ ఫెయిల్యూర్, ఢీకొనే ప్రమాదాలను డిజిటల్‌గా టెస్ట్ చేస్తారు. దీనివల్ల డబ్బు ఆదా అవడమే కాకుండా రిస్క్‌ను తగ్గిస్తుంది. ఎన్విడియా ఈప్లేన్ సురక్షితంగా ఎగరడానికి అవసరమైన ముఖ్యమైన సాఫ్ట్‌వేర్‌ను అందిస్తుంది. నిజ జీవితంలో ఈ పరీక్షలు నిర్వహించాలంటే ఎక్కువ ఖర్చు అవుతుంది, పైగా రిస్క్ ఎక్కువ. సమయం కూడా ఎక్కువ కావాల్సి ఉంటుంది. అందుకే కంపెనీ ఈ విధమైన వర్చువల్ టెస్టింగ్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. దీనివల్ల విమానాన్ని లక్షల కిలోమీటర్లు వర్చువల్‌గా ఎగరేలా చేయవచ్చు. సిమ్యులేషన్‌లను ఉపయోగించి విమాన సాఫ్ట్‌వేర్‌ను పరీక్షిస్తారు.

# ఈ లడ్డు లాభాలు తెలిస్తే తినకుండా ఉండలేరు!



నువ్వుండలు.. చిన్నవిగా కనిపించినా, ఆయుర్వేదంలో వాటి ఆరోగ్య ప్రయోజనాలు అసాధారణమైనవి.. నువ్వుండలు జింక్, ఐరన్, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలతో నిండి ఉంటాయి.. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇవి ఎముకల బలానికి అద్భుతమైన మొక్కల ఆధారిత కాల్షియానికి మూలం. ఆయుర్వేదం, ఆయుష్షును గురించి తెలిపే ప్రాచీన భారతీయ వైద్య విధానం.. ఆహారాన్ని ఔషధంగా, ఔషధాన్ని ఆహారంగా పరిగణిస్తుంది. దీనికి ఉత్తమ ఉదాహరణ నువ్వుండలు.. నువ్వులు, బెల్లంతో కలిపి తయారుచేసే ఈ లడ్డూలు ఎన్నో సమస్యలను దూరం చేస్తాయి.. నువ్వుండలు చిన్నవిగా కనిపించినా, వీటి ఆరోగ్య ప్రయోజనాలు విస్తృతమైనవని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఏ సీజన్‌లోనైనా నువ్వుండలు శరీరానికి సహజమైన పోషకాలను అందిస్తూ, అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కల్పిస్తాయి. బెల్లం నువ్వుండలు మంచి పోషకాహారం.. ఇవి కాల్చిన నువ్వులు, బెల్లం కలిపి చేసే సాంప్రదాయ, ఆరోగ్యకరమైన తీపి వంటకం. ఇది కాల్షియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలమని.. దీనిని పెద్దవాళ్లు నుంచి చిన్న పిల్లల వరకు అందరూ తినవచ్చు..

నువ్వుండల ప్రయోజనాలు.. రోగనిరోధక శక్తి బలోపేతం: శీతాకాలంతోపాటు.. అన్ని కాలాల్లో ఇన్ఫెక్షన్లు సర్వసాధారణం. నువ్వుండలు రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయి. వీటిలో జింక్, ఐరన్, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక కణాల ఉత్పత్తికి సహాయపడతాయి. జింక్ టీ కణాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, నువ్వులు బృంహణకరం (పోషకమైనవి), బల్యం (బలాన్ని పెంచేవి), వాత-కఫ దోషాలను సమతుల్యం చేస్తాయి. శరీరానికి సహజమైన వెచ్చదనం: నువ్వుండలు శీతాకాలపు చలి నుండి రక్షణ కల్పిస్తాయి. నువ్వులలోని ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు, ముఖ్యంగా పాలిఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, శరీరంలో మెటబాలిక్ హీట్‌ను ఉత్పత్తి చేస్తాయి. శరీరాన్ని లోపల నుండి వెచ్చగా ఉంచుతాయి. ఆయుర్వేదం నువ్వులకు వేడి గుణం ఉందని చెబుతుంది.. అంటే అవి శరీరంలో వేడిని పెంచుతాయి. నువ్వుల నూనెను గోరువెచ్చగా చేసి పాదాలకు మర్దనా చేయడం కూడా స్థానిక రక్త ప్రసరణను పెంచి, చలిని తగ్గిస్తుంది.

బలమైన ఎముకలు, కీళ్ల ఆరోగ్యం: నువ్వులు మొక్కల ఆధారిత కాల్షియంకు అద్భుతమైన మూలం.. ఎముకల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, భాస్వరం ఎముకల సాంద్రతను పెంచి, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను నివారిస్తాయి. ముఖ్యంగా మహిళలకు నువ్వుండలు ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. ఆయుర్వేదం నువ్వులను అస్థి పోషక గుణం కలిగినవిగా వర్ణిస్తుంది. నువ్వుండలు కీళ్ల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. వీటిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ కీళ్ల వాపును, నొప్పుల తీవ్రతను తగ్గిస్తాయి. నువ్వుల నూనెతో మర్దనా చేయడం వాత దోషాన్ని తగ్గించి కీళ్లకు బలాన్నిస్తుంది.

మెరుగైన జీర్ణ ఆరోగ్యం: శీతాకాలంలో మలబద్ధకం, అజీర్తి సాధారణ సమస్యలు. నువ్వుండలలో కరిగే, కరగని ఫైబర్ అధికంగా ఉంటుంది. కరగని ఫైబర్ మలాన్ని మృదువుగా చేసి సులభంగా విసర్జనకు సహాయపడుతుంది. కరిగే ఫైబర్ పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఆయుర్వేదం నువ్వులకు అనులోమన గుణం ఉందని చెబుతుంది. ఇది వాతాన్ని క్రిందికి కదిలించి మలబద్ధకాన్ని నివారిస్తుంది. చర్మానికి, కణాల ఆరోగ్యానికి: నువ్వుండలు యాంటీ ఆక్సిడెంట్లకు నిలయం. ఇవి వృద్ధాప్య ఛాయలను అరికట్టి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. నువ్వులలోని సెసమిన్, సెసమాలిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం, నువ్వులకు రసాయన గుణం ఉంది. ఇది సప్త ధాతువులను (రస, రక్త, మాంస, మేదో, అస్థి, శుక్ర) పరిపుష్టం చేస్తుంది. నువ్వుల నూనెను చర్మానికి రాసుకోవడం వల్ల యవ్వనపు బిగుతుదనం వస్తుంది

గుండె ఆరోగ్యం, శక్తి: నువ్వుల్లోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ముఖ్యంగా ఒలిక్ యాసిడ్, రక్తంలో చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ) స్థాయిలను తగ్గించి, రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆయుర్వేదం నువ్వులు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయని చెబుతుంది. కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్షణ ? నిరంతర శక్తిని అందించి, రోజంతా చురుకుగా ఉంచుతాయి. రక్తహీనత నివారణ: రక్తహీనతతో బాధపడేవారికి నువ్వుండలు ఒక అద్భుతమైన పరిష్కారం. నువ్వులలో అధికంగా ఉండే ఐరన్ హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, శరీరంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తుంది. నల్ల నువ్వులు రక్త వర్ధకంగా పనిచేస్తాయని ఆయుర్వేదం పేర్కొంటుంది.

# కూర వండి తింటే కొండల్ని కూడా పిండి చేసే బలం




కొండపిండి ఆకు, దీనిని కిడ్నీలో రాళ్లు కరిగించడానికి ఉపయోగించే సంప్రదాయ ఔషధంగా గిరిజనులు తరతరాలుగా నమ్ముతున్నారు. కొండపిండి ఆకు కూర వండుకునే విధానం, దాని ఆరోగ్య ప్రయోజనాలను ఈ కథనంలో తెలుసుకుందాం. మూత్రపిండాల్లో రాళ్లను తొలగించడమే కాకుండా, స్త్రీలలో గర్భసంచి సమస్యలకూ ఇది మేలు చేస్తుందట.కొండపిండి ఆకు, గిరిజన ప్రాంతాలలో విరివిగా లభించే ఒక వనమూలిక. ఇది మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడానికి ఒక శక్తివంతమైన సంప్రదాయ ఔషధంగా తరతరాలుగా ఉపయోస్తున్నారు. ఆధునిక జీవనశైలిలో 30 సంవత్సరాలు దాటిన చాలా మందిని వేధిస్తున్న కిడ్నీలో రాళ్ల సమస్యకు ఇది ఒక అద్భుతమైన పరిష్కారం అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. గిరిజన ప్రజలు అడవిలో దొరికే వనమూలికలను ఉపయోగిస్తున్నారట. కొండపిండి ఆకును గుర్తించడం చాలా సులభం. దీని ఆకులు బూడిద రంగులో ఉండి, అక్కడక్కడ పువ్వుల మాదిరిగా కనిపిస్తాయి. ఈ ఆకును ఏజెన్సీ ప్రాంతాల్లో లేదా గ్రామాల సమీపంలో కూడా గుర్తించవచ్చు. ఆకులను సేకరించిన తర్వాత, వాటిని జాగ్రత్తగా శుభ్రం చేసి, లేత ఆకులు, చిగుళ్లు, పూతలను మాత్రమే ఏరుకోవాలి. ఈ ప్రక్రియలో చెత్తను తొలగించడం చాలా ముఖ్యం.

కొండపిండి ఆకు కూర వండే విధానం: మొదటగా, ఆకులను శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి.

కావలసిన పదార్థాలు: ఉల్లిపాయలు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, పచ్చిశనగపప్పు, జీలకర్ర. ముందుగా పొయ్యి మీద మట్టిపాత్రను పెట్టి వేడి చేయాలి. పాత్ర వేడెక్కిన తర్వాత నూనె వేసి, నూనె మరిగిన తర్వాత పచ్చిశనగపప్పు, జీలకర్ర వేసి కలుపుకోవాలి. తర్వాత వెల్లుల్లి, పచ్చి మిర్చి, ఉల్లిపాయలు వేసి బాగా వేగనివ్వాలి. ఇవి బాగా వేగిన తర్వాత తరిగిన కొండపిండి ఆకును వేసి బాగా కలపాలి. ఆకు బాగా ఉడకడానికి సరిపడా ఉప్పు (గడ్డ ఉప్పు దంచి మెత్తగా చేసి వేయడం మంచిది) వేసుకోవాలి. కూర అడుగు పడుతున్నప్పుడు కొద్దిగా నీళ్లు పోసి బాగా కలిపి ఉడికించుకోవాలి. కూర ఉడికిన తర్వాత దించుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాలు: కొండపిండి ఆకు కూర రుచికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. ఇది ముఖ్యంగా మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రాళ్లను కరిగించే శక్తి ఈ ఆకుకు ఉంటుందట. అందుకే దీనిని కొండలను కూడా పిండి చేసే సత్తా ఉన్న ఆకు అని కూడా అంటారు. పురుషులలో కిడ్నీలో రాళ్లను కరిగించడంలో సహాయపడటమే కాకుండా, స్త్రీలలో గర్భసంచి సమస్యలను కూడా ఇది తొలగిస్తుందట. ఈ సంప్రదాయ పద్ధతిని పాటించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు.

# శివరాత్రికి రేగు పండ్లను నైవేద్యంగా ఎందుకు పెడతారు?





మహా శివరాత్రి పండుగ నాడు రేగుపండ్లను నైవేద్యంగా పెడతారు. రేగి పండ్లును బదరీఫలం అంటారు. నరనారాయణులు ఈ బదరీ వృక్షం (రేగుచెట్టు) వద్ద ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారనీ, ఆ ఫలాలని తింటూ తమ తపస్సుని కొనసాగించారనీ ప్రతీతి. వారు తపస్సు చేసే సమయంలో దేవతలు వారి తలపైన రేగి పండ్లు కురిపించారట. అందుకే ఆ ప్రదేశానికి బదరీక్షేత్రం అన్న పేరు వచ్చిందని చెబుతారు. ఈ కారణంగానే ఈ పండ్లను ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు.మహా శివరాత్రికి నైవేద్యంగా పెట్టే ఈ రేగి పండ్లు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం రేగు పండ్లలోని సహజ లక్షణాలు శరీరాన్ని లోపలి నుంచి బలోపేతం చేస్తాయి. ఉపవాస సమయంలో శక్తిని కాపాడుకోవడానికి సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉండే పండ్లు రేగు పండ్లు. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఆయుర్వేద నిపుణులు కూడా రేగు పండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. అవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. శరీరానికి అనేక ఇతర ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖచ్చితంగా రేగు పండ్లను తినాలని సిఫార్సు చేస్తున్నారు. రేగు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇవి మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. ప్రేగులను శుభ్రంగా ఉంచుతాయి. రేగు పండ్లు విటమిన్ సి కి మంచి మూలం. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. రేగు పండ్లను క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. కాలానుగుణ వ్యాధుల నుంచి కూడా రక్షణ పొందవచ్చు.రేగు పండ్లలో ఐరన్, ఇతర ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడతాయి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.రేగు పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. ముఖానికి సహజమైన మెరుపును ఇస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం రేగు పండ్లలో సహజ చక్కెరలు, తక్షణ శక్తిని అందించే పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల అలసట, బలహీనత, బద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు రేగు పండ్లకు దూరంగా ఉండాలి.


## క్యాబేజీ చికెన్ కర్రీ ఇలా వండి తింటే..



క్యాబేజీ చికెన్ కర్రీ వినడానికి కొత్తగా ఉన్నా ఒక్కసారి ఈ రెండింటిని కలిపి వండితే రుచి అద్భుతంగా ఉంటుంది. ఇలా ఎప్పుడూ మీరు తిని ఉండరు, కానీ ఒకసారి ట్రై చేయండి. కావాల్సిన పదార్థాలు : పావు కిలో చికెన్, క్యాబేజీ, ఉల్లిపాయలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ , పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టీ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, అర టీ స్పూన్ గరం మసాలా, 2 టేబుల్ స్పూన్స్ నూనె, రుచికి సరి పడినంత ఉప్పు తీసుకోవాలి. ముందుగా స్టవ్ వెలిగించి పాన్ లో నూనె వేసి అది వేడయ్యాక వేయండి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి రంగు మారే వరకు వేయించండి.ఇక ఇప్పుడు అల్లం-వెల్లుల్లి పేస్ట్ తీసుకుని దానిలో వేసి బాగా వేయించి చికెన్ ముక్కలను వేయండి. 5 నిమిషాలు తర్వాత పసుపు, ఉప్పు వేసి బాగా ఉడికించండి. చికెన్ ముక్కలు ఉడికిన తర్వాత క్యాబేజీని వేసి బాగా కలపండి. అలాగే పొయ్యి మీదే 10 నిముషాలు ఉంచి బాగా మగ్గనివ్వండి. కారం, మసాలా పొడులు వేసి బాగా కలుపుకోండి. గ్రేవీ తినాలనుకునే వారు ఒక గ్లాస్ నీళ్ళు పోసి 10 నిముషాలు అలాగే ఉంచండి. క్యాబేజీ, చికెన్ ఉడికిన తర్వాత దించే ముందు కొత్తిమీర వేసి కిందకు దించేయండి. అంతే, వేడి వేడి చికెన్, క్యాబేజి కర్రీ రెడీ.

## రైస్, చపాతీలకు సూపర్ కాంబో..

# తింటే వదిలిపెట్టరు



మష్రూమ్స్ లో పోషకాలు ఉంటాయి అలాగే మటన్ లో మనకి కావాల్సిన పోషకాలు ఉంటాయి. అయితే, ఈ రెండింటిని కలిపి వండి తింటే మంచి టేస్ట్ ఉంటుంది. కావాల్సిన పదార్థాలు : అర కిలో మటన్, 200 గ్రాములు పుట్టగొడుగులు, చిన్న ఉల్లిపాయ, టమోటాలు, అర టీ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ కారం, ఒక టీ స్పూన్ ధనియాల పొడి, అర టేబుల్ స్పూన్ వెల్లుల్లి పేస్ట్, ఒక టీస్పూన్ గరం మసాలా, రుచికి ఉప్పు, 3 టేబుల్ స్పూన్స్ నూనె, కొత్తిమీరను తీసుకోవాలి. ముందుగా మటన్‌ను రెండు సార్లు కడిగి శుభ్రం చేసి ఒక గిన్నెలోకి తీసుకుని ఆ తర్వాత వాటికీ ఉప్పు, పసుపు పట్టించి పక్కన పెట్టుకోండి. ఇప్పుడు పుట్టగొడుగులను తీసుకుని ఉప్పుతో కడిగి శుభ్రపరచుకోండి.స్టవ్ వెలిగించి కుక్కర్ పొయ్యి మీద పెట్టి దానిలో ఆయిల్ వేసి, అది వేడయ్యాక బిర్యానీ ఆకు, లవంగాలు వేసి బాగా వేయించండి. కొద్దీ సేపటి తర్వాత కట్ చేసి పెట్టుకున్న ఉల్లిపాయలు ముక్కలు వేసి రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు మూత తీసి అన్ని రకాల మసాలా పేస్ట్ లు, టమాటాలు కూడా వేసి ఉడకనివ్వాలి. ఇప్పుడు మటన్ ముక్కలు వేసి మూత పెట్టండి. గ్రేవీ కోసం రెండు గ్లాస్ లు నీళ్ళు పోయండి. చివర్లో కుక్కర్ మూత తీసి, పుట్టగొడుగులను వేసి 20 నిమిషాల పాటు మీడియం మంట మీద ఉంచండి. ఇప్పుడు దించే ముందు కొత్తిమీర వేసి ఐదు నిముషాలు ఉంచి దించేయండి. అంతే, వేడి వేడి మష్రూమ్ మటన్ కర్రీ.

## యవ్వనంగా కనిపించాలంటే..!



నేటి కాలంలో విపరీతమైన కాలుష్యం, హార్డ్ వాటర్ సమస్యలు, చర్మాన్ని దెబ్బతీసే ఎండ తీవ్రత, ఒత్తిడి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇన్ని సవాళ్ల మధ్య మన చర్మం తన సహజమైన మెరుపును కోల్పోయి, చిన్న వయసులోనే ముడతలతో వృద్ధాప్య ఛాయలు కనిపిస్తున్నాయి. చాలామంది మార్కెట్లో దొరికే ఖరీదైన కెమికల్ ప్రొడక్ట్స్ వాడుతూ ఫలితం లేక నిరాశ చెందుతుంటారు. కానీ మన పూర్వీకులు, రాజవంశీకులు తమ చర్మం ఎప్పుడూ కాంతివంతంగా, యవ్వనంగా ఉండటానికి ఒక రహస్య తైలాన్ని ఉపయోగించేవారు. ఆయుర్వేద గ్రంథాలలో 'చర్మ సంరక్షణ అమృతం'గా పిలువబడే ఆ నూనె.. ఇప్పుడు మళ్ళీ ఆధునిక ప్రపంచంలో సెన్సేషన్ సృష్టిస్తోంది. కేవలం కొద్ది చుక్కలతోనే మీ ముఖంపై రాజసం ఉట్టిపడేలా చేసే ఆ వేదకాలం నాటి అద్భుతం పేరే 'కుంకుమాది తైలం'. దీని చరిత్ర ఏంటి? ఇందులో ఏయే మూలికలు దాగి ఉన్నాయి? కుంకుమాది అనే పేరు సంస్కృత పదమైన 'కుంకుమ' నుంచి వచ్చింది. కుంకుమ అంటే కుంకుమపువ్వు లేదా కేసర్ అని అర్థం. పూర్వకాలంలో రాజకుటుంబీకులు తమ ముఖం ఎప్పుడూ కాంతివంతంగా, యవ్వనంగా ఉండటానికి ఈ తైలాన్ని ప్రధానంగా ఉపయోగించేవారు. ఇది చర్మ రంధ్రాలను మూసివేయకుండా, లోపలి నుంచి శుభ్రం చేసి సహజమైన మెరుపును అందిస్తుంది. జంతువులపై ఎటువంటి పరీక్షలు చేయకుండా, కేవలం ప్రకృతి సిద్ధమైన మూలికలతో తయారయ్యే ఈ నూనె ఇప్పుడు మళ్ళీ అందరి ఆదరణ పొందుతోంది. అద్భుతమైన మూలికల సమ్మేళనం.. కుంకుమాది తైలంలో ఉండే ప్రతి పదార్థం చర్మానికి ఒక వరమనే చెప్పాలి. కుంకుమపువ్వు ఈ తైలంలో ప్రధానమైనది. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చడమే కాకుండా, నల్లటి మచ్చలను తగ్గిస్తుంది. మంజిష్ట ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. ఇది మొటిమలు, మంటను తగ్గించి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. రక్తంలోని మలినాలను తొలగించి ముఖానికి సహజమైన మెరుపునిస్తుంది. వట్టివేరు మచ్చలు, గాయాల గుర్తులు, మొటిమల మచ్చలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. చర్మంపై ఉన్న మృతకణాలను తొలగిస్తుంది. యష్టిమధు కళ్ల కింద నల్లటి వలయాలను, హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గించడంలో ఇది కీలకం. చందనం చర్మానికి చలువనిచ్చి సూర్యరశ్మి వల్ల వచ్చే ట్యాన్‌ను తొలగిస్తుంది.

## ప్లాన్ మాములుగా లేదు: అభిషేక్‌ను పవర్ ప్లేలోనే ఔట్ చేసేందుకు సౌతాఫ్రికా భారీ స్కెచ్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్? సూపర్ 8 రౌండ్?లో భాగంగా ఇండియా, సౌతాఫ్రికా తలపడనున్నాయి. 2026, ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచులో ఎలాగైనా గెలిచి సెమీస్?కు లైన్ క్లియర్ చేసుకోవాలని ఇరు జట్లు భావిస్తున్నాయి. ఈ క్రమంలో టీమిండియా బలహీనతలపై సౌతాఫ్రికా ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే ఫామ్?లేమితో సతమతమవుతోన్న టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మను పవర్ ప్లేలోనే ఔట్ చేసేందుకు ప్రొటీస్ జట్టు వ్యూహం పన్నుతోంది. ఈ వరల్డ్ కప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత యువ ఓపెనర్ అట్టర్ ఫ్లాఫ్ అయ్యాడు. గ్రూప్ స్టేజ్‌లో మూడు మ్యాచులు ఆడి మూడింట్లో డకౌట్ అయ్యి తీవ్రంగా నిరాశ పర్చాడు. ముఖ్యంగా స్పిన్‌ను ఎదుర్కోవడంలో అభి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. మూడు మ్యాచుల్లో స్పిన్ బౌలింగ్‌లోనే ఔట్ కావడం అతడి బలహీనతను బయటపెడుతోంది. ఈ విషయాన్ని గమనించిన దాయాది పాకిస్తాన్ జట్టు ఇదే స్పిన్ వ్యూహంతో అభిషేక్ శర్మను బోల్తా కొట్టించింది.గ్రూప్ దశలో ఇండియా, పాక్ మధ్య జరిగిన హైఓల్టేజ్ పోరులో పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా తొలి ఓవర్లలోనే అభిషేక్‌ను ఔట్ చేశాడు. షాహీన్ అఫ్రీది వంటి ప్రపంచస్థాయి ఫాస్ట్ బౌలర్?ను కూడా పక్కన పెట్టి స్వయంగా సల్మాన్ అఘానే ఫస్ట్ ఓవర్ వేశాడు. ఇందుకు ప్రధాన కారణం అభి స్పిన్?ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడటమే. అనుకున్నట్లుగానే పాకిస్తాన్ ప్లాన్ వర్కౌట్ అయ్యింది. సల్మాన్ అఘా బౌలింగ్‌లో అభి ఫస్ట్ ఓవర్లోనే క్యాచ్ ఔట్ పెవిలియన్ బాట్ పట్టాడు. సూపర్ 8కు ముందు సౌతాఫ్రికా కూడా పాకిస్తాన్ వ్యూహాన్నే అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. అభిషేక్?పై స్పిన్ మంత్రం ప్రయోగించాలని ప్రొటీస్ కెప్టెన్ మార్క్రమ్ ప్లాన్ చేస్తున్నాడు. సేమ్ సల్మాన్ అఘా మాదిరిగానే తాను స్పిన్ బౌలింగ్ వేసి పవర్ ప్లేలోనే డేంజరస్ అభిషేక్ శర్మను ఔట్ చేయాలని మార్క్రమ్ వ్యూహం

రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మార్క్రమ్ ప్రాక్టీస్ సెషన్‌లో లెఫ్టార్మ్ బ్యాటర్లకు స్పిన్ బౌలింగ్ చేస్తూ కనిపించాడు. అభిని క్లీన్ బౌల్డ్ చేసిన నెదర్లాండ్స్ బౌలర్ ఆర్యన్ దత్ బౌలింగ్ శైలిని మార్క్రమ్ తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ కూడా నెట్స్‌లో కఠినంగా శిక్షణ పొందాడు. దీంతో భారత ఓపెనర్లను దెబ్బకొట్టేందుకు స్పిన్ అస్త్రాన్నే ప్రయోగించాలని సౌతాఫ్రికా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# టాపర్స్‌కి ఒక గ్రూప్, రన్నర్స్‌కి మరో గ్రూప్.. ఇదేక్కడి ప్రి-సీడింగ్ మావా అంటూ ట్రోలింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్‌లోని సూపర్-8 ఫార్మాట్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రస్తుతం తీవ్ర స్థాయిలో విమర్శలను ఎదుర్కొంటుంది. ప్రీ-సీడింగ్ విధానంతో టోర్నీలో అసమతుల్యత ఏర్పడిందని క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. మరి.. ప్రీ-సీడింగ్ విధానం విషయంలో ఐసీసీపై క్రీడా వర్గాలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేయడానికి గల ప్రధాన కారణం ఇప్పుడు తెలుసుకుందాం.. సాధారణంగా ఏదైనా టోర్నమెంట్లో గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన టీమ్స్ ని నెక్స్ట్ రౌండ్ లో కాస్త ఉపశమనం కలిగించేలా సీడింగ్ విధానం అమలు చేస్తుంటారు. ఈసారి మాత్రం ఐసీసీ టీ20 ప్రపంచ కప్-2026 టోర్నమెంట్ ప్రారంభం కాకముందే.. ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. మెగా టోర్నీ స్టార్ట్ కాకముందే సీడింగ్ చేయడంతో దీన్ని ప్రీ-సీడింగ్ అని పిలుస్తుంటారు. దీని అర్థం ఏంటంటే.. ఒక టీమ్ తన గ్రూపులో మొదటి స్థానంలో నిలిచినా, సెకండ్ ప్లేస్ లో నిలిచినా... ముందుగా అనుకున్న స్లాట్‌లోనే ఉంటుంది. ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. గ్రూప్ స్టేజ్‌లో లీగ్ టాపర్స్ గా నిలిచిన టీమిండియా, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే టీమ్స్.. సూపర్ 8లో ఒకే గ్రూపులో ఉండగా, మరోవైపు రెండో స్థానంలో నిలిచిన పాక్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు ఇంకో దాంట్లో ( గ్రూప్-2) ఉన్నాయి. ఈ విధానమే ప్రస్తుతం క్రికెట్ అభిమానులతో పాటు క్రీడా విశ్లేషకుల నుంచి ఐసీసీ విమర్శలు ఎదుర్కొనేలా చేస్తుంది.




ఈ విధానంతో గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన 4 టీమ్స్ లో రెండు జట్లు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో గ్రూప్ స్టేజ్‌లో రెండో స్థానంలో ఉన్న రెండు జట్లకు సెమీస్‌కు చేరడం ఈజీ కానుంది. ఇది టాపర్లుగా నిలిచిన టీమ్స్ కు అన్యాయం చేసినట్లేనని.. ప్రతిభను గౌరవించేలా ఐసీసీ నిర్ణయం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సూపర్-8 ఫార్మాట్ విధానంపై వస్తున్న విమర్శలపై ఐసీసీ రియాక్ట్ అయింది. ఈ మెగా టోర్నీని భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.. రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌కు సంబంధించి ముందుగానే షెడ్యూల్ ప్లాన్ చేసుకోవడం కోసమే ఇలా చేశామని తేల్చి చెప్పింది. వేల సంఖ్యలో ప్రయాణించే ఫ్యాన్స్, మీడియాకు ఇబ్బంది కలగకుండా ఏ జట్టు ఎక్కడ ఆడుతుందో ముందే తెలిస్తే ఈజీగా ఉంటుందని ఐసీసీ ప్రీ-సీడింగ్ విధానాన్ని సమర్థించుకుంది.

## భారత్ సెమీస్‌కి వెళ్లదు..'ఓరే పిచ్చి నా కొడకా!'అంటూ పాక్ మాజీ క్రికెటర్‌పై నెటిజన్స్ ఫైర్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా రేపటి నుంచి జరిగే సూపర్--8 దశలో జరిగే ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై' లాంటిదే. సెమీఫైనల్స్ టార్గెట్ గా ఎనిమిది జట్లు బరిలోకి దిగుతున్నాయి. సూపర్--8 దశ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ మాజీ పేసర్ మహ్మద్ అమీర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్ సెమీఫైనల్స్‌కి చేరదని స్పష్టం చేశాడు. పాకిస్తాన్‌తో మ్యాచ్ తప్ప భారత్ బ్యాటింగ్ అంతగా నిలకడగా కనిపించలేదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఒత్తిడి తట్టుకోలేక భారత బ్యాటింగ్ కూలిపోతుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు చాలా బలంగా ఉన్నాయి.. ఈ రెండు టీమ్స్ ఏ జట్టునైనా ఓడించే సత్తా ఉందని పేర్కొన్నాడు.



పాకిస్తాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ అమీర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అమీర్ వ్యాఖ్యలపై నెటిజన్లు స్పందిస్తూ, దాయాది దేశం నిరంతరం భారత్‌పై అక్కసు వెల్లగక్కడం తప్ప మరో పని లేదని మండిపడ్డారు. 'ఓరే పిచ్చి నా కొడకా!'అమీరు.. ముందు నీ పి(పా) కిస్తాన్ ని న్యూజిలాండ్ తో జరిగే మ్యాచ్ లో గెలవమని చెప్పుపో అంటూ సూచనలు చేస్తున్నారు. మరోసారి టీమిండియాపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా స్పందిస్తామని నెటిజన్లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. భారత్ ఇప్పటి వరకు లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో అన్ని గెలిచింది. సూపర్--8లో చిన్న తప్పు జరిగిన కూడా భారీ మూల్యం చెల్లించాల్సిందే. దక్షిణాఫ్రికా దూకుడుతో పాటు క్రమశిక్షణతో ఆడుతోంది. వెస్టిండీస్ పవర్ హిట్టింగ్‌తో చాలా ప్రమాదకరంగా ముందుకు వెళ్తుండగా.. జింబాబ్వే కూడా పెద్ద జట్లకు తామేమి తక్కువ కాదని ఇప్పటికే ఆసీస్, శ్రీలంక జట్లను ఓడించి చూపించింది. భారత మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కొద్దిగా తడబడినా కూడా, ప్రత్యర్థి టీమ్స్ వెంటనే దాన్ని ఉపయోగించుకుంటున్నాయి. భారత్ సూపర్--8 ప్రయాణం ఫిబ్రవరి 22వ తేదీన అహ్మదాబాద్‌లో నరేంద్ర మోడీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేతో, మార్చి 1వ తేదీన కోల్‌కతాలో వెస్టిండీస్‌తో తమ గ్రూప్--1లోని చివరి మ్యాచ్ ఆడుతుంది. ఈ నాలుగు మ్యాచులలో సెమీఫైనల్ చేరాలంటే కనీసం రెండు విజయాలు అవసరం.. కాగితంపై ఈజీగా కనిపించినా.. వాస్తవంగా ప్రతి మ్యాచ్ నాకౌట్‌లాంటిదే.సూపర్--8 గ్రూపులు ఖరారు

గ్రూప్--1: భారత్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్

గ్రూప్--2 శ్రీలంక, పాకిస్తాన్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్



**ది బ్లఫ్ ప్రెస్ టూర్‌లో ప్రియాంక చోప్రా టోన్ సెట్ చేసింది**

# రప్పాడించేస్తోన్న కీర్తి సురేష్!

టాలీవుడ్ లో కీర్తి సురేష్ జర్నీ ఎలా ప్రారంభమై ఎలాంటి టర్నింగ్ లు తీసుకుందో చెప్పాల్సిన పనిలేదు. -మహానటి- తర్వాత కెరీర్ ఒకలా సాగుతుందనుకుంటే? అందుకు భిన్నంగా ప్రయాణం మందుకు సాగింది. కేవలం డీసెంట్ పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరవ్వాలనుకున్న అమ్మడి స్ట్రాటజీ కొంత వరకూ వర్కౌట్ అయింది. కానీ ఇలాగే కొనసాగితే మొదటికే ముప్పు వస్తుందని భావించిన అమ్మడు ఒక్కసారిగా ట్రాక్ మార్చేసింది. వడి వడిగా గ్లామర్ పాత్రల వైపు అడుగులు వేసింది. అదే సమయంలో వివాహం అవ్వడం కలిసొచ్చింది. అప్పటికే పెళ్లైన భామలకు ఇండస్ట్రీలో డిమాండ్ ఏర్పడటంతో? కీర్తి సురేష్ కి కూడా అవకాశాలు మెరుగు పడ్డాయి.మునుపటి కంటే కొత్త అవకాశాలు అందుకోవడంలో వేగం పుంజుకుంది. 2024 లో నాలుగు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలోనే ఉంది. అటుపై ఏడాది రెండు సినిమాలతో అలరించింది. ఇదే సమయంలో బాలీవుడ్ ఎంట్రీ కూడా జరిగిపోయింది. అయితే డెబ్యూ అక్కడ ఆశించిన ఫలితాలు సాధించలేదు. అలాగని నటించిన సినిమాలన్నీ విజయం సాధించాయా? అంటే అదీ జరగలేదు. తన పాత్ర వరకూ న్యాయం చేసినా ఫైనల్ ఔట్ పుట్ ప్రేక్షకుల్ని నిరాశ పరిచింది. ఇందులో కీర్తి తప్పిందం ఎక్కడా కనిపించలేదు. తాజాగా అమ్మడి కిట్టీలో చాలా ప్రాజెక్ట్ లు కనిపిస్తున్నాయి.



ప్రస్తుతం తమిళ్ లో -కన్నెవేడి- అనే చిత్రంలో నటిస్తోంది. మలయాళంలో -తొట్టమ్- అనే మరో చిత్రంలోనూ నటిస్తోంది. తెలుగులో -రౌడీ జనార్దన- తోనూ బిజీగా ఉంది. ఇవి గాక వెంకటేష్ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలోనూ ఈ భామనే హీరోయిన్ గా పరిశీలిస్తున్నారు. ఇంత వరకూ ఈ జోడీ వెండి తెరపై కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఆజోడీపై ఆసక్తి నెలకొంది. అలాగే -మహేంద్రగిరి వానర-లోనూ అతిథి పాత్రలో నటిస్తోంది. తాజాగా కోలీవుడ్ లో మరో రెండు ప్రాజెక్ట్ లకు సైన్ చేసినట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.అలాగే హిందీలో కూడా ఓ సినిమాకు కమిట్ అయిందని ప్రచారం జరుగుతోంది. మాలీవుడ్ లో కూడా ఓ సీనియర్ స్టార్ కు జోడీగా నటిస్తుందని వార్తలొస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ లకు సంబంధించి అధికారికంగా విషయం వెల్లడి కావాల్సి ఉంది. సెకెండ్ ఇన్నింగ్స్ లో కీర్తి సురేష్ ఇంత బిజీ గా మారుతుందని తాను కూడా ఊహించి ఉండదు. అమ్మడికి వెంకటేష్ ప్రాజెక్ట్ కీలకమైంది. ఇందులో వెంకీకి జోడీగా సెట్ అయితే గనుక మిగతా సీనియర్ హీరోల సరసన ఛాన్సులు అందుకో వడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే చిరంజీవి, రజనీకాంత్ లాంటి స్టార్స్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించిన సంగతి తెలిసిందే.



**రాశి సింగ్ మోనోక్రోమ్ మ్యాజిక్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965